Crime News

# ది క్రైమ్ న్యూస్

తెలుగు దినపత్రిక

| శుక్రవారం, అక్టోబర్ 18, 2024 | సంపుటి - 20 | సంచిక 24 | వెల - 4రూ | పేజీలు - 12 |
|---|---|---|---|---|

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.



విలేకరులు కావలెను

అనతికాలంలోనే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విశేష ప్రజాదరణ పొందుతున్న ది క్రైమ్ న్యూస్ దిన పత్రికకు ఉమ్మడి జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్‌సీ ఇంచార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవజ్ఞులకు ప్రాధాన్యత ఇవ్వబడును

రాజకీయ అవగాహన కలిగిన కొత్త వారికి అవకాశం ఇవ్వబడును.

వివరాలకు సంప్రదించండి 6305584064


## సుప్రీం తదుపరి చీఫ్ జస్టిస్‌గా సంజీవ్ ఖన్నా

### కేంద్రానికి సిఫార్సు చేసిన సిజెఐ డివై చంద్రచూడ్



న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీకాలం నవంబర్ 10తో ముగియనుంది. దాంతో తన తరువాత సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ఆయన కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. 2లో

## మూసీ సుందరీకరణ కాదు..

# మూసీ పునరుజ్జీవం

### మూసీ మురికి నుంచి పేదలను కాపాడుతాం

మూడు నెలలు కెటిఆర్, హరీస్, ఈటెల అక్కడ ఉంటారా

పేదలను తరిమి కొట్టేంత దుర్మార్గం చేయలేదు

మీడియా సమావేశంలో వివరణ ఇచ్చిన సిఎం రేవంత్



తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవనమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనిని వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న పార్టీలపై ఆయన ఆగ్రమం వ్యక్తం చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూసీనది అభివృద్ధి ప్రాజెక్టు వివరాలు వెల్లడించారు. 'మూసీ దుర్గంధంలో మగ్గిపోతున్న వారికి మెరుగైన జీవితం ఇవ్వాలని ఈ ప్రాజెక్టు తలపెట్టామని అన్నారు. నగరం మధ్య గుండా నది వెళ్తున్న రాజధాని మరొకటి ఈ దేశంలో లేదు. దాదాపు 300 కి .మీ ప్రవహించే మూసీకి ఎంతో చరిత్ర, విశిష్టత ఉంది. మేం చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవం. కొందరు మెదడులో మూసీలో ఉన్న మురికికంటే ఎక్కువ విషం నింపుకొన్నారు.

హైదరాబాద్ :

మెదడులో విషం నింపుకొని మూసీ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ పరివాహక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలనేది ఈ ప్రభుత్వ ఆలోచన. మల్లన్న సాగర్, వేములఘాట్‌లో ఏం జరిగిందో గుర్తు తెచ్చుకోవాలి. రాత్రికి రాత్రే పోలీసులతో కొట్టించి, గుర్రాలతో తొక్కించి మేం ఖాళీ చేయించటం లేదు. రంగనాయక్‌సాగర్, కొండపోచమ్మ.. ఇలా ఎక్కడికైనా నేను వస్తా. నేడు మూసీ నది కాలుష్యానికి ప్రతీకగా మారింది. 1600కు పైగా నివాసాలు పూర్తిగా మూసీ నది గర్భంలో ఉన్నాయి. మల్లన్నసాగర్‌లో మునిగిపోయిన 14 గ్రామాల్లో ఎలా వ్యవహరించారో తెలుసా? మేం ఉన్నపళంగా, నిర్దయగా ఎవరినీ ఖాళీ చేయించలేదు. నిర్వాసితులకు రెండుపడక గదుల ఇళ్లు కేటాయించి, రూ.25వేలు ఇచ్చాం. చెరువుల్లో అక్రమంగా నిర్మించుకున్న భవనాలనే హైడ్రా కూల్చింది. మూసీ పరివాహకంలో ఎవరి ఇళ్లను హైడ్రా కూల్చలేదు. చినుకు పడితే చాలు హైదరాబాద్‌లో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. రోడ్లపై పడిన వర్షపు నీరు చెరువుల్లోకి, నదుల్లోకి చేరాలా.. అలాగే రోడ్లపై ఉండాలా?' అని సీఎం ప్రశ్నించారు. అసలు ప్రాజెక్టుకు ఎందుకు చేపట్టారో వివరించారు.

మిగతాది 2లో

## బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

### రాబోయే ఐదురోజులు వానలు కొనసాగుతాయి

హైదరాబాద్ : తెలంగాణలో రాబోయే ఐదురోజులు వానలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. 2లో

## మద్యం ధరలపై కన్నేసిన ప్రభుత్వం

### ధరలు పెంచే యోచనలో సర్కార్

హైదరాబాద్ : తెలంగాణలో మద్యం ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం వస్తోంది. ఈ ఏడాది కూడా మద్యం ద్వారా భారీగా ఆదాయం ఆర్జించాలని తెలంగాణ సర్కార్ భావిస్తోంది. అందులో భాగంగానే మద్యం ధరల పెంపునకు సిద్ధమైనట్లు సమాచారం. 2లో

## పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షలు

### అధికారులను ఆదేశించిన సిఎస్ శాంతి కుమారి




ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను ఏవిధమైన పొరపాట్లు లేకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో సీఎస్ సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.

హైదరాబాద్ : టీజీపీఎస్సీ కార్యాలయం నుంచి చైర్మన్ మహేందర్ రెడ్డి, సభ్యులు, సచివాలయం నుంచి డీజీపీ జితేందర్, కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్, ఎస్పీడీసీఎల్ ఎండీ ముష్రాఫ్ అలీ, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు అనుదీప్, శశాంక్, గౌతమ్ తదితర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ .. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 34,383 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. హెచ్‌ఎండీఏ పరిధిలో 46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు

మిగతా 2లో

## టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోత

### మెటాలో భారీగా ఉద్యోగుల తొలగింపు



న్యూఢిల్లీ : టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోత కొనసాగుతూనే ఉంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ మెటా మరింతమంది ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైంది. దీర్ఘకాలిక వ్యూహాత్మక లక్ష్యాల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. లేఆఫ్‌ల విషయాన్ని కంపెనీ ధ్రువీకరించినప్పటికీ ఎంత సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తుందనే సమాచారాన్ని మాత్రం వెల్లడించలేదు. 2లో



## బిఆర్ఎస్ తెలంగాణ

# అస్తిత్వ పార్టీ

### తెలంగాణ కోసం కొట్లాడేది కేవలం మన పార్టీయే

ఇది కెసిఆర్, కెటిఆర్‌దో కాదు...తెలంగాణ ప్రజలది

బిఆర్ఎస్‌వి సమావేశంలో కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్ : రేవంత్ రెడ్డి ఉడుత ఊపులకు భయపడే ప్రసక్తే లేదు.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం బంద్ అయితే.. సమాజం తరపున కొట్లాడడం బంద్ అయితే.. పేద ప్రజల తరపున మాట్లాడడం బంద్ అయితే తెలంగాణ మూగబోతది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎందుకంటే బీజేపోడు మాట్లాడడు. తెలంగాణన నాశనం చేసిన బీజేపోడు మెసలడు. బడే భాయ్ చోటే భాయ్ ఒక్కటే. పైననేమో జూమ్లా పీఎం.. ఇక్కడ్నేమో హౌలా సీఎం.. ఈయనకు ఏం తెల్వది.. ఆగమాగం అవుతు న్నాడని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్వీ సమావేశంలో కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దోచుకోవడంలో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఓ బిల్డర్ తనకు వద్దకు వచ్చి.. హైదరాబాద్‌లో కరెంట్ కనెక్షన్ కోసం 25 లక్షలు సమర్పించు కున్నట్లు చెప్పాడు. కాంగ్రెస్ నేతలు అందినకాడికి దోచుకుంటు న్నారని కేటీఆర్ మండిపడ్డారు. గత పది నెలల్లో అత్యంత కష్టకాలాన్ని ఎదుర్కొన్నాం.

మిగతా 2లో

## బతుకమ్మ చీరలపై

# పొంతనలేని మాటలు

### చీరులు లేకుండానే ముగిసిన బుతకమ్మ

సీతక్క మాటలు అర్థం లేనివంటూ హరీష్ విమర్శలు



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ప్రతి బతుకమ్మ పండుగకు రాష్ట్రంలోని ఆడబిడ్డ లందరికీ నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చీరలను పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ఆ బతుకమ్మ చీరలతో ఆడబిడ్డలు సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేవారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బతుకమ్మ చీరలు మాయ మయ్యాయి. బతుకమ్మ చీరలపై ప్రజలు ప్రశ్నిస్తే.. మంత్రులు పొంతన లేని సమాధా నాలు చెబుతున్నారు.

మిగతా 2లో

## జివో నెంబర్ 29ని రద్దు చేయాలి

మళ్లీ ప్రిలిమ్స్ నుంచి పరీక్షల పక్రియ

పాత జివో ప్రకారమే ఎగ్జామ్ జరపాలని అభ్యర్థన

పిసిసి చీఫ్, కెటిఆర్‌లతో విడివిడిగా అభ్యర్థల భేటీ



తెలంగాణలో గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షల వివాదం ముదురుతోంది. మెయిన్స్ వాయిదా వేయాలంటూ అభ్యర్థుల ఆందోళనతో నగరంలో వాతావరణం హీటెక్కింది. అటు, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కీలక నేతలతో అభ్యర్థులతో భేటీ కావడంతో ఏం జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది. గ్రూప-1 అభ్యర్థులు అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ నేతలను కలవడం చర్చనీయాంశంగా మారింది. మిగతా 2లో

హైదరాబాద్ : గాంధీ భవన్ లో గ్రూప్-1 అభ్యర్థులతో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ భేటీ అయ్యారు. గ్రూప్స్ 1 అభ్యర్థుల డిమాండ్లను తెలుసుకున్నారు. జీవో 29 రద్దు చేసి పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు కోరారు. పాత జీవో 55 ప్రకారం పరీక్షల నిర్వహణ జరగాలన్నారు. పాత నోటిఫికేషన్‌లో ఇచ్చిన 503 పోస్టుల లో కొత్త అభ్యర్థులకు అవకాశం ఇవ్వవద్దన్నారు. పెంచిన 60 పోస్ట్ ల్లో మాత్రమే కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం ఇవ్వాలని తెలిపారు.

# మూసీ సుందరీకరణ కాదు.. మూసీ పునరుజ్జీవం

ఇదే సమయంలో బీఆర్ఎస్ నేతలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. మూసీ సుందరీకరణ అంశంపై వివాదం మరింత చెలరేగుతుండటంతో సీఎం రేవంత్ రెడ్డి గురువారం మీడియా ముందుకు వచ్చారు. మూసీ వివాదంపై స్పష్టత ఇచ్చారు. తెలంగాణ భవిష్యత్‌ను నిర్దేశిరచే ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందన్నారు. 33 బృందాలు మూసీ పరివాహకంపై అధ్యయనం చేశాయని సీఎం తెలిపారు. మూసీ పరివాహకంలో నివసిస్తున్న వారు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని.. అలాంటి వారికి మెరుగైన జీవితం అందించాలని భావిస్తున్నామన్నారు. విద్యావంతుల నుంచి నిరక్ష్యరాస్యుల వరకు అందరికీ హైదరాబాద్ ఉపాధి కల్పించాలన్నారు. గత ప్రధానులు పంచవర్ష ప్రణాళికలతో దేశాన్ని అభివృద్ధి చేశారని.. గత ప్రధానులు సంస్కరణలు తెచ్చిన ప్రతిసారీ కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చిందని సీఎం గుర్తు చేశారు. 10 నెలలుగా అధికారులు నిద్రాహారాలు మాని మూసీపై పనిచేస్తున్నారని సీఎం తెలిపారు. మూసీ నదిలో పేదలు ఎదుర్కొంటున్న కష్టాలను అధికారులు గుర్తించారన్నారు. విప్లవాత్మక నిర్ణయాలను వ్యతిరేకించే వాళ్లు ఎప్పుడూ ఉంటారని అన్నారు. విషవలయంలో పేదలు ఉండాలనేది కొందరి ఆలోచన అంటూ విపక్షాలపై పరోక్షంగా సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు. భూగరిష్ట పరిమితి చట్టాన్ని వ్యతిరేకించిన వర్గం కూడా దేశంలో ఉండేదన్నారు. పేదలు ఎప్పుడూ పేదలుగానే ఉండాలని దొరలు, భూస్వాములు భావిస్తారన్నారు. కొందరు ప్రజా ప్రతినిధులు, అధికారులు రాష్టాన్ని దోచుకున్నారని సీఎం ఆరోపించారు. తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదని.. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమం అని చెప్పారు. కొందరి మెదడులో మూసీలో ఉన్న మురికి కంటే.. ఎక్కువ విషం నింపుకున్నారంటూ విపక్ష నేతలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విషపూరిత ఆలోచనలతోనే మూసీ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మూసీ పరివాహక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలనేది ప్రభుత్వ ఆలోచనగా సీఎం పేర్కొన్నారు. 'మూసీ సుందరీకరణ కోసం ప్రణాళికలు రూపొందించామని కేటీఆర్ అనలేదా? అడ్డుకుంటున్న నేతలు 3 నెలలు మూసీ ఒడ్డున జీవించాలి. కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల 3 నెలలు మూసీ ఒడ్డున ఉండాలి. వాళ్లు 3 నెలలు అక్కడ ఉంటామంటే కావాల్సిన వసతులు కూడా కల్పిస్తాం. ఆ ముగ్గురూ మూడు నెలలు అక్కడ ఉంటే.. ఈ ప్రాజెక్టును ఆ పేస్తాం. మూసీ పరివాహకంలోనే ఉండి ప్రజల కోసం పోరాడాలి, వారి జీవితం బాగుందని నిరూపించాలి. మూసీ ప్రజల కోసం ఏం చేద్దామో అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇవ్వాలి. మూసీ పునరుజ్జీవం కోసం మీ వద్ద ఉన్న ప్రణాళిక చెప్పండి. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాలి. విపక్ష నేతల సందేహాలు ఏమిటో చెప్పాలి' అని సీఎం ప్రశ్నించారు. మీడియా సమావేశంలో సిఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం తదుపరి చీఫ్ జస్టిస్‌గా సంజీవ్ ఖన్నా

సుప్రీంకోర్టులో చంద్రచూడ్ తర్వాత సీనియర్ జడ్జిగా ఖన్నా ఉన్నారు. జస్టిస్ చంద్రచూడ్ సిఫార్సులను కేంద్రం ఆమోదిస్తే 51వ భారత ప్రధాన న్యాయమూర్తిగా సంజీవ్ ఖన్నా నియమితులు కానున్నారు. నియమితులైతే 2025 మే 13 వరకు జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవిలో ఉంటారు. 2019లో ఢిల్లీ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఖన్నా పదోన్నతి పొందారు. నిబంధనల ప్రకారం జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రతిపాదనను కేంద్ర న్యాయశాఖ పరిశీలించి ప్రధానమంత్రికి పంపిస్తుంది. ప్రధాని మోదీ ఆమోదం తరువాత రాష్ట్రపతి వద్దకు వెళుతుంది. రాష్ట్రపతి ఆమోదముద్రతో తదుపరి ప్రధాన న్యాయమూర్తి ఎంపిక ఖరారవుతుంది. 2022 నవంబర్ 9వ తేదీన ఛీఫ్ జస్టిస్‌గా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ డీవై చంద్రచూడ్ ఎక్కువకాలం ఈ పదవిలో ఉన్నారు. సంప్రదాయం ప్రకారం సీజేఐ తన తర్వాత ఆ పదవిని చేపట్టేందుకు అత్యంత సీనియర్ న్యాయమూర్తి పేరును సిఫార్సు చేస్తారు. ఆ లెక్కన జస్టిస్ డివై చంద్రచూడ్ తర్వాత జస్టిస్ ఖన్నా అత్యంత సీనియర్‌గా ఉన్నారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా బార్ కౌన్సిల్ ఆఫ్ ఢిల్లీలో న్యాయవాదిగా 1983లో పేరు నమోదు చేసుకున్నారు. తీస్ హజారీ కోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. ఆ తరువాత ఢిల్లీ హైకోర్టులో న్యాయవాదిగా కొనసాగారు. 2004లో ఇన్‌కంటాక్స్ శాఖకు సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. ఢిల్లీ హైకోర్టులో ఎమికస్ క్యూరీగా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సేవలు అందించారు. ఆ తరువాత 2005లో ఢిల్లీ హైకోర్టు అడిషనల్ జడ్జిగా, 2006లో శాశ్వత న్యాయమూర్తిగా నియామితు లయ్యారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా ఢిల్లీ జ్యుడీషియల్ అకాడమీ ఛైర్మన్‌గా, ఢిల్లీ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్ ఇన్‌ఛార్జిగా కొనసాగారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఏ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలు అందించకుండానే సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. ఎలక్టోరల్ బాండ్స్, ఆర్టికల్ 370 తొలగింపు, సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్ సంబంధిత కేసుల్లో జస్టిస్ సంజీవ్ ఖన్నా పాత్ర కీలకమైంది. కాగా నవంబరు 11న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీ విరమణ చేయనున్నారు. ఆ మరుసటిరోజు అంటే నవంబరు 12న జస్టిస్ ఖన్నా సీజేఐగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఆరు నెలల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. వచ్చే ఏడాది మే 13న ఆయన పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ చంద్రచూడ్ 2022 నవంబరు 9 న జస్టిస్ యూయూ లలిత్ స్థానంలో ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల కాలంలో రెండేళ్ల పాటు సీజేగా ఉన్నది చంద్రచూడ్ మాత్రమే. అంతేకాదు, జస్టిస్ చంద్రచూడ్ తండ్రి జస్టిస్ విశ్వనాథ్ చంద్రచూడ్ సుప్రీంకోర్టు 16 ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. అత్యధికాలం సీజేఐగా పనిచేసింది కూడా ఆయనే. ఏకంగా 7 సంవత్సరాల 139 రోజుల పాటు పదవిలో కొనసాగారు.

## బతుకమ్మ చీరలపై పొంతనలేని మాటలు

కేసీఆర్ ఏటా ఇచ్చే బతుకమ్మ చీరలను కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి ఎందుకు బంద్ చేసిందన్న దానికి సమాధానం చెప్పకుండా మంత్రి సీతక్క పొంతన లేని వ్యాఖ్యలు చేయడం శోచనీయం అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. మా ప్రభుత్వం ఏటా రూ. 300 కోట్లతో బతుకమ్మ చీరెలు పంపిణీ చేసిందని ఒప్పుకున్నందుకు ముందుగా మీకు ధన్యవాదాలు అని సీతక్కను ఉద్దేశించి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అయితే అంతకు మించిన ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కల్పించినట్లు భ్రమలు కలిపించే ప్రయత్నం చేయడం హాస్యాస్పదం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. మహిళలకు ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన హామీలు అమలు చేయకుండా, ప్రచారం కోరుకోవడం ముఖ్యమంత్రితో పాటు మంత్రులకు అలవాటుగా మారింది. మహాలక్ష్మి పథకానికి ఈ రాష్ట్రంలోని రేషన్ కార్డు కలిగి ఉన్న 93 లక్షల కుటుంబాలలో 18 ఏళ్లు నిండిన ఒక్క మహిళను అర్హులుగా తీసుకున్నా.. 10 నెలలుగా నెలకు రూ. 2,500 చొప్పున 93 లక్షల మహిళలకు ఒక్కొక్కరికీ రూ. 25,000 వేలు బాకీ పడ్డారు. అంటే మొత్తం రూ. 23,250 కోట్లు. మహాలక్ష్మి అమలు చేయకుండా మోసం చేయడమే కాకుండా రూ. 3,325 కోట్ల లెక్క చెప్పి, చెల్లించాల్సిన రూ. 23,250 కోట్లు కప్పి పుచ్చారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఇది కాకుండా కళ్యాణ లక్ష్మి చెక్కులకు అదనంగా తులం బంగారం ఇస్తామని మాట తప్పారు. రూ. 500 గ్యాస్ పథకం, 200 యూనిట్ల గృహజ్యోతిని కొందరికే పరిమితం చేశారు. హామీల అమలు విషయంలో చేసింది గోరంత, చెప్పుకునేది కొండంత అని విమర్శించారు. ఇక మహిళల గౌరవాన్ని నిలబెడుతున్నట్లు చెప్పిన మీ మాటలు అటుంచితే, ముందు మహిళల ప్రాణాలు కాపాడాలని, శాంతి భద్రతలు నిర్వహించి వారి భద్రతకు భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోత

మెటా పరిధిలో ఉన్న వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, వర్చువల్ రియాలిటీపై పనిచేస్తున్న రియాలిటీ ల్యాబ్.. ఇలా అన్ని వ్యాపారాల్లో ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోనున్నట్లు తెలుస్తోంది. రిక్రూటింగ్, లీగల్ ఆపరేషన్, డిజైన్... వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై ఈ ప్రభావం పడనుంది. దీర్ఘకాలిక వ్యూహాత్మక లక్ష్యాలు, ప్రాంతీయ వ్యూహాల్లో మార్పులు చేస్తున్నామని మెటా అధికారిక ప్రతినిధి తెలిపారు. అందులోభాగంగానే ఈ తొలగింపులు చేపడుతున్నట్లు వెల్లడించారు. అయితే మెటా నుంచి ఉద్వాసన పలికిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ అవకాశాలు అందించేందుకు కంపెనీ ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2022లో మెటా ఏకంగా 11వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. గతేడాదిలో మరో 10వేల మందిని ఇంటికి పంపింది. తాజాగా మరో రౌండ్ లేఆఫ్‌లకు సిద్ధమైంది. అయితే ఈసారి తొలగింపులు తక్కువ సంఖ్యలోనే ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే మెటా నుంచి లేఆఫ్‌కు గురైనట్లు కొందరు ఉద్యోగులు సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు పెడుతున్నారు. ఇదిలాఉండగా.. టెక్ కంపెనీలు ఆర్థిక ఒత్తిళ్లు, సైబర్ సెక్యూరిటీపై పెట్టుబడులు, ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవడం కోసం పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. ఇక ఖర్చుల్ని తగ్గించుకొనే ప్రయత్నంలో భాగంగా ఉద్యోగులను తొలగిస్తున్నారు. ఇప్పటికే ఇంటెల్ (ఎనిబి౹), సిస్కో (అతిబఝనీ), ఐబీఐ కంపెనీలు పెద్ద ఎత్తున ఉద్యోగులకు ఉద్వాసన పలికాయి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటెల్ ఏకంగా 15శాతం మంది ఉద్యోగులను తగ్గించుకుంది. ఇలా ఈ ఏడాది ఆగస్టు నాటికి 422 కంపెనీలు ఏకంగా 1,36,000 మందిని తొలగించాయి.

## చెన్నైకి భారీ వర్ష సూచన

### ఇల్లను వదిలి హోటళ్లు చూసుకుంటున్న జనం

చెన్నై : చెన్నై నగరవ్యాప్తంగా అత్యంత భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజల్లో భయం పెరిగింది. ప్రత్యేకించి ఐటీ నిపుణులు, ధనవంతుల్లో చాలామంది విలాసవంతమైన హోటళ్లలో గదులు బుక్ చేసుకుని కుటుంబాలతో కలిసి దిగిపోతున్నారు. గతేడాది డిసెంబరులో ఒక్కసారిగా భారీ వర్షాలు కురవడంతో ఇళ్లలోకి వరద నీరు చేరి, కార్లు కొట్టుకుపోయిన నేపథ్యంలో ఈసారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా వారు హోటళ్లలో దిగుతున్నారు. కార్ల పార్కింగ్‌కు ప్రత్యేక వసతి, తాగునీరు, విద్యుత్ సరఫరాతోపాటు వైఫై ఉండేలా చూడాలన్న షరతులతో గదుల్లో దిగినట్లు సమాచారం. గురువారం భారీ నుంచి అతిభారీ వర్షసూచన చేశారు. బుధవారం రెడ్ ఎలర్ట్ ఇచ్చినా, సాయంత్రం వరకు తేలికపాటి జల్లులే పడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. భారీ వర్షాలకు బెంగళూరు నగరంలో జనజీవనం స్తంభించింది. చిక్కబళ్లాపుర, కోలారు, రామనగర, మైసూరు, చామరాజనగర, ఉడుపి, మంగళూరు, ఉత్తర కర్ణాటక, చిత్రదుర్గ తదితర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఐటీ, బీటీ కేంద్రాలకు నిలయమైన బెంగళూరులోని మాన్యత టెక్‌పార్కు ఆవరణలో నూతన నిర్మాణాల కోసం తీసిన పునాదుల్లో మట్టి పెళ్లలు విరిగిపడ్డాయి.

## బిఆర్ఎస్ తెలంగాణ అస్తిత్వ పార్టీ

ఎవరూ ఊహించని విధంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ప్రతిపక్షంలో కూర్చుంటామని ఊహించలేదు. డిసెంబర్ 7న కేసీఆర్‌కు ప్రమాదం జరగడం.. మూడు నెలల పాటు ఇబ్బందికి గురయ్యారు. ఓ పది మంది ఎమ్మెల్యేలు ప్రలోభాలతో దొంగల్లో కలిసిపోయారు. మన ఆడబిడ్డ కవితమ్మను ఐదున్నర నెలలు జైల్లో పెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో కొట్లాడినం, పోరాడినం కానీ ఎవరికీ లొంగలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించిన దానికి భిన్నంగా ఫలితాలు వచ్చాయి. ఇవాళ కేసీఆర్‌ను తలచుకుంటున్నారు. కేసీఆర్ సీఎంగా ఉంటే రైతుబంధు, బతుకమ్మ చీరలు వస్తుండే అని అనుకుంటున్నారు. కులమతాలకు అతీతంగా కేసీఆర్‌ను తలచుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అంటే కేసీఆర్‌దో, కేటీఆర్‌దో కాదు.. ఇది తెలంగాణ ప్రజల గొంతుక అని కేటీఆర్ స్పష్టం చేశారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష.. కేసీఆర్ నాయకత్వం, గులాబీ జెండానే తెలంగాణకు రక్షణ. ఈ పార్టీ మరో 75 ఏండ్ల పాటు ఒక డీఎంకే లాగా, శిరోమణి అకాలీదళ్ లాగా ఉంటది. ఈ పార్టీ మన తెలంగాణ ప్రజలది అని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో మనం జాగ్రత్తగా ఉండాలి. కాంగ్రెస్‌నే శత్రువుగా చూడాల్సిన అవసరం లేదు. తెలంగాణ సమాజానికి మరింత డేంజరస్ పార్టీ బీజేపీనే. మతాలను అడ్డంపెట్టుకుని, మతపరమైన రాజకీయాలు చేస్తూ.. దేవుడిని అడ్డుపెంట్టుకుని పిల్లలను రెచ్చగొడుతున్నారు. తెలంగాణకు చేసిందేమీ లేదు బీజేపీ. ఐఐటీ, ఐఐఎం, మెడికల్, నర్సింగ్ కాలేజీ ఇవ్వలేదు. ఆఖరికి ఒక్క నవోదయ పాఠశాల కూడా ఇవ్వలేదు. తెలంగాణకు ఏం ఇచ్చారని అడిగితే ఎవరు చెప్పరు.. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు మాటలు రావు. కానీ పిల్లలను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారు. ఇక రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు. 32 జిల్లాల్లో పార్టీ ఆఫీసులు ఉన్నాయి. ప్రతి జిల్లాలో బీఆర్ఎస్వీ సమావేశాలు జరగాలి. మండలం, నియోజకవర్గం స్థాయిలో కమిటీలు వేసుకుందాం. సమర్థవంతమైన విద్యార్థి నాయకులు ఉన్నారు. వారిని జిల్లాలకు పంపుదాం. మండల కమిటీ, కాలేజీ కమిటీలను భర్తీ చేసి కొత్త నాయకత్వాన్ని ఎంకరేజ్ చేసుకుందాం. ఎక్కడికక్కడ సోషల్ మీడియాలో క్రియాశీలక పాత్ర పోషించాలి. కేసులకు భయపడొద్దు.. లీగల్ సెల్‌ను బలోపేతం చేస్తున్నాం. విద్యార్థి నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటాం. బీఆర్ఎస్వీ లేని కాలేజీ ఉండొద్దు. విద్యార్థి నాయకులకు రాజకీయంగా అవకాశాలు ఇస్తాం. మున్సిపల్ చైర్మన్లు, జడ్పీ చైర్మన్లు ఇతర పదవుల్లో అవకాశాలు కల్పిస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

## మద్యం ధరలపై కన్నేసిన ప్రభుత్వం

మద్యంతో ఎంజాయ్ చేస్తున్న మందుబాబులకు ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం పెద్ద షాకే ఇవ్వబోతుంది. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మద్యం ఆదాయాన్ని అదనంగా మరో రూ.5,318 కోట్లకు పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా బీర్ల ఉత్పత్తి కేంద్రాలకు చెల్లించే ధరలను ప్రభుత్వం ప్రతి రెండేళ్లకొకసారి పెంచుతుంది. అలాగే ఈసారి వివిధ రకాల మద్యంపై రూ. 20 నుంచి రూ. 150 పెంచాలని ప్రభుత్వాన్ని బ్రూవరీలు కోరాయి. ఏటా బతుకమ్మ, దసరా సందర్భంగా రాష్ట్రంలో లిక్కర్ అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి. ఈసారి కూడా మందుబాబులు అదే ఒరవడిని కొనసాగిస్తూ భారీ రికార్డు నెలకొల్పారు. కేవలం 10 రోజుల వ్యవధిలో రూ.1,100 కోట్లకుపైగా మందును తాగేశారు. పది రోజుల్లో వెయ్యి కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగినట్లు ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. బార్లు, మద్యం దుకాణాలతో పాటుగా పబ్‌లలోనూ అమ్మకాలు పెరిగాయి. దీంతో సర్కార్ ఖజానాకు.. మద్యం భారీగా ఆదాయం తెచ్చి పెట్టింది. మద్యం అమ్మకాల్లో ఎప్పటిలాగే హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 2 వేల 260 మద్యం దుకాణాలు, 1,171బార్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. వీటితో పాటుగా పబ్బుల్లోనూ మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఏటా దసరా వేళ తెలంగాణలో మద్యం ఎక్కువ మొత్తంలో అమ్ముడవుతుంది. ఈ సారి అదే అంచనాతో ముందుగానే ఎక్సైజ్ శాఖ అధికంగా మద్యం నిల్వలను సిద్ధం చేసుకుంది. ఆర్డర్లు కూడా ఊహించిన దాని కన్నా అధికంగా ఉండటంతో రాష్ట్ర సర్కార్ ఖజానాకు కాసుల వర్షం కురిసింది. బార్లు సైతం తగినంత స్టాక్‌ను అందుబాటులో ఉంచాయి. దసరాకు ముందు నుంచే మొదలైన మద్యం కిక్కు శని, ఆదివారాల్లో పీక్స్‌కు చేరింది. సెప్టెంబర్ 30 వరకు 2 వేల 838 కోట్ల అమ్మకాలు జరగ్గా... అక్టోబర్ నెల ప్రారంభం నుంచి 11వ తేదీ వరకు రూ 1,100 కోట్ల మేర విలువైన 10 లక్షల 44వేల కేసుల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. 10 రోజులవ్యవధిలోనే 17 లక్షల 59 వేల బీర్లు అమ్ముడుపోయాయట. మద్యం అమ్మకాల్లో ఉమ్మడి రంగారెడ్డి టాప్‌లో ఉండగా ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ, వరంగల్ జిల్లాలు తర్వాతి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో మద్యం అమ్మకాలు ప్రభుత్వానికి భారీ ఆదాయాన్ని సమకూర్చాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 10వ తేదీతో పోలిస్తే ఈ ఏడాది ఇదే సమయంలో పది రోజులకుగానూ అమ్మకాలు కాస్త తగ్గాయి. గ్రేటర్ హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, శంషాబాద్, సరూర్‌నగర్, వికారాబాద్ జిల్లాల పరిధిలో 674 మద్యం దుకాణాలు ఉండగా, 2023లో మద్యం అమ్మకాల ద్వారా రూ.317 కోట్ల 21 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రూ.312 కోట్లే ఖజానాకు వచ్చింది. గతంతో పోల్చితే ఎక్సైజ్ ఆదాయం రూ.5 కోట్ల 18 లక్షలు తగ్గడం గమనార్హం.

## జివో నెంబర్ 29ని రద్దు చేయాలి

ప్రభుత్వం కొత్తగా 503 పోస్ట్ ల్లో60 పోస్టులు పెంచి నోటిఫికేషన్ ఇచ్చింది). జీవో 29 , రిజర్వేషన్ల అంశాల్లో కోర్టు కేసులు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని పరిష్కరించి పరీక్షలు పెట్టాలనిమహేష్ ను కోరారు. పాత నోటిఫికేషన్ ప్రకారమే రిజర్వేషన్లు, ఓపెన్ క్యాటగిరి ప్రకారం పరీక్షలు ఉండాలని అన్నారు. గ్రూప్స్ 1 అభ్యర్థుల అభ్యర్థన మేరకు ప్రభుత్వానికి సమాచారం అందిస్తామని మహేష్ గౌడ్ తెలిపారు. సాయంత్రం వరకు దీనిపై తగిన సమాచారం ఇస్తామని క్లారిటీ ఇచ్చారు. మరోవైపు కేటీఆర్ పై పీసీసీ చీఫ్ ఫైర్ అయ్యారు. మీరు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేస్తారా..? అంటూ కేటీఆర్ కు పీసీసీ చీఫ్ సవాల్ విసిరారు. నిరుద్యోగుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని కేటీఆర్ ను విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో నే.. డీఎస్సీ.. వైద్యారోగ్యశాఖ లో ఉద్యోగాలు. గ్రూప్స్.. పోలీసు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. మీరు ఏడున్నర లక్షల కోట్ల అప్పు చేసి మిగులు రాష్టాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చేశారని మండిపడ్డారు. ఇకపోతే తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో గ్రూప్ - 1 అభ్యర్థులు సమావేశమయ్యారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేసేలా సర్కార్‌పై ఒత్తిడి తేవాలని కేటీఆర్‌కు అభ్యర్థులు విన్నవించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల సమస్యలను కేటీఆర్ విన్నారు. అయితే గ్రూప్-1 మెయిన్స్‌ను రీ షెడ్యూల్ చేయాలని గత కొద్ది రోజుల నుంచి అభ్యర్థులు డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. కానీ కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదు. ఈ నెల 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది. ఇదిలా ఉంటే ఈనెల 21 నుంచి జరిగే గ్రూప్-1 మెయిన్ పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ గత రాత్రి వందలాది మంది అభ్యర్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పలువు అభ్యర్థులు మాట్లాడుతూ జీవో 29, జీవో 55పై ఎటూ తేల్చకుండా, తప్పుడు ప్రశ్నల అంశాన్ని పరిష్కరించకుండా ఆగమేఘాల మీద గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు గ్రూప్-1 పరీక్ష ప్రిలిమ్స్‌లో అన్ని ప్రశ్నలూ తప్పులతడకలేని, 150 ప్రశ్నలకు 20 ప్రశ్నలు తప్పుగా వచ్చాయని గుర్తుచేశారు. ఈ కేసులన్నీ పరిష్కరించిన తర్వాతే మెయిన్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని కెటిఆర్ కు కూడా అభ్యర్థులు వివరించారు. దీనిపై కెటిఆర్ సానుకూలంగా స్పందిస్తూ, దీనిపై న్యాయ సలహా తీసుకుంటామని హామీ ఇచ్చారు.. అభ్యర్దులకు అన్నివిధాల అండగా ఉంటామని కెటిఆర్ హామీ ఇచ్చారు. కాగా, గ్రూప్ 1 మెయిన్స్ రీషెడ్యూల్ చేయాలని అభ్యర్థులు గత కొద్ది రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం సాయంత్రం వందలాది మంది అభ్యర్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళనకు దిగారు. గ్రూప్ - 1 ప్రిలిమ్స్ పరీక్షపై దాదాపు 33 కేసులు వచ్చాయని.. వాటన్నింటినీ పరిష్కరించిన తర్వాతే మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులంతా ఒక్కసారిగా దూసుకురావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సమాచారం అందుకున్న పోలీసులు అభ్యర్థులను అరెస్ట్ చేసి వివిధ స్టేషన్లకు తరలించారు. అయితే, ఈ వివాదం కొనసాగుతుండగానే ఈ నెల 21 నుంచి షెడ్యూల్ ప్రకారం మెయిన్స్ నిర్వహణకు సన్నద్ధమవుతోంది. ఈ నెల 14న టీజీపీఎస్సీ హాల్ టికెట్లను విడుదల చేసింది. ఈ క్రమంలోనే గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు.

## బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

ఉత్తర కోస్తా, తమిళనాడులో కేంద్రీకృతమైన అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితలం ఆవర్తనం కొనసాగుతుందని.. సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది. ఎత్తుకు వెళ్లే కొలది నైరుతి దిశకు వంగి ఉందని పేర్కొంది. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఈ నెల 20 వరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. దాని ప్రభావంతో 22 వరకు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని.. ఆ తర్వాత వాయువ దిశగా పయనిస్తూ మరింత బలపడే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలోని ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, సిద్దిపేట, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని.. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడేందుకు అవకాశాలున్నాయని చెప్పింది. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలతో పాటు వికారాబాద్, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, నారాయణపే, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలుపడుతాయని ఐఎండీ అంచనా వేసింది.

## పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షలు

సీఎస్ శాంతి కుమారి. టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగుతుండడంతో.. పరీక్షల నిర్వహణలో అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆధునిక సాంకేతికత, సోషల్ మీడియా యాక్టివ్‌గా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణ కూడా సవాలుతో కూడుకుంటున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏవిధమైన అపోహలు, పుకార్లకు తావివ్వకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని మహేందర్ రెడ్డి సూచించారు.

## షేక్ హసీనాపై అరెస్ట్ వారెంట్

### నవంబర్ 18లోగా హాజరు పర్చాలని కోర్టు ఆదేశం

ఢాకా : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పై అరెస్టు వారెంట్ జారీ అయింది. ఆ దేశానికి చెందిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ ఈ వారెంట్ ఇచ్చింది. నవంబరు 18లోగా ఆమెను అరెస్టు చేసి తమ ఎదుట హాజరు పరచాలని ఐసీటీ చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తజుల్ ఇస్లాం తన ఆదేశాల్లో పేర్కొన్నారు. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో.. ప్రధానిగా ఉన్న షేక్‌హసీనా పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. తర్వాత నుంచి ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. జులై 15 నుంచి ఆగస్టు 5 వరకు జరిగిన మారణహోమం, ఇతర నేరాల ఆరోపణలపై హసీనాకు వ్యతిరేకంగా ఐసీటీకి 60 ఫిర్యాదులు అందాయి. వాటిపై ట్రిబ్యునల్ ఇటీవల దర్యాప్తు ప్రారంభించింది. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆమెను బంగ్లాదేశ్‌కు రప్పిస్తామని, ఆమెపై అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని ఐసీటీ నూతన ప్రాసిక్యూటర్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఆమెను స్వదేశానికి రప్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. హసీనా పాలనపై తీవ్ర నిరసన వ్యక్తంచేసిన విద్యార్థి సంఘాలు ఆమె భారత్‌లో ఉండటాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇదిలాఉంటే.. హసీనాను చట్టబద్ధంగా తమ దేశానికి అప్పగించాలంటూ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) భారత ప్రభుత్వాన్ని డిమాండు చేసిన సంగతి తెలిసిందే. మరోపక్క ఆమె దౌత్య పాస్‌పోర్టు రద్దయిన సంగతి తెలిసిందే. హసీనా హయాంలో ఎంపీలకు జారీ చేసిన దౌత్య పాస్‌పోర్టులను రద్దు చేసినట్లు బంగ్లా హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ పాస్‌పోర్టు ఉన్నవారు కొన్ని నిర్దిష్ట దేశాలు వీసా లేకుండా ప్రయాణించే వీలు ఉంటుంది. ఆగస్టు 5న పదవి నుంచి దిగిపోయి భారత్‌కు చేరుకున్న తర్వాత బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. ఇదిలా ఉంటే.. హసీనాను బంగ్లాకు రప్పించడానికి యూనస్ ప్రభుత్వం అన్ని యత్నాలు చేస్తుందని ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ గతంలో పేర్కొంది. హసీనాను అప్పగించాలా, వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత భారత్‌పైనే ఉందని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాతో పాటు 45 మందిపై బంగ్లాదేశ్ ఇంటర్నేషన్ క్రైమ్ ట్రిబ్యునల్ గురువారం అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. అరెస్టు వారెంట్లు జారీ అయిన వారిలో అవామీ లీగ్‌కు చెందిన పలువురు నాయకులు సైతం ఉన్నారు. విద్యార్థుల ఉద్యమం నేపథ్యంలో జరిగిన మారణహోమం, ఇతర నేరారోపణలపై క్రైమ్ ట్రిబ్యునల్‌లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేయాలని కోరుతూ ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన రెండు పిటిషన్లపై జస్టిస్ మహ్మద్ గోలం ముర్తాజా మజుందార్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని చీఫ్ ప్రాసిక్యూటర్ మహ్మద్ తాజుల్ ఇస్లాం వెల్లడించారు. నవంబర్ 18లోగా షేక్ హసీనా సహా మొత్తం 46 మందిని అరెస్ట్ చేసి హాజరుపరచాలని ధర్మాసనం అధికారులను ఆదేశించింది. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమం హింసాత్మకంగా సాగిన విషయం తెలిసిందే. ఉద్యమాన్ని అణిచివేసేందుకు షేక్ హసీనా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విద్యార్థి నేతలు ఆరోపించారు. హింసాత్మక ఘటనలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు.

# ఆసుపత్రులలో అవసరమైన పరికరాల

# ప్రతిపాదనలు రూపొందించాలి

- పి.హెచ్.సి, సబ్ సెంటర్ల ఎన్.క్యూ.ఏ సర్టిఫికేషన్ చర్యలు
- జిల్లాలోని ఆసుపత్రులలో కల్పించాల్సిన సౌకర్యాలు అవసరమైన వసతులపై

## సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆసుపత్రులలో అవసరమైన పరికరాలకు ప్రతిపాదనలు రూపొందించాలని, వాటిని మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ,సబ్ సెంటర్లు, రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన పరికరాలు కల్పించాల్సిన సౌకర్యాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో నూతనంగా మంజూరైన 18 ఆరోగ్య సబ్ సెంటర్ల నిర్మాణ పనులు ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఈఈ పంచాయతీరాజ్ అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఉన్న పి.హెచ్.సి లు, సబ్ సెంటర్ల పరిధిలో రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన పరికరాలు, సామాగ్రి, మౌలిక వసతుల ప్రతిపాదనలు తయారు చేసి నివేదికను సమర్పించాలని, అవసరమైన నిధులను కేటాయించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వైద్యారోగ్య శాఖ అధికారికి సూచించారు. జిల్లాలో ఉన్న 18 పి.హెచ్.సి లకు గాను ఇప్పటి వరకు 8 పి.హెచ్.సి లు ఎన్.క్యూ.ఏ సర్టిఫికేషన్ పొందాయని, మిగిలిన పి.హెచ్.సి లు ఎన్.క్యూ.ఏ సర్టిఫికేషన్ పొందే దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని, అదే విధంగా 3 ఆరోగ్య సబ్ సెంటర్ల ఉన్న ఎన్.క్యూ.ఏ సర్టిఫికేషన్ మరో 25 ఆరోగ్య సబ్ సెంటర్లకు వచ్చేలా చూడాలని, దీనికి పాటించాల్సిన అంశాలు, అవసరమైన సామాగ్రి, కల్పించాల్సిన మౌలిక సదుపాయాల పై సంపూర్ణ సహకారం అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద ఉన్న సామాగ్రి,ఎక్కడ అవసరమైన వైద్య పరికరాల పై కూడా నివేదిక తయారు చేయాలని, క్రమ పద్ధతిలో మంజూరు చేసి అవసరమైన పరికరాలు ఆసుపత్రిలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, ఈఈ పంచాయతీరాజ్ గిరీష్ బాబు, ప్రోగ్రాం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాదయాత్ర చేపట్టబోతున్నా శాతవాహన స్టూడెంట్ జేఏసీ

- ఆధ్వర్యంలో తెలంగాణ, ఉస్మానియా, కాకతీయ, యూనివర్సిటీల విద్యార్థులు శాతవాహన జేఏసీ చైర్మన్ వ్యవస్థాపకులు చెన్నమల్ల చైతన్య



**కరీంనగర్ టౌన్, అక్టోబర్17(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగరంలో ఎర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శాతవాహన జేఏసీ చైర్మన్ వ్యవస్థాపకులు చెన్నమల్ల చైతన్య మాట్లాడుతూ ఆనాడు తెలంగాణ రాష్ట్రం సిద్ధించడం కొరకు సబ్బండవర్గాలం ఏకమై పాదయాత్రలు చేపట్టినం, అటుకులు బుక్కినం, అంబలి తాగినం, కట్టలేరుకున్నం, రాళ్ళను పేర్చుకున్నం బియ్యం కడుక్కున్నం, అండుకొని రోడ్లపైనే తిన్నం ఎండకు ఎండినం, వానకు తడిసినం, చలికి వనికినం అలాంటి గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్న విద్యార్థులం మాతోపాటు మాలో ఒకడిగా తెలంగాణ ఉద్యమానికి కరీంనగర్ నగరంలో తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించిన ఉద్యమకారుడు విద్యావంతుడు, న్యాయవాది సర్దార్ రవీందర్ సింగ్ కు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పార్టీ ప్రకటించాలని పార్టీ ప్రకటించిన తరువాత వారిని ఈ నాలుగు జిల్లాలలో ఉన్న తెలంగాణ ఉద్యమకారులు, పట్టభద్రులు వారిని భుజాన ఎత్తుకుని గెలిపించుకుంటాం అని వారు అన్నారు. సర్దార్ రవీందర్ సింగ్ గెలుపుకోసం తెలంగాణ ఉద్యమంలో ఏ విధంగా ఇష్టపడ్డామో అదేవిధంగా ఇప్పుడు ఈ నాలుగు జిల్లాలలో ఉన్నటువంటి విద్యార్థులము నిరుద్యోగులము పట్టభద్రులము కాలుకుబట్ట కట్టుకొని తిరిగి ప్రచారం చేసి గెలిపించుంటాం అని వారు అన్నారు. కలియుగ దైవమైన వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు కొండగట్టు అంజన్న దీవెనలు బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అండదండలు సర్దార్ రవీందర్ సింగ్ కు ఉండాలని ఎల్లుండి శనివారం రోజున ఉదయం 8గంటలకు కరీంనగర్ నగరంలోని మార్కెట్ లోని వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి కొండగట్టు అంజన్న ఆలయం వరకు నాలుగు యూనివర్సిటీల 200మంది విద్యార్థులు శాతవాహన స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టబోతున్నాం. ఈ పాదయాత్రలో దారి పొడుగునా కరీంనగర్ మేయర్గా ఉన్నప్పుడు వారు చేసిన కార్యక్రమాలు నగర అభివృద్ధి కోసం స్మార్ట్ సిటీ, అదేవిధంగా కరీంనగర్ ప్రజలకు వారు చేసిన సంక్షేమ కార్యక్రమాలు ముఖ్యంగా కేవలం ఒక్క రూపాయికే అంత్రక్రియలు, ఇంటింటికి ఒక్క రూపాయికే మంచినీళ్ళ నల్ల, కేవలం రూపాయికే మహిళలకు న్యాప్కిన్స్, పదవ తరగతి విద్యార్థులకు సరస్వతి ప్రసాదం దేశమే ఆశ్చర్యపడేలా రూపాయి పథకాల రూపకర్తగా పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఈ నాలుగు జిల్లాలలో ఉన్నటువంటి పట్టభద్రులకు కేవలం ఒకే ఒక్క రూపాయితో హెల్త్ ఇన్సూరెన్స్ అందిస్తామని సర్దార్ రవీందర్ సింగ్ ఇప్పటికే ప్రకటించారు. కావున పట్టభద్రులు ప్రశ్నించే గొంతుకగా సర్దార్ రవీందర్ సింగ్ గెలిపిస్తే చట్టసభల్లో ప్రతిపక్ష సభ్యుడిగా ప్రభుత్వానికి నిరుద్యోగుల సమస్యల మీద, పట్టభద్రులు సమస్యలు మీద పోరాడే నాయకుడిగా వారికి నాలుగు జిల్లాలలో ఉన్న పట్టభద్రులు సర్దార్ రవీందర్ సింగ్ కే తొలి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలనే వివరిస్తూ మా పాదయాత్ర సాగుతుందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో యూనివర్సిటీల జేఏసీ నాయకులు అరుణ్ కుమార్, సత్యనారాయణ, రాము యాదవ్, నైతే మహేష్, బండ అశోక్, భారతం అఖిల్, బోడ కుంటి రమేష్, గడ్డమీద రాజశేఖర్, సాయినాయక్, తాళ్ల రాకేష్, ములకల విజయ్, శివ పవన్, సుధీర్, వంశీ, అనిల్, శ్రీకర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## మృత కార్మికులకు కార్మిక నేతల నివాళులు



**యైటింక్లయిన్ కాలనీ. (క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం 8ఎ గని ప్రమాదంలో మరణించిన మృత కార్మికులకు గురువారం మృతుల కుటుంబాలు, కార్మిక నాయకులు నివాళులు అర్పించారు. 16.10.2003 న రాత్రి బదిలీ లో జరిగిన ప్రమాదంలో 10 మంది కార్మికులు మరణించగా, వారి మరణానికి చిహ్నంగా గని వద్దనే నిర్మించిన స్మారక స్తూపం వద్ద ప్రతియేటా కార్మికులు, కార్మిక నాయకులు నివాళులు అర్పిస్తూ వస్తున్నారు. ఇదే క్రమంలో ఉదయం స్తూపం వద్దకు వచ్చిన మృతుల కుటుంబాలు, కార్మికులు, కార్మిక నాయకులు స్తూపం వద్ద పూలమాలలు ఉంచి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. యాజమాన్య నిర్లక్ష్యాలకు, స్థానిక అధికారుల అవగాహన లోపాలకు సాక్ష్యంగా నాడు 21 సంవత్సరాల క్రిందట 8ఎ గనిలో పదిమంది కార్మికులు తమ అమూల్యమైన ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. ఇక మృత కార్మికులకు నివాళులు అర్పించిన వారిలో ఏఐటీయూసీ జిగురు. రవీందర్, బి.అన్నారావు, కె. రాజారత్నం, కె.సత్యనారాయణ, ఎ.రాజయ్య, ఐఎన్టియూసి నాయకులు ధర్మపురి, ఎండి.అక్రమ్, కొత్త సత్యనారాయణ రెడ్డి, సంపత్ రెడ్డి, వాసంశెట్టి. మార్కండేయ, టీబీజీకేఎస్ నాయకులు మాదాసి రామ్మూర్తి,ఐలి.శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, చంద్రయ్య, సిఐటియూ నాయకులు ఉల్లి మొగిలి, ప్రవీణ్, సారంగం, భూమయ్య, బిఎంఎస్ మాదాసి రవీందర్, గట్టు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## పేద విద్యార్థినికి పది వేల ఆర్థిక సాయం



**కరీంనగర్ ప్రతినిధి, అక్టోబర్ 17(క్రైమ్ న్యూస్):** కరీంనగర్లోని రిషి కాన్వెంట్ స్కూల్లో 10వ తరగతి చదువుతున్న పేద విద్యార్థిని సాత్విక స్కూల్ ఫీజు కోసం పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ప్రతినిధులు మాట్లాడుతూ 2016 సంవత్సరం నుంచి పేద కుటుంబానికి చెందిన సాత్విక స్కూల్ ఫీజు కోసం పదివేల రూపాయలను ఆర్థిక సాయం కింద అందజేస్తున్నామని పేర్కొన్నారు. తమ క్లబ్ తరఫున పెద్ద ఎత్తున సామాజిక సేవ కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. పేద ప్రజలకు తోచిన విధంగా తమ క్లబ్ తరఫున సహాయ సహకారాలు అందిస్తున్నామని వివరించారు. సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతూ ముందుకెళు తున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సైతం తమ క్లబ్ తరఫున విస్తృతంగా సేవ కార్యక్రమాలు చేపడుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ అధ్యక్షుడు ముక్క శరత్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి మ్యాడం శివకాంత్, కోశాధికారి బట్టు వినోద్, పిఆర్ఓ ఎలగందుల మునీందర్, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలధారులకు పోచమ్మ ఆలయం వద్ద భిక్షకు ఏర్పాట్లు: కార్పోరేటర్ మందడి శ్రీనివాస రావు





**కూకట్ పల్లి అక్టోబర్ 17 (ది క్రైమ్ న్యూస్):** అయ్యప్ప స్వామి మాలధార వేసుకున్న స్వాములకు మధ్యాహ్నం వేల భిక్ష (అన్న ప్రసాదం)కు ఆటంకం రాకుండా ఉద్యోగస్తులకు స్వామివారి ప్రసాదాన్ని తమ కార్యాలయాలకు తీసుకెళ్లేటట్లుగా కేపిహెచ్బి 3వ ఫేస్ లోని పోచమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామి దీక్ష తీసుకున్న స్వాములు ఉద్యోగరీత్యా మధ్యాహ్న సమయంలో భిక్ష (భోజనానికి) ఇబ్బంది పడకుండా వారు ఇక్కడి నుంచి ఉచితంగా తీసుకొని వెళ్ళొచ్చని ఈ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జనవరి 10వ తేది వరకు కొనసాగుతుందని తెలిపారు. ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆలయ నిర్వహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్.ఎన్ రాజు (గురు స్వామి), బుట్ట రాంబాబు (గురు స్వామి), నూతి రాంబాబు నాయుడు (గురు స్వామి) తదితరులు పాల్గొన్నారు.

## రామాయాణాన్ని జనహృదంగా రచించిన వాల్మీకి చరితార్థుడు: బండి రమేష్





**కూకట్ పల్లి అక్టోబర్ 17 (ది క్రైమ్ న్యూస్):** రామాయణాన్ని జనహృద్యంగా రచించిన వాల్మీకి చరితార్థుడని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా కేపిహెచ్బి కాలనీలో గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకుడు రంగస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్మీకి చిత్రపటానికి రమేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రామాయణం ఇతిహాసాల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా రచించిన వాల్మీకి తన పేరును చరిత్రలో లిఖించుకున్నారన్నారు. వాల్మీకి సోదరులను ఈ సందర్భంగా రమేష్ అభినందించారు. కార్యక్రమంలో సతీష్ రెడ్డి, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, డివిజన్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్, పొడుగు అప్పారావు, నలినీకాంత్, ఫణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం



**కూకట్ పల్లి అక్టోబర్ 17 (ది క్రైమ్ న్యూస్):** కూకట్ పల్లి సర్కిల్ ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని ఛత్రపతి శివాజీనగర్ కాలనీకి చెందిన చిట్టిరాజుల శివ (42) అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి డివిజి ట్రస్ట్ ద్వారా 5,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. సత్యం, తాతబాబు, పి.మల్లేష్, కూర్మయ్య, బుచ్చి రాములు తదితరులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



**సుల్తానాబాద్, అక్టోబర్ 17( ది క్రైమ్ న్యూస్ ):** వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మినుపాల ప్రకాష్ రావు. సాయిరి మహేందర్. కుమార్ కిషోర్ ఆర్ ఐ లు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలి !

తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేరుస్తామని అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందుకు తగ్గట్లుగా అడుగులు వేయాలి. నీళ్లు, నిధులు,నియామకాలు అన్న ఆకాంక్షలు త్వరగా నెరవేర్చాలి. ఇదే సందర్భంలో ఇక ఉచిత పథకాలను దరిచేరకుండా పటిష్టమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించుకోవాలి. రైతుబంధు, రైతు రుణమాఫీలు,రూపాయికి కిలోబియ్యం, ఆరోగ్యశ్రీ వంటి పథకాలకు చెక్ పెట్టాలి. పంటలను పూర్తి స్థాయిలో గిట్టుబాటు ధరలకు కొనడమే రైతులను ఆదుకోవడం అవుతుంది. వారికి సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడం, పంటరుణాలను అందించడం,నీట వసతి కల్పించడం ప్రధాన ఎజెండా కావాలి. ఇవన్నీ కల్పించి పండించిన పంటలను సకాలంలో కొనుగోలు చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ప్రకృతి వైపరీత్యాల్లో ఆదుకునేలా ఉండాలి. చిన్ననీటి వనరులను అభివృద్ధి చేయాలి. ఇలా చేస్తే వ్యవసాయంతో పాటు, అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఇవి చేయకుండా నేలవిడిచి సాము చేయడం సరికాదు. అలాగే విద్యావైద్య రంగాలను కూడా గ్రామస్థాయి లో పటిష్టం చేయాలి. సాగు,తాగునీటి వనరులతో పాటు, పంటలు పండే భూములకు ఇక్కడ కొదువలేదు. పనిచేయడానికి జనం ఉన్నారు. వీటి ఎలా ఉపయోగించాలన్నది నేతల సమర్థత మీద ఆధారపడి ఉంది. పథకాలు, పందేరాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుని వెళ్లడం అసాధ్యం అని గుర్తించాలి. అలాగే గత కెసిఆర్ ప్రభుత్వంలా అభూతకల్పనలు,భ్రమలు కల్పించడం మానుకోవాలి.అప్పుడే గ్రామాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయి. పంచాయితీలను పటిష్టం చేసి వాటి ద్వారానే గ్రామాల పురోభివృద్ధికి పాటుపడాలి. రాజ్యాంగం ఇచ్చి అధికారాలను పంచాయితీలకు దఖలు పర్చాలి. తెలంగాణ ప్రజల బతుకులు మారాలన్న ఏకైక లక్ష్యంతో పోరాటం చేసి సాకారం చేసుకున్న ప్రత్యేక తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తి అయ్యాయి. నిజానికి ఇలాంటి చిన్న రాష్ట్రంలో అన్ని వనరులు ఉన్నా ప్రజల ఆకాంక్షలు తీరలేదు. ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న చందంగా పదేళ్లు కల్వంకుంట్ల కుటుంబం రాజభోగాలు అనుభవించింది. గడీల పాలన అందించింది. దీనిని నిందిస్తూ కాలయాపన చేయకుండా రేవంత్ సర్కార్ ముందుకు సాగాలి. అలాగే ఈ పదేళ్లలో తెలంగాణలో ఎవరి బతుకులు మారాయన్నది గమనిస్తే.. రాజకీయ పార్టీల్లో కొందరి బతుకులు మారాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంతో ప్రజల బతుకులు అలాగే ఉన్నాయి. ఈ క్రమంలో పదేళ్ల పాలనపైనా, ప్రజల జీవన చిత్రంపైనా చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. రేవంత్ ప్రభుత్వం గత విధ్వంసాలను గుర్తించి ముందుకు సాగాలి. ప్రజలు ఏం కోరుకుంటున్నారో చర్చించాలి. మూసపద్ధతిలో కాకుండా నిర్మాణాత్మక వైఖరితో ముందుకు సాగితే సింగపూర్, మలేషియా లాంటి చిన్నచిన్న దేశాలను అధిమించవచ్చు. నీళ్లు, నిధులు,నియామకాలు అన్న నినాదంలో ఏవీ సాకారం కాలేదు. గత ప్రభుత్వ తప్పిదాలను సమీక్షిం చుకుని ప్రజలు కోరుకుంటున్న విధంగా పాలన సాగించాలే కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేయాలి. లేకుంటే..రాజకీయాల్లో ప్రజలు తమదైన రీతిలో బుద్ది చెబుతారని గుర్తించాలి. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తరవాత తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటు లోనూ.. పథకాలను అమలు చేయడంలోనూ.. అంతకు మించిన స్వార్థ ప్రణాళికతో కెసిఆర్ తొమ్మిదిన్నరేళ్లు పాలించారు. అందుకే ఆయన రాజకీయ జీవితం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా అప్రతిహతంగా కొనసాగింది. కానీ ప్రజలనే వారు ఎల్లవేళలా డేగకళ్లు పెట్టుకుని చూస్తుంటారని గమనించలేదు. ఇవాళ తెలంగాణ అమరవీరుల కోసం కన్నీరు కారుస్తానంటే ప్రజలు నమ్మరు. తవ్వినకొద్దీ అవినీతి పుట్టలు బయటపడుతున్నాయి. ఒక్కో పథకం తవ్వేకొద్దీ అవినీతే తప్ప ప్రజలకు మేలు చేసిన ఆనవాళ్లు కానరావడం లేదు. కాళేశ్వరంతో పాటు అనేక ప్రాజెక్టులను కట్టినట్లు చెప్పి అవినీతిని పారించారు. చెరువులను పునరుద్దరించి గొలుసుకట్టు చెరువులకు ప్రాణం పోసామని డొల్ల మాటలు ప్రచారం చేశారు. మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీరు సరఫరా చేసామని బుకాయించారు. హరితహారంతో పచ్చదనాన్ని పెంచామని చెప్పి పచ్చి అబద్దాలు చెప్పారు. అన్ని పథకాల్లో అవినీతి దాగివుందన్న సత్యం బయటకు రావడంతో ప్రజలతో పాటు ప్రపంచం కూడా విస్తుపోయింది.ప్రజలకు ఆదర్శ నేతగా నిలవాల్సిన కెసిఆర్ కేవలం తన కుటుంబం, తన బంధువుల కోసం స్వార్థ రాజకీయాలు చేసారని చెప్పడంలో సందేహం లేదు. ఓ రకంగా చెప్పాలంటే పదేళ్ల కెసిఆర్ పాలన అంతా గోబెల్స్ ప్రచారంతో సాగింది. ఇప్పుడు అధికారం కోల్పోవడంతో అదే పనిలో బిఆర్ఎస్ నేతలు ఉన్నారు. నిత్యం ఏదో ఒక ఆరోపణతో తమ గత పాపాలను బయటకు రాకుండా చూస్తున్నారు.తెలంగాణలో కెసిఆర్‌ను మించిన విజినరీ నేత లేదని అప్పుడూ, ఇప్పుడూ భ్రమింప చేస్తున్నారు. కరిమింగిన వెలగ పండులా ఆయన విజినరీ అంతా లోపాలపుట్ట అని తేలింది. అనేక ఆశలు,ఆశయాలతో, అమరుల త్యాగాల తో పురుడుపోసుకున్న తెలంగాణను అభివృద్ధిపథంలో తీసుకెళ్లేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నా, స్వార్థమనే పథకంలో కొట్టుకు పోయాయి. ఈ క్రమంలో పదినెలల రేవంత్ ప్రభుత్వం ఆర్భాటాలకు, అనవసర ఖర్చుల కు, ఉచిత పథకాల జోలికి పోకుండా క్షేత్రస్థాయిలో సమస్యలపై దృష్టి సారించాలి. తెలంగాణ అభివృద్ధిని మళ్లీ పట్టాలకు ఎక్కించాలి. తాము ఇచ్చిన గ్యారెంటీల పేరుతో కాలక్షేపం చేయకుండా గ్రామస్థాయిలో సమస్యలను ఆకళింపు చేసుకోవాలి. గ్రామాలను బలోపేతం చేసి అభివృద్ధి చేయాలి. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవ నినాదాలతో సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చామన్న ఘనత సాధించాలి. ఉద్యోగాల కల్పన, గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంచడం, వ్యవసాయాన్ని బలోపతేం చేయడం వంటి కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగించాలి.

# లెక్క తేలుస్తారు సరే, మరి వాటా?




కులం గురించిన చర్చ ఈ రోజు కొత్తగా జరుగుతున్నది కాదు. కానీ, ఈ చర్చ వచ్చిన ప్రతీసారి కొన్ని కొత్త సమస్యలు తెరపైకి వస్తున్నాయి. మరిన్ని కొత్త చర్చలు తెర మీదకొస్తున్నాయి. ప్రస్తుతం మన రాష్ట్ర ప్రభుత్వం చేయాలనుకుంటున్న బీసీ కులగణనకు సంబంధించిన చర్చ కూడా పలు ఆలోచనలకు తావిస్తున్నది. గత అనుభవాలే మూల కారణం. కులం ఆధారంగానే మన దేశ సామాజిక వ్యవస్థ నిర్మాణం జరిగింది. ఇప్పటికీ అదే కొనసాగుతున్నది. కొందరు నాయకులు మినహాయిస్తే కులం విషయంలో అందరూ ఆ తాను ముక్కలే. ఎన్నికలు వచ్చాయంటే చాలు, బీసీల మీద అన్ని పార్టీలకు వల్లమాలిన ప్రేమ పుట్టుకొస్తుంది. గత ఎన్నికలకు ముందు భారత్ జోడోయాత్ర సందర్భంగా రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేసి రిజర్వేషన్లు వర్తింపజేస్తామని బాహాటంగానే ప్రకటించారు. ఇక్కడ జరిగిన కామారెడ్డి డిక్లరేషన్‌లో ఈ విషయంపై మరింత స్పష్టత ఇచ్చారు. 42 శాతం రిజర్వేషన్ కూడా కల్పిస్తామని చెప్పారు. దానికి కొనసాగింపుగానే కావచ్చు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల కులగణన చేయాలని 2024, అక్టోబర్ 11 నాడు జీవో నెంబర్ 18 విడుదల చేసింది. 60 రోజుల్లో కులగణనను పూర్తిచేసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం ఆ దిశగా బీసీ కమిషన్‌కు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రంలో ఉన్న దాదాపు 134 బీసీ కులాలకు సంబంధించి జనాభా లెక్కలు తేల్చే వ్యవహారం కొలిక్కి వచ్చినందుకు బీసీ సంఘాలు నిజంగానే తెగ సంబురపడిపోతున్నాయి. ఇందుకు చొరవ తీసుకున్న ప్రభుత్వానికి అభినందనలు కూడా తెలిపాయి. ఇంతవరకు బాగానే ఉంది. కులగణన పూర్తయిన తర్వాత వచ్చిన ఆ లెక్కల ఆధారంగా కులాల ప్రాతిపదికన ఈ ప్రభుత్వం రాజకీయ ప్రాతినిధ్యాన్ని ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో కల్పించనుందా? 42 శాతం రిజర్వేషన్‌ను ఎలా అమలుచేస్తారు? మొత్తం రిజర్వేషన్ల శాతం 50 శాతానికి మించొద్దని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు వెల్లడించిన నేపథ్యంలో బీసీలకు 42 శాతం ఎలా సాధ్యమవుతుంది. కులగణన చేసినంత మాత్రాన సరిపోతుందా? తద్వారా రావలసిన ఫలాలు, అందాల్సిన అదనపు ప్రయోజనాలు లేనప్పుడు ఈ లెక్కలు తేల్చే వ్యవహారం వల్ల ఉపయోగం ఏమిటన్నది ఇప్పుడు కొత్తగా ఉద్భవిస్తున్న ప్రశ్న. నిజానికి దేశవ్యాప్తంగా ఉన్న బీసీలకు రావాల్సినంత గుర్తింపు రాలేదు. వారికి తీరని అన్యాయం జరిగిందనే విషయం రూఢీ అవుతున్నది. ఇంతకు మించి వారికి ఏదో చేయాలనే చాలామంది నాయకులు అనుకుంటున్నారు. కానీ, ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల లెక్కలు తేల్చి ఎవరెంతో.. వారికి అంత అనే మాట అంటున్నది. కానీ, ఇది సాధ్యమేనా? బీసీల రాజకీయ సాధికారతను కల్పించే విషయంలో ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిపైన చాలామందికి అనుమానాలుంటాయి. ఇప్పుడు అదే జరుగుతున్నది. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఎన్ని అమలయ్యాయి? మిగిలినవి ఎందుకు అమలుకాలేదు? ప్రభుత్వం వద్ద నిధులు లేవా? లేక చిత్తశుద్ధి లేదా? ప్రభుత్వ పనితీరును ఎట్లా అర్థం చేసుకోవాలి? ఇట్లా చాలా విషయాలు జనం చర్చల్లో ఉన్నాయి. కానీ, బీసీ కులగణన విషయానికి వచ్చేసరికి మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగానే బీసీల రాజ్యాధికారం కోసం ఆలోచిస్తుందా? ఆచరిస్తుందా? నిజంగానే బీసీల కోసం పనిచేస్తుందా? ఆ దిశగా చిత్తశుద్ధితో అడుగులు వేస్తుందా? ఇలాంటి ప్రశ్నలు గత ఏడు దశాబ్దాల కాలంలో సింహభాగం అధికారంలో ఉన్న ఏకైక పార్టీగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని చూసిన ఎంతోమంది మదిలో తలెత్తుతున్నవి. దేశవ్యాప్తంగా బీసీల కోసం చిత్తశుద్ధితో పనిచేసే పార్టీలు, నాయకుల కోసం టార్చిలైట్ వేసుకొని వెతకాల్సిన స్థితి ఉన్నది. దానికితోడు బీసీ కులగణన విషయంలో బీహార్ రాష్ట్ర అనుభవం కూడా ఉన్నది. వారు మొత్తం 65 శాతం రిజర్వేషన్లను ఆ రాష్ట్రంలో అమలుచేయగా సుప్రీంకోర్టు దానిపై అభ్యంతరాలు వ్యక్తం చేయటం అందరికీ తెలిసిన విషయమే. 50 శాతానికి మించి ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు ఉండరాదని నొక్కి వక్కాణించి చెప్పడం గమనించదగిన విషయం. ఇక్కడ కూడా కులగణన అనంతరం ఎటూ తేల్చకుండా వదిలేస్తారా అనే సందేహాలు తెలంగాణలోని బీసీ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం ఎలాగూ ఇవ్వకతప్పని అనివార్య స్థితి. ఇక మిగిలేది 29 శాతం. కులగణన అనంతరం కులాల ప్రాతిపదికన జనాభా శాతాన్ని దృష్టిలో పెట్టుకొని నిజంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే 63 శాతానికి మించి రిజర్వేషన్లు అమలుచేయాల్సి ఉంటుంది. లేదంటే పెద్ద మనసుతో ఈ ప్రభుత్వం జనరల్ సీట్లలో సైతం బీసీలకు కులాల ప్రాతిపదికన సీట్లు ఇచ్చి బరిలో నిలిపి తమ చిత్తశుద్ధిని చాటుకోవాల్సి ఉంటుంది. మొన్న ఈ మధ్య జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీ ఎన్ని సీట్లు ఇచ్చిందో అందరికీ తెలుసు. అలాంటిది త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనరల్ కేటగిరి సీట్లలో బీసీలకు ఇచ్చేంత పెద్ద మనసు ఈ ప్రభుత్వానికి, ఈ పాలకులకు ఉంటుందా? అనే విషయాన్ని బీసీ సంఘాలు ఆలోచించుకోవాలి. నిజంగా అంత పెద్ద మనసుంటే తెలంగాణలో ఉన్న మొత్తం గ్రామ పంచాయతీలు 12,769 గ్రామాల్లో 42 శాతం అంటే 5,363 గ్రామ పంచాయతీలకు సర్పంచులుగా బీసీ కులాలకు చెందినవారు ఎన్నిక కావడం ఖాయం. అంతేకాదు, వేలాదిమంది వార్డు మెంబర్లు, 540 మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీపీలుగా 226 మంది, 32 జిల్లా పరిషత్ కార్యాలయాల్లో జిల్లా పరిషత్ చైర్మన్లుగా 14 మంది, ఇంకా జడ్పీటీసీలుగా, ఎంపీటీసీలుగా వందలాది మంది ఎన్నికయ్యే అవకాశాలు లేకపోలేదు. ఈ గణాంకాలు వినడానికి, చూడటానికి బీసీలకు కానీ, బీసీ సంఘాల నాయకులకు కానీ ఎంతో సంతృప్తినిస్తాయనటంలో సందేహం లేదు. కానీ, ఆచరణ సాధ్యమైనప్పుడే ఈ సంతృప్తి మిగులుతుంది. కేవలం కులగణన చేసి రిజర్వేషన్లు అమలుచేయకపోతే విస్తరు వేసి వడ్డన చేయకుండా అవమానపరిచినట్టే భావించి బీసీలు అదే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పే అవకాశాలున్నాయి.అదే జరిగితే, దాదాపు 60 శాతానికి పైగా బీసీ జనాభా కులాలవారీగా లెక్క తేలితే, కనీసం వారికి ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం అమలు చేయకపోతే జరగబోయే పర్యవసానాన్ని సైతం ఈ ప్రభుత్వం ముందే గుర్తిస్తే మంచిదేమో. ఏదేమైనా లెక్కలు తేల్చే పనికి పూనుకున్నందుకు ఒక పక్క అభినందనలు చెప్తూనే, మరోపక్క వారిచ్చిన మాటను పదే పదే గుర్తుచేస్తూ ఇచ్చిన రిజర్వేషన్ హామీని సాధించుకునే దిశగా కలిసికట్టుగా బీసీ సంఘాల నాయకులు ముందడుగు వేస్తే బాగుంటుంది.

## మహిళ మీద కన్నేసి బాలిక హత్య

### సూరారం బాలిక మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

మేడ్చల్ : సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో దసరా పండుగ రోజు జరిగిన దారుణ ఘటనపై పోలీసులు కూలీ లాగి ఛేందించారు. అదృశ్యమైన ఏడేళ్ల చిన్నారి చివరికి ఓ సంచిలో మృతదేహమై కనిపించడంతో కేసు విషాదాంతమైంది. ఈ కేసును మేడ్చల్ జిల్లా సూరారం పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి విచారించగా, అసలు విషయం వెలుగుచూసింది. వివాహిత మీద కన్నేసిన నిందితుడు ఆమె కుమార్తెను హత్య చేశాడు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం పాటగూడ గ్రామానికి చెందిన మిశ్రమ్ ప్రభాకర్ (40) ఏడు నెలల క్రితం హైదరాబాద్ వచ్చాడు. ఇద్దరు కుమార్తెలు ఉన్న గ్రామానికే చెందిన మహిళతో కలిసి కుత్బుల్లాపూర్ పరిధి సూరారం జీవన్ జ్యోతినగర్ లో ఉంటున్నాడు. కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మహిళకు ఇద్దరు కూతుళ్లు కాగా, పెద్ద కూతురు జోష్న వయసు ఏడేళ్లు. ఈ క్రమంలో ప్రభాకర్ కు ఆ ప్రాంతానికే చెందిన తిరుపతి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ప్రభాకర్ తన ఇంట్లోనే తిరుపతితో కలిసి తరుచూ మద్యం సేవించేవాడు. ఆ క్రమంలో ప్రభాకర్ ఇంట్లో ఉన్న మహిళపై తిరుపతి కన్నేశాడు. ఇద్దరు పిల్లలు, ప్రభాకర్ అడ్డు తొలగించుకుంటే ఆ వివాహితను తన సొంతం చేసుకోవాలని భావించాడు. తన ప్లాన్ ప్రకారం అక్టోబర్ 12న ఉదయం వివాహిత పెద్ద కుమార్తె (7)ను తన ఇంటికి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం తిరుపతి ఆ బాలికను తిరిగి తీసుకొచ్చి ప్రభాకర్ ఇంట్లో వదిలేశాడు. సాయంత్రం మరోసారి ప్రభాకర్ ఇంటికి వచ్చి చూడగా, ఎవరూ లేరని తెలుసుకున్నాడు. దాంతో బాలికకు మరోసారి మాయ మాటలు చెప్పి బైకు మీద తీసుకెళ్లాడు. అయితే రాత్రి అయినా బాలిక ఇంటికి తిరిగి రాకపోవడంతో ప్రభాకర్, మహిళ కలిసి సూరారం పోలీసులను ఆశ్రయించారు. బాలిక అదృశ్యమైందని ఫిర్యాదు చేసి వివరాలు ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రత్యేక బృందాలతో బాలిక ఆచూకీ కోసం గాలించారు. ఈ క్రమంలో మేడ్చల్ పోలిస్‌స్టేషన్ పరిధి బాసరేగడి గ్రామం సమీపంలో ఓ సంచిలో బాలిక మృతదేహం కనిపించింది. ఆ డెడ్ బాడీ అదృశ్యమైన చిన్నారిదేనని నిర్ధారించారు. బాలిక కనిపించకుండా పోయిన తరువాత నుంచి తిరుపతి జాడ లేకపోవడంతో పోలీసుల ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టారు. బాలికను బైకు మీద తీసుకెళ్లినట్లు సీసీ కెమెరాల ద్వారా ద్వారా గుర్తించిన పోలీసులు మంగళవారం నిందితుడు తిరుపతిని అరెస్ట్ చేశారు.నిందుతుడు తిరుపతిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. చిన్నారిని బైకు మీద తీసుకెళ్లిన తిరుపతి బాసరగడి గ్రామం దగ్గర కత్తితో చిన్నారి గొంతు కోశాడు. కడుపుతో సైతం కత్తితో పొడిచి బాలికను చంపినట్లు నిందితుడు తిరుపతి అంగీకరించాడు. బాలిక మృతదేహాన్ని ఓ సంచిలో మూటకట్టి సమీపంలోని అటవీ ప్రాంతంలో విసిరేసి పారిపోయినట్లు తెలిపాడు.


## నేతన్నలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

### నాలుగు నెలలైనా అమలుకు నోచని హామీ

విజయవాడ : దసరా పండుగకు చేనేత సొసైటీల్లో వస్త్ర విక్రయాలకు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తుందని ఆశించిన నేతన్నలకు నిరాశే మిగిలింది. పండుగకు ఇచ్చే రిబేటుపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటనా చేయలేదు. దీంతో సాదాసీదాగానే వస్త్ర వ్యాపారం సాగింది. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకున్న నేతన్నలకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అయితే టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా ఈ హామీ అమలుకు నోచుకోలేదు. మరోపక్క రిబేటు, యార్న్ సబ్సిడీ పాత బకాయిలను ప్రభుత్వం విడుదల చేయలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకపోవడంతో నేతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, రాష్ట్ర విభజన తర్వాత 2014–19 మధ్యకాలంలోనూ చేనేత వస్త్ర ఉత్పత్తుల అమ్మకాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాయి. పండుగల రోజుల్లో సొసైటీల్లో వస్త్ర విక్రయాలపై 30 శాతం రిబేటు ప్రకటించాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత వస్త్ర విక్రయాలకు ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహలను, సొసైటీలకు విడుదల చేయాల్సిన రాయితీ బకాయిలను నిలిపివేసింది. తాజాగా టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది జూలై 13న రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి ఎస్.సవిత కృష్ణాజిల్లా పెడన, గూడూరు మండలాల్లో పర్యటించి ప్రసిద్ధి చెందిన చేనేత సొసైటీలను పరిశీలించారు. నేతన్నలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ప్రకటించారు. దీంతో గత టిడిపి హయాంలోలాగా సొసైటీల్లో వస్త్ర విక్రయాలపై పండుగలకు ప్రభుత్వం 30 శాతం రిబేటు ప్రకటిస్తుందని, తద్వారా ఈ ఏడాది వస్త్ర వ్యాపారం పెరుగుతుందని ఆశించిన వారికి నిరాశే మిగిలింది.

## పశ్చాత్తాపం కీర్తనా దీపం

కీర్తనలు అనే సరికి మనకు బైబిలు గ్రంథంలో.. దావీదు మహారాజే గుర్తొస్తాడు. మహారాజు స్థాయిలో ఉండి కూడా, ఒక సామాన్యునిగా మారిపోయి దేవునిపై అన్ని కీర్తనలు రాయడం ఓ గొప్ప సంగతి. అందుకు బలమైన కారణం ఒకటి ఉండి తీరాలి. ఈ దావీదు మహారాజు సమైక్య యూదా సామ్రాజ్యానికి రెండో మహారాజు. క్రీస్తుకు వెయ్యేండ్లు ముందటివాడు. క్రీస్తు ప్రభువు ఆ మహారాజు వంశీయుడు, వారసుడు. ఆయన రాసిన కీర్తనలు ఇప్పటికీ చిరంజీవులే. వాటి ఆయుష్షు మూడు వేల సంవత్సరాలకు పైబడే. ఆయనలోని బాధాతప్త హృదయం నుంచి వందల కొద్ది కీర్తనలు వెలువడ్డాయి. అంతటి మహారాజు బాధతో కుంగిపోవలసినంతటి దుర్ఘటన ఏమై ఉంటుందీ ? ఏ సౌకర్యానికైనా కొదవలేని ఆ మహారాజు భయపడింది నైతిక విలువలకు. సంఘానికి. పాపభీతికి. తనను నడిపించిన దైవానికి. అవును ఆయన పాపం చేశాడు. చేసిందాన్ని ఒప్పుకోవడం నిజాయితీ. ఒప్పుకొన్న దానికి పశ్చాత్తాప పడటం గొప్ప సంస్కారం. ఇక మీదట దాన్ని కనుసన్నల్లోకి రానీయకుండా జాగ్రత్తపడటం, పశ్చాత్తాపపడటం మహోత్కృష్టం. ఈ మూడూ అలా ఉంచితే , ఆ విరిగి నలిగిన బాధాతప్త హృదయాన్ని అక్షర రూపంలో కీర్తనలుగా పాడుకోవడం నాలుగో విశేషం. ఇంతకూ ఆ మహారాజు చేసింది అంతటి తప్పా అంటే, అది తప్పే కాదు . చాలా ఘోరమైన పాపం. అంతకుమించింది మరొకటి లేనే లేదు. అన్ని తప్పులూ అందులోనే ఇమిడి పోయాయని చెప్పక తప్పదు. సంఘటనాత్మకంగా ఏర్పడినప్పటికీ.. అదో పీడకల. తన కోటలోని ఒక ఉద్యోగి భార్యపై అనుకోని రీతిగా ఆకర్షితుడు కావడం, ఆమెను బలవంతంగా కోటకు రప్పించుకొని , తన కామవాంఛను తీర్చుకోవడం– ఇదొక దోషం. అంతటితో ఆగక, ఆమె భర్త మరణానికి బాహ్యంగా ప్రధాన కారకునిగా ఉండడం అనేది మరో పాపం. ఇవి ఆయన చేసిన రెండు పాతకాలు. ఒకటి అత్యాచారం. మరొకటి హత్య. రాజ్య సింహాసనంపై కూర్చున్న మహాప్రభువు.. మానవాధమునిగా పతనమై పోయాడు. తను చేసిన తప్పులకు పశ్చాత్తాపం చెంది దేవుడి ముందు మోకరిల్లి దుఃఖించాడు.



ఆధ్యాత్మికం

# జీడిమెట్ల సబూరి ఫార్మాలో ప్రమాదం

## - కెమికల్ సంపూ శుద్ధి చేసే క్రమంలో సంపులో పడి ఇద్దరు కవల యువకులు మృతి

## - వారిని పైకి తీసే క్రమంలో మరో కార్మికుడు అస్వస్థతకు గురి



**కుత్బుల్లాపూర్, (ది క్రైమ్ న్యూస్) అక్టోబర్ 16:** జీడిమెట్ల సబూరి ఫార్మా కెమికల్ కంపెనీలో ప్రమాదం చోటుచేసుకుంది. బుధవారం జీడిమెట్ల ఇండస్ట్రీయల్ పరిధి మూసిఉన్న సబూరి ఫార్మా కెమికల్ కంపెనీలో కెమికల్ సంపు శుద్ధి చేసే క్రమంలో సాదు నారాయణ రావు అనే వ్యక్తి ఆ కంపెనీలో ప్యాబిరికేషన్ కాట్రాక్ట్ చేపత్తగా, అతనితో డైలీ లేబర్ గా పనిచేస్తున్న కవలలు 32 రాము, లక్ష్మణ్ లు ఒకరు సంపును క్లిన్ చేసే సమయంలో అందులో జారీ పడగా,అతడిని కాపాడే క్రమంలో మరొకరు అందులోకి పడి ఇరువురు కవల యువకులు మరణించారు. వీరిని బయటకు తీసేందుకు యత్నించిన మరొక కార్మికుడు అందులోకి దిగి తీవ్ర అస్వస్థకు గురై హాస్పిటల్ లో కొట్టుమిట్టాడు తున్నాడని సమాచారం. మూతపడిన కంపెనీని ప్యాక్టరీ స్ ఇన్స్పెక్టర్ అనుమతి లేకుండా ఫార్మా కెమికల్ రి ఇన్నోవేషన్.. ఫార్మా కంపెనీ ఓనర్ లు, కిషోర్ రెడ్డి, సతీష్ రెడ్డిల నిర్లక్ష్యంతోనే కవల నిండు ప్రాణాలు బలి.. మూతపడిన సబూరి ఫార్మా కంపెనీలో ప్యాక్టరీస్ అఫ్ ఇన్స్పెక్టర్ పర్మిషన్ లేకుండానే కంపెనీని రి ఇన్నోవేట్ చెయడం అలాగే, అవగాహన లేని కార్మికులతో కంపెనీ కెమికల్ సంపు అయినటువంటి వ్యక్యూమ్ జెట్ ట్యాంక్ లో కెమికల్ ఉందనే విషయం క్లినింగ్ వెళ్లిన కార్మికులకు తెలియపర్చకుండా రెండు నిండు ప్రణాలను బలిగొన్నారు. చనిపోయిన ఇద్దరు కవల యువకులు కెమికల్ ట్యాంక్ లో పడ్డ అనంతరం వారి నోట్లోకి కెమికల్ నీరు వెళ్లి ఊపిరి తీత్తులు చెడిపోయి మరణించి ఉంటారని,అట్టి నీటిని ల్యాబ్ టెస్ట్ కొరకు పంపినట్లు, అలాగే జీడిమెట్ల స్టేషన్ డిఐ కనకయ్య తెలిపిన వివరాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చెస్తున్నట్లు సమాచారం. ఇన్స్పెక్టర్ ఆఫ్ ప్యాక్టరీస్ ఇండస్ట్రీస్ నితిన్ కుమార్ ను ప్రమాదంపై వివరణ కోరగా సబూరి ఫార్మా కెమికల్ కంపెనీ గత కొన్ని నెలలుగా మూసి ఉందని, అట్టి ఫార్మా కంపెనీ రి ఇన్నోవేషన్ కొరకు మా దగ్గర నుండి ఎటువంటి అనుమతి లేదని అట్టి కంపెనీపై దర్యాప్తు చేసి భాద్యులపై చట్టపరమైన చర్యలు చేపడతామని అన్నారు.



# సమైక్య రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని

# అవినీతి కేసీఆర్ ప్రభుత్వం చేసింది

## - టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

**కూకట్ పల్లి అక్టోబర్ 17 (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో ప్రతీ వ్యక్తి మీద రెండు లక్షల అప్పుకి కారణం కేసిఆర్ పాలన కాదా అని సూటిగా ప్రశ్నించిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొమ్మిది నెలల కాలంలో యెనభై వేల కోట్ల రూపాయల అప్పులు చేసారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం గాంధీభవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. ఈ సందర్బంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ తొమ్మిది నెలల్లోనే ఎనభై వేల కోట్ల రూపాయల అప్పులు చేసారని ఈ రాష్ట్రాన్ని దివాళా తీయిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుందన్నారు. పదేళ్లు ఈ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత మీది కాదా అని ప్రశ్నించారు. సమైక్య రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని అవినీతి కేసీఆర్ ప్రభుత్వం చేసిందని, పదేళ్ల క్రితం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయినపుడు మిగులు బడ్జెట్ తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని ఏడు లక్షల కోట్ల పై చిలుకు అప్పులు చేసి ఈరోజు ప్రతి వ్యక్తి మీద 2లక్షల అప్పుకు కారణం మీరు కాదా అని ప్రశ్నించారు. తమ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక అరవై తొమ్మిది వేల కోట్లు అప్పు అయితే దాంట్లో యాభై వేల కోట్లు దాదాపుగా తమ గత ప్రభుత్వ అప్పుల వడ్డీలు కట్టేందుకే సరిపోయిందని, అందులో ఇరవై వేల కోట్లు రైతు రుణమాఫీ చేశామని, అనేక సంక్షేమ కార్యక్రమాలు చేసేది తమ కళ్ళకు కనపడుతుంటే, అసలు ఆ మాటలు అనడానికి మీకు నోరెలా వచ్చిందని అన్నారు. హైదరాబాద్ మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లుగా నటిస్తూ అనేక అక్రమాలకు తెరలేపింది, అక్రమ జీవోలతో బిల్డర్స్ కి ఎక్కువ ఎస్ఎఫ్టి కి ఇచ్చి అక్రమాలకు పాల్పడింది, మూసి ప్రక్షాళన మొదలు పెట్టింది మీరు కాదా కేటీఆర్ అని ప్రశ్నించారు. అప్పుకు కాదు ఏది అనర్హం అన్నట్లుగా ప్రతి దాని మీద అప్పుల కుప్పగా ఈ రాష్ట్రాన్ని తాయారుచేసారు. మీరు చేసిన పాపాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కడిగే ప్రయత్నం చేస్తుంటే ప్రశ్నించే నైతిక హక్కు మీకు ఎక్కడిదని ప్రశ్నించారు.



# ఉత్సాహంగా ఎస్ జి ఎఫ్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు



**సుల్తానాబాద్, అక్టోబర్ 17 (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లాస్థాయి ఎస్ జి ఎఫ్ వాలీబాల్ క్రీడా పోటీలు గురువారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 14, 17 బాల బాలికల వాలీబాల్ పోటీలలో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులను జిల్లా డీవైఎస్వో సురేష్, సుల్తానాబాద్ మున్సిపల్ ఛైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు తదితరులు క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు.ఈ సందర్భంగా డివైస్ ఓ సురేష్, మున్సిపల్ ఛైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు మాట్లాడుతూ క్రీడల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. సుల్తానాబాద్ పట్టణం క్రీడలకు పుట్టినిల్లు అని, గెల్లు మధుకర్ ఖో ఖో క్రీడలో అంతర్జాతీయస్థాయిలో ఆడి మన సుల్తానాబాద్ కు పెద్దపెల్లి జిల్లాకు మన రాష్ట్రానికి మంచి పేరు తీసుకొచ్చాడని, విద్యార్థులు క్రీడల పై దృష్టి సారించి జిల్లాకు పలు పథకాలు సాధించాలని సూచించారు. మన రాష్ట్రంలో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని,ఉన్నత ఉద్యోగాలతో పాటు ఖరీదైన ఇళ్ల స్థలాలు మన రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. సాయంత్రం కాలంలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు మూస్త్యాల రవీందర్, పెద్దపల్లి పేట అధ్యక్షుడు సురేందర్, కార్యదర్శి దాసరి రమేష్, పేట రాష్ట్ర బాధ్యులు శోభ, కాంప్లెక్స్ హెచ్ఎం రత్నాకర్ రెడ్డి, సీనియర్ క్రీడాకారుడు కుమార్ కిషోర్, జోనల్ కార్యదర్శులు లక్ష్మణ్, మాధురి, కడారి రవీందర్, ఫిజికల్ డైరెక్టర్స్ దాసరి ప్రసాద్, ప్రణయ్, సంధ్య, ఆసియా, హరికృష్ణ, రాజేందర్, సత్యం, విష్ణు, అజ్జు, కుమార్, శ్రీనివాస్, కొమురయ్య, సోమశేఖర్,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి ఫుట్బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు ఎంపిక

**కరీంనగర్ ప్రతినిధి అక్టోబర్ 17(క్రైమ్ న్యూస్):** క్రీడలు విద్యార్థులకు తప్పనిసరియని అందులో పాల్గొనడం ద్వారా విజయాలను సులభంగా పొందవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ కు చెందినటువంటి విద్యార్థులు యస్.జి.యఫ్ రాష్ట్ర స్థాయి ఫుట్బాల్ పోటీలకు ఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు వివిధ క్రీడలపట్ల ఆసక్తిని పెంచాలని వారికి కావాల్సిన వనరులను కల్పించడంద్వారా ఉజ్వలమైన భవిష్యతు పునాది వేసిన వారవుతారని చెప్పారు. పలు రకాల క్రీడలను నిర్వహించడమే కాకుండా వాటిని సరైన రీతిలో విద్యార్థులకు తెలియజేయాలని కోరారు. విద్యార్థులకు ప్రాథమిక దశనుండే వివిధ క్రీడల పోటీల గురించి తెలియజేయాలని కోరారు.ఇటీవల కాలంలో కరీంనగర్ జిల్లాలో నిర్వహించినటువంటి జిల్లా స్థాయి పోటీలలో పాఠశాలకు చెందినటువంటి 10వ తరగతి చదువుతున్న యస్. అశ్వత్, ఖాజా మోహినుద్దీన్ అహ్మద్, బాలుర అండర్ 17 విభాగంలో 8వ తరగతి కె. రిషి, అండర్ 17 బాలికల విభాగంలో 9వ తరగతి చదువుతున్న సహస్ర, అనన్యలు విశేష ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయలు విద్యార్థులు పాల్గొన్నారు.




# విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతున్న లైబ్రరీ సైన్స్, సైకాలజీ కోర్సులు

## - అడ్మిషన్లకు చివరి తేదీ అక్టోబర్ 30


## - కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం వడ్లూరి రామచంద్రం



**గోదావరిఖని (ది క్రైమ్ న్యూస్):** కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ,పీజీ కోర్సులకు అడ్మిషన్లకు అక్టోబర్ 30 చివరి తేదీ అని కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం డైరెక్టర్ వడ్లూరి రామచంద్రం తెలిపారు. ఈ విద్యా సంవత్సరం విద్యార్థులు బి ఎల్ ఐ సి, ఎం ఎల్ ఐ సీ, సైకాలజీ కోర్సులపై అత్యధిక శాతం విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు. లైబ్రరీ సైన్స్‌లో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాబ్ క్యాలెండర్ లో గ్రంథాలయాలలో, గురుకులాలలో, విశ్వవిద్యాలయంలో, ప్రభుత్వ పాఠశాలలలో, ఆదర్శ పాఠశాలలో ప్రభుత్వ శాఖలలో లైబ్రరీ ఉద్యోగ అవకాశాలు అత్యధికంగా ఉండడంతో లైబ్రరీ కోర్స్ పై విద్యార్థులు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా సైకాలజీ, కంప్యూటర్ సైన్స్, మాస్టర్ ఆఫ్ జర్నలిజం, పీజీ కోర్సులపై విద్యార్థులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కొరకు ఆఫ్లైన్లో, ఆన్లైన్లో గాని దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మిగతా వివరాలకు 8341385000 సంప్రదించండి అని అన్నారు.

# ప్రజాకవి కా.రడం శ్రీనుకు కన్నీటి వీడ్కోలు

## - అధికార ప్రతినిధి జగన్ పేరిట లేఖ విడుదల


భారతకమ్యూనిస్టు (మావోయిస్టు)
తెలంగాణరాష్ట్ర కమిటీ

పత్రికా ప్రకటన తేదీ:17.10.2024

జగన్
అధికారప్రతినిధి

**చర్ల,(ది క్రైమ్ న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొమరారం గ్రామానికి చెందిన సాంస్కృతిక కళాకారుడు, ప్రజా కవి రడం శ్రీను ఈనెల 12వ తేదీన అనారోగ్యంతో చికత్స పొందుతూ తుదిశ్వాస విడిచారని ఈ సందర్భంగా అమరుడు కా.రడం శ్రీనుకు కన్నీటి నివాళీ అర్పిస్తూ భారత కమ్యూనిస్టు (మావోయిస్టు) పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ పేరిట గురువారం ఒక లేఖ విడుదల చేశారు.నేడు జరుగుతున్న వర్గ పోరాటంలో ప్రజల పక్షాన నిలిచి జన నాట్య మండలిలో చేరాడని సామ్రాజ్యవాదానికి,దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేక విప్లవ గీతాలను తన గొంతు ద్వారా వినిపిస్తూ సామాజిక ఉద్యమాలలో ప్రజలను సమీకరించాడని అన్నారు.ఈ క్రమంలో శ్రీనుపై నిర్భంధం పెరిగిందని నిత్య నిర్బంధాన్ని సైతం ఎదుర్కొంటూ ప్రజా ఉద్యమాలను వీడలేదని అన్నారు.దోపిడి పాలకులు అమలు చేసిన ఫాసిస్టు నిర్భంధం కారణంగా జన నాట్య మండలిని తాత్కాలికంగా వదిలి ప్రజలను వదుల లేక ప్రజా నాట్య మండలిలో చేరి ప్రజల పక్షాన తెలంగాణ మలి దశ ఉద్యమంలో ప్రజాస్వామిక తెలంగాన కోసం తన గళాన్ని వినిపించాడని అన్నారు.ఆ తరువాత ప్రజా నాట్య మండలి నుండి ప్రజా సంఘంలో చేరి చివరి వరకు ప్రజల తరుపున పోరాడాడని అన్నారు.ప్రజల పక్షపాతి కా.రడం శ్రీనుకు మావోయిస్టు పార్టీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు తెలిపారు.వారి కుటుంబానికి సానుభూతిని తెలుపుతూ కా.రడం శ్రీను ఆశయాలను, ఆదర్శాలను పునికిపుచ్చుకొని తన వారసులుగా తాను ఆశించిన బాటలో నడువాలిని కోరుతున్నట్లు తెలిపారు.మిలిటెంట్ ప్రజా ఉద్యమాలకు ఊపిరిని ఊదుతూ ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడం వలన కా.రడం శ్రీనుకు నిజమైన నివాళి అర్పిస్తున్నట్లు మావోయిస్టులు విడుదల చేసిన లేఖలో పేర్కొన్నారు.

# అధిక సంఖ్యలో సుల్తానాబాద్ మున్సిపాలిటీలో బిజెపి సభ్యత్వ నమోదు



**సుల్తానాబాద్, అక్టోబర్ 17( ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు కూకట్ల నాగరాజు అధ్వర్యంలో పట్టణములోనీ పలు పోలింగ్ బూత్ అధ్యక్షులు సభ్యత్వ నమోదు చేసిన లిస్ట్‌ను బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పెద్దపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ దుగ్యాల ప్రదీప్ కుమార్ కి , అసెంబ్లీ సభ్యత్వ నమోదు ప్రముఖ్ పాల్సాని సంపత్ రావు కి బిజెపి పెద్దపల్లి జిల్లా ఆఫీస్ లో అందివ్వడం జరిగింది. సుల్తానాబాద్ మున్సిపాలిటీలోని పలు పోలింగ్ బూత్ లలో వందకు పైగా జరిగిన బిజెపి సభ్యత్వాల లిస్ట్ ను అందించి 17పొలింగ్ బూత్ లలో అధిక సంఖ్యలో ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు స్వచ్చందంగా ముందుకు వచ్చి బిజెపి సభ్యత్వం నంబర్ 8800002024 తో సభ్యత్వం నమోదు చేసుకోవడం జరిగింది. అలాగే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ తరుపున కార్యకర్తలు పోటీ చేసి అధిక సంఖ్యలో విజయం సాధించడంతో పాటు రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయాలని ఈ సందర్భంగా అసెంబ్లీ ఇంచార్జ్ దుగ్యాల ప్రదీప్ రావు కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమములో సుల్తానాబాద్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు కూకట్ల నాగరాజు, ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి చిట్టవేణి సదయ్య పోలింగ్ బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన సింగరేణి మైన్స్ రెస్క్యూ పోటీలు








**యైటింక్లయిన్ కాలనీ. (క్రైమ్ న్యూస్):** స్థానిక మైన్స్ రెస్క్యూ స్టేషన్ లో బుధవారం నుండి ప్రారంభమైన సింగరేణి జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలు గురువారంతో ముగిశాయి. రాత్రి సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ (పా) జి. వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన పోటీల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్య న్యాయ నిర్ణీత డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ రీజియన్.1 సౌత్ సెంట్రల్ జోన్ హైదారాబాద్ జ్యోతీ ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇక రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో సింగరేణి వ్యాప్తంగా రామగుండం రీజియన్ లోని మూడు డివిజన్లు, అడ్రియాల షాఫ్ట్, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, భూపాల్ పల్లి, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందు, డివిజన్ల నుండి వచ్చిన బ్రిగేడర్లు పాల్గొన్నారు. ఇక పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన బ్రిగేడర్లకు ముఖ్య న్యాయ నిర్ణేత, ఇతర అతిథిలు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, ఐ ఎన్ టి యు స ప్రధాన కార్యదర్శి ధరంపురి, జనరల్ మేనేజర్ సేఫ్టీ కార్పొరేట్ చింతల శ్రీనివాస్, జనరల్ మేనేజర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. శ్రీనివాసరెడ్డి, ఎన్. సుధాకర్ రావు, కె. వేంకటేశ్వర్లు, రెస్క్యూ స్టేషన్ అధికారి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మహాకవి వాల్మీకి జయంతి పురస్కరించుకొని గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఉత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. మహాకవి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మహాకవి వాల్మీకి హైందవ ధర్మానికి అతి ముఖ్యమైన గ్రంథం రామాయణాన్ని రచించారని, రామాయణ గ్రంథం ద్వారా అనేక విలువలను సమాజానికి అందించారని కలెక్టర్ పేర్కొన్నారు. రామాయణం ద్వారా ఆదర్శ మానవుడికి ఉండవలసిన లక్షణాలు, మానవ సంబంధాలు, విలువలను మహాకవి మనందరికీ బోధించారని అన్నారు. మహాకవి వాల్మీకి రచించిన రామాయణం కారణంగానే మన దేశంలో కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉందని కలెక్టర్ తెలిపారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన వసుదైక కుటుంబం అనే భావన రామాయణంతో ముడీబడి ఉందని కలెక్టర్ తెలిపారు. మహాకావ్యం రామాయణాన్ని రచించిన మహాకవి వాల్మీకి జయంతిని పండగగా జరుపుకోవడం సంతోషకరమని కలెక్టర్ తెలిపారు. అనంతరం వక్తలు మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు ప్రకాష్, సునీత, పద్మావతి, కలెక్టరేట్ సిబ్బంది, బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులుగా జంగాలపల్లి కుమార్




**కరీంనగర్ ప్రతినిధి అక్టోబర్ 17(క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన జంగాలపల్లి కుమార్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ నియోజకవర్గం అధ్యక్షులుగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డా. శ్రీనివాస్ నియమించారు. ఈ సందర్భంగా జంగాలపల్లి కుమార్ మాట్లాడుతూ గడిచిన పది సంవత్సరాల కాలంలో తెలంగాణ ఉద్యమకారుల గురించి ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరు సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తెలంగాణ ఉద్యమకారుల గొంతుకగా నిలబడిందని అన్నారు.. తనకు అప్పగించినటువంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించినందుకు మరోసారి అవకాశం కల్పించిన రాష్ట్ర నాయకులు చీమ శ్రీనివాస్, ఓరుగంటి ఆనంద్, మోతే ఎల్లారెడ్డి కరీంనగర్ జిల్లా చైర్మన్ కుమారస్వామిలకు కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా స్వామి



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా అందుగులాపల్లి గ్రామానికి చెందిన పుల్లూరి స్వామిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ సమయంలో పుల్లూరి స్వామీ జైలు జీవితాన్ని అనుభవించరాని, ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని వారు పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్, రాష్ట్ర మహిళ సంఘాల నాయకురాళ్లకు స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

# వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన అడిషనల్ డీసీపీ....



**కరీంనగర్ టౌన్, అక్టోబర్17(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో అడిషనల్ డీసీపీ ఎ. లక్ష్మీనారాయణ, వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీయ ఇతిహాసమైన రామాయణాన్ని వాల్మీకి రచించారాని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్స్పెక్టర్లు రజినీకాంత్అడ్మిన్, శ్రీధర్ రెడ్డి సంక్షేమంతో పాటు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# తాగు నీటి సమస్యను పరిష్కరించండి

## - జిఎం కోరిన టీబీజీకేఎస్ నాయకులు నాగేల్లి



**రామగిరి(ది క్రైమ్ న్యూస్):** ఆర్జి-త్రీ డివిజన్ సెంటినరీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని టీబీజీకేఎస్ నాయకులు నాగేల్లి సాంబయ్య ఆర్జీ-త్రీ జీఎం సుధాకర్ రావునీ కోరారు. సెంటినరీ కాలనీలో తాగునీరు సమస్య గత మూడు నెలలుగా ఎక్కువగా ఉన్నది తెలంగాణ పండుగలు అయినా బతుకమ్మ దసరా పండుగ అప్పుడు కూడా క్వార్టర్లోకి సింగరేణి కార్మికుల కుటుంబాలకు ఆర్జీత్రీ యాజమాన్యం సరియైన విధంగా తాగునీరు సరఫరా చేయలేకపోయిందన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నప్పటికీ ఇక్కడున్న యాజమన్యం పూర్తిస్థాయిలో కార్మికుల సమస్యలను పరిష్కరించలేక పోతుందన్నారు. కాలనీలోని క్వార్టర్లలో నీటి సరఫరా ఇవ్వకపోవడం వలన కార్మికుల కుటుంబ సభ్యులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. రెసిడెన్షియల్ కమిటీ తోటి అధికారులు పాదయాత్ర చేసి కాలనీ సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ఆర్జీ- 3 జీఎం ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కరించాలని, లేనిచో కాలనీ మహిళల తోటి ఖాళీ బిందెలతో ఆర్జీత్రీ జిం ఆఫీస్ ముందు ధర్నా కార్యక్రమం చేపడతామని హెక్కరించారు.

# అట్టహాసంగా నాయబ్ సింగ్ సైనీ ప్రమాణం

## హాజరైన ప్రధాని మోడీ, అమిత్ షా, చంద్రబాబు




**చండీగఢ్,అక్టోబర్17(ది క్రైమ్ న్యూస్):** హరియాణా ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. 90 అసెంబ్లీ స్థానాలకుగానూ 48 చోట్ల బీజేపీ గెలుపొందింది. గవర్నర్ బండారు దత్తాత్రేయ.. నాయబ్ సింగ్‌తో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ , ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు. సీఎంతోపాటు అనిల్ విజ్, క్రిషన్ లాల్ పన్వార్, రావ్ నర్బీర్ సింగ్, మహిపాల్ ధండా, విపుల్ గోయెల్, అరవింద్ కుమార్ శర్మ, శ్యామ్ సింగ్ రాణా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇక్కడ సీఎం సహా 14 మంది మంత్రులు ఉండే అవకాశం ఉంది. సైనీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగియడంతో పంచ్‌కులాలో ప్రధాని మోదీ అధ్యక్షతన ఎన్డీయే విస్తృత సమావేశం జరిగింది. దీనికి పవన్ కల్యాణ్ హాజరు కానున్నారు. జమిలి ఎన్నికలు,జనగణన,ఉమ్మడిపౌరస్మృతితదితరకీలకఅంశాలపైఈభేటీలో చర్చించే అవకాశాలున్నాయి. బీజేపీకి, ఎన్డీయే పార్టీలకూ మధ్య సమన్వయానికి ఒక కమిటీ ఏర్పాటు చేయవచ్చని, ఇదే సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబుకు కీలక బాధ్యతలు అప్పగించవచ్చని చర్చ జరుగుతోంది. రాష్ట్రంలోని 90 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ 48, కాంగ్రెస్ 37 సీట్లలో గెలుపొందాయి. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ హరియాణాలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని అంచనా వేసింది. 90 స్థానాల్లో 67.9 శాతం పోలింగ్ నమోదైంది. గెలుపొందిన సీనియర్ నేతల్లో నయాబ్ సింగ్ సైనీతో పాటు, కాంగ్రెస్ నేత భూపిందర్ సింగ్ హుడా, ఃఏఖ నేత అనిల్ విజ్ (అంబలా కాంట్), శ్రుతి చౌదరి (తోషమ్), ఎఔఒఆ అర్జున్ చౌతాలా తదితరులు ఉన్నారు.

# పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్మెంట్, స్కాలర్షిప్‌ని తక్షణమే విడుదల చేయాలి

## - ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం



**గోదావరిఖని (ది క్రైమ్ న్యూస్):** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ కళాశాల పరిధి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించుకోవడం జరిగింది. ఈ యొక్క సమావేశానికి ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్నకొండ సాయి ఆజాద్ అధ్యక్షత వహించగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ముఖ్య అతిథిగా హాజరైనారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్నటువంటి 8 వేల కోట్ల స్కాలర్షిప్,ఫీజు రీయింబర్స్మెంట్ ని తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. స్కాలర్షిప్,ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల కాకపోవడం వల్ల విద్యార్థులు పై చదువులు చదవలేక ఇబ్బందులకు గురవుతున్నారని, విద్యార్థులు ఉన్నత చదువులు పూర్తి చేసుకొని సర్టిఫికెట్స్ కోసం కళాశాలలకు వెళితే స్కాలర్షిప్,ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల కాకపోవడం వల్ల సర్టిఫికెట్స్ ఇవ్వకుండా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అదేవిధంగా లక్షల మంది విద్యార్థులు చదువుకు దూరమైపోతున్నారని, గత ప్రభుత్వం విద్యార్థులను విస్మరిస్తే ఆ ప్రభుత్వం కనపడకుండా పోయిందని, అలాంటి పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానికి రాకుండా ఉండాలంటే పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తక్షణమే స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ ని విడుదల చేయాలని ఆయన అన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కంకణాల రాజు, ఇందారపు అనిల్, మహంకాళి శ్రీ వర్ధన్, శివరామకృష్ణ కాంపల్లి జయంత్ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలోని పలు వ్యవసాయ తోటలను పరిశీలించిన కెవికే శాస్త్రవేత్తలు





**ముత్తారం.అక్టోబర్.17.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని హరిపురం,మైదంబండ గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న ఆయిల్ ఫామ్, బంతి, పసుపు, వరి, పత్తి పంటలను గురువారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. పసుపు నాలుగు నెలల వయసు కలిగి ఉందని కొమ్ము అభివృద్ధి చెందడానికి రైతులు ఎకరానికి 50 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ పిచికారి చేసుకోవాలని పసుపు పంటలో మచ్చ తెగులు ఉన్నట్లయితే దానిని నివారించడానికి ప్రోపికోనజల్ మందును ఒక మిల్లీ లీటర్‌ని లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఐఐఎస్ఆర్ టర్మరిక్ స్పెషల్ అనే సూక్ష్మ ధాతు మిశ్రమమును రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్.వెంకన్న, భాస్కరరావు, వినోద్ కుమార్, పిల్లి కిరణ్, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు అంజనీ దేవి, ఏఈఓ హారిక, హరిపురం మాజీ సర్పంచ్ సంపత్ రావు, రైతులు పాల్గొన్నారు.

# వాల్మీకి జయంతి వేడుకలు



**ముత్తారం.అక్టోబర్.17.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామస్తులంతా గురువారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణం అనే ప్రాచీన ఇతిహాసాన్ని రచించాచారని అది హిందూ సంస్కృతిలో ఒక ముఖ్యమైన గ్రంథంగా పరిగణించబడుతుందని వారు అన్నారు. ఇది ఒక మహాకవి, ఆధ్యాత్మిక గురువు అయిన వాల్మీకికి అంకితమైన రోజు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓడేడు గ్రామస్తులు,నాయకులు పాల్గొన్నారు.

# ఖాజీల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం

**అమరావతి,అక్టోబర్17(ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రంలో ప్రభుత్వ ఖాజీల సమస్యలన్నింటినీ ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తామని మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. సచివాలయంలో ప్రభుత్వ ఖాజీల ప్రతినిధులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన మైనార్టీల సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరించేందుకు ఇప్పటికే ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం ఒక ప్రభుత్వ ఖాజీ ఉన్నచోట మరొకరిని, లేదా అదనపు ఖాజీని నియమించకూడదన్నారు. గత ప్రభుత్వం ఖాజీల చట్టానికి విరుద్ధంగా నియోజకవర్గానికి ఒకరి కంటే ఎక్కువ సంఖ్యలో ఖాజీలను నియమించిందని చెప్పారు. ఉన్నవారికి కాలపరిమితిని తొలగించి క్రమబద్ధీకరించాలని కోరారు. ఎయిడెడ్, నాన్ ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో ఉర్దూను ద్వితీయ భాషగా పరిగణించాలన్నారు. ఖాజీల అవసరాలకు తగ్గట్టుగా మొబైల్ యాప్ రూపొందించాలని కోరారు. దుల్హన్ పథకం కింద ప్రయోజనం పొందేందుకు గత ప్రభుత్వం విధించిన అసమంజస నిబంధనల్లో మార్పులు చేయాలని కోరారు.

# ఆర్థిక భారంతో విద్యార్థులకు విద్యను అందించలేక పోతున్నాం

## - విధి లేని పరిస్థితుల్లో విద్యాసంస్థల నిరవధిక బంద్ - తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ మేనేజ్మెంట్ అసోసియేషన్




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఆర్థిక భారంతో విద్యార్థులకు విద్యను అందించలేక పోతున్నామని ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యం ఆవేదన వ్యక్తం చేస్తూ తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లంకి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నల్ల బ్యాడ్జీలతో పెద్దపల్లి పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి తమ నిరసనను వ్యక్తం చేశారు.ప్రైవేట్ కళాశాలల బకాయిలు ప్రభుత్వం చెల్లించక పోవడంతో విధి లేని పరిస్థితుల్లో విద్యాసంస్థలను నిరవధిక బంద్ పాటిస్తున్నట్లు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ మేనేజ్మెంట్ అసోసియేషన్ పక్షాన పేర్కొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించడం లేదని దీంతో విద్యాసంస్థలను నడపడం భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దసరా పడగకు ముందు విడతల వారీగానైన నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి విన్నవించుకున్నా ఇప్పటి వరకు స్పందించలేదు, గత మూడు సంవత్సరాలుగా ఫీజు రియంబర్స్మెంట్ తో పాటు విద్యార్థులకు రావాల్సిన స్కాలర్షిప్ రావడం లేదన్నారు. నిరుద్యోగులు ఉపాధి కోసం విద్యాసంస్థలను స్థాపిస్తే ప్రభుత్వాలు బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నయని వారు ఆరోపించారు. ఆర్థికంగా ఇబ్బందులతో కుటుంబాలను పోషించుకోలేని స్థితిలో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఉన్నాయని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రైవేట్ డిగ్రీ పీజీ కళాశాలల ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే చెల్లించాలని లేని పక్షంలో రాష్ట్ర స్థాయిలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# సర్టిఫికెట్స్ అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపిన ఎండి రహీముద్దీన్



**రామగిరి, (ది క్రైమ్ న్యూస్):** రామగుండం డివిజన్ ఓసీపీ-టులో ఫోర్ మెన్ ఇన్చార్జిగా విధులు నిర్వహిస్తున్న ఎండి రహీముద్దీన్ తన యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్ ను హెచ్ ఆర్ డి లో జాయిన్ అయినప్పుడు సబ్మిట్ చేసి తిరిగి తీసుకోవడానికి ఏప్రిల్ నెల 2024లో హెచ్ఆర్డీకి అప్లికేషన్ పెట్టుకున్న నాలుగు నెలలు గడిచిన ఎలాంటి సమాధానం తెలుపకపోవడంతో ఆగస్టు నెలలో గ్రీవెన్స్ ఆర్జీ-త్రీ రీజన్లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ లో నా యొక్క అభ్యర్థనను పొందుపరిచాను వెంటనే డైరెక్టర్ న ఎం వి కె శ్రీనివాస్ స్పందించి హెచ్ఆర్టి డిపార్ట్మెంట్ కు ఫోన్ చేసి నా యొక్క సర్టిఫికెట్లను వెంటనే వెతికి అప్పగించాలని తెలుపగా విచ్ ఆర్ డి ఇంచార్జ్ ఫోన్ చేసి నా సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది.నా సర్టిఫికెట్లు నాకు ఇప్పించడానికి కృషి చేసిన గ్రీవెన్స్ చైర్మన్, సభ్యులకు అలాగనే హెచ్ఆర్డి హెడ్ కి ఎండి రహీముద్దీన్ గురువారం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పెండింగ్ భూ సేకరణ వేగవంతం చేసేందుకు చర్యలు

## - పెండింగ్ భూసేకరణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల నిర్మాణానికి పెండింగ్ భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా పరిష్కారమయ్యేలా చూడాలని అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు.గురువారం అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో పెండింగ్ భూసేకరణ అంశం పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, కునారం రైల్వే ఓవర్ బ్రిడ్జి భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఎన్టిపిసి సంస్థ అంతర్గాం మండలం మొగల్ పహాడ్ గ్రామంలో యాష్ పౌండ్ నిర్మాణానికి అవసరమైన 606 ఎకరాల సర్వేలో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి అయ్యేలా చూడాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ధర్మారం మండలంలో నీటిపారుదల శాఖకు సంబంధించి చేపట్టాల్సిన పనుల కోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసేందుకు నిధులు త్వరగా వచ్చేలా ఫాలో అప్ చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పుస్తెలతాడు చోరీ కేసులో నలుగురు వ్యక్తుల అరెస్టు



**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో జూలై 23వ తారీఖున జరిగిన పుస్తెల తాడు చోరీ కేసును కమలాపూర్ పోలీసులు ఛేదించారు. గురువారం చోరీకి సంబంధించిన వివరాలను పోలీసు ఇన్స్పెక్టర్ హరికృష్ణ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ సంవత్సరం జూలై 23న కమలాపూర్ కొత్త బస్టాండ్ సమీపంలోని ఇంట్లో రాత్రి సమయంలో ఒక వృద్దురాలు ఇంటి నుంచి బయటికి రాగా వృద్ధురాలు ఇంటి పక్కన గల కంగన్ హాల్ గద్దె పైనుండి లోపలికి దూకి వృద్ధ మహిళ మెడలో నుండి సుమారు 3 తులాల బంగారు పుస్తెలతాడును మాటేటి రమేష్ దొంగిలిస్తుండగా దానికి మొగిలిచర్ల ప్రశాంత్ సహకరించాడని సిఐ హరికృష్ణ తెలిపారు. దొంగిలించిన బంగారం ను అమ్ముకునే విషయంలో సహకరించిన వెనిశెట్టి పున్నం చందర్, పల్లెపు లక్ష్మీనారాయణ లను గురువారం ఉదయం గూడూర్ ఎక్స్ రోడ్డు వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పట్టుకొని విచారించగా వారి వద్ద నుండి 29 గ్రాముల కరిగించిన బంగారపు ముద్ద మరియు 20వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకొని, నలుగురిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపించినట్లు సిఐ హరికృష్ణ తెలిపారు.ం

# విద్యుత్ సమస్యలు దృష్టికి వస్తే తక్షణమే పరిష్కారం

## - ఎన్ పి డి సి ఎల్ పెద్దపల్లి జిల్లా ఎస్ ఇ బొంకూరి సుదర్శన్



**రామగిరి(ది క్రైమ్ న్యూస్):** విద్యుత్ సమస్యలు తమ దృష్టికి వస్తే తక్షణమే పరిష్కారం చేయడం జరుగుతుందని ఎన్ పి డి సి ఎల్ పెద్దపల్లి జిల్లా సూపరింటెంట్ ఆఫ్ ఇంజనీర్ బొంకూరి సుదర్శన్ అన్నారు. గురువారం రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామంలో విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి రాగా తెలుసుకున్నారు. అలాగే పాత ఎల్టి లైన్ తరచుగా తెగిపోనుందని పలువురు ఎస్ ఈ దృష్టికి తీసుకువచ్చారు. దాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడ ఉన్న పాత ఎల్ టి లైన్ స్థానంలో కొత్త వైర్ వేయడం జరుగుతుందని సుదర్శన్ తెలియజేశారు. ప్రజలు ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని అటువంటి సమస్యలను తమ సిబ్బందిచే వెంట వెంటనే పరిష్కారం చేయడం జరుగుతుందని అన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడానికి పొలం బాట కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని స్పష్టం చేశారు. గ్రామాల్లో పోలపై వైర్లు లూప్ ఉన్నచో తమ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే తమ ధ్యేయమని ఎస్ ఈ అన్నారు. లో వోల్టేజ్ సమస్య తీర్చడానికి మరికొన్ని సబ్ స్టేషన్లు వేయడం జరుగుతుందని అలాగే ట్రాన్స్ఫార్మర్ల కెపాసిటీ పెంచడం జరుగుతుందని అన్నారు. గృహలక్ష్మి అర్హులైన వారందరికీ ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఆయన వెంట టెక్నికల్ డిఈ బి. రవి, సబ్ ఇంజనీర్ సతీష్, లైన్ మెన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం-త్రీ ఏరియాలో వాల్మీకి జయంతి వేడుకలు




**రామగిరి, (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి రామగుండం-త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారంనాడు జి.యం. కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ముందుగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నమస్కరించారు. అనంతరం మాట్లాడుతూ కృషి ఉంటే బందిపోటు దొంగ కూడ సంస్కరించబడి మహర్షిగా మారుతారని, అందుకు మహర్షి వాల్మీకి జీవితమే ఉదాహరణ అన్నారు. ప్రతి సంవత్సరం ఆశ్వయుజ శుక్ల పౌర్ణమి నాడు మహర్షి వాల్మీకి జయంతి జరుపుకుంటామన్నారు. మహర్షి వాల్మీకి మొదట్లో ఒక బందిపోటు దొంగ అని. తదుపరి నారద మహర్షి ద్వారా రామమంత్రాన్ని ఉపదేశంగా పొంది మహర్షిగా మారాడని అన్నారు. సంస్కృతం భాషలో మూల రామాయణాన్ని 24000 శ్లోకాలు, ఏడు ఖండాలుగా రచించారన్నారు. వారి జీవితం నుండి మనిషి ఎలా పరివర్తన చెందాలో నేర్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు సంతోష్, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి గ్రంధి శ్రీనివాసరావు, ఎస్వోటుజిఎం జి.రఘుపతి, ఇతర విభాగాధిపతులు పి.శ్రీనివాసులు, బి.రాజేంద్రకుమార్, కె.చంద్రశేఖర్, బి.సుదర్శనం, పి.రాజారెడ్డి, కె.ఐలయ్య, గుర్రం శ్రీహరి, ఇతర అధికారులు, జి.యం. కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** స్థానిక తొర్రూర్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్లో 2009-10 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో మొదటగా పూర్వ విద్యార్థులు తమ యొక్క గురువులను శాలువాలతో సత్కరించి వారి పాదాలకు నమస్కరించారు అనంతరం జరిగిన ఈ యొక్క కార్యక్రమంలో వారి వారి తీపి గుర్తులు గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు పలకరించుకున్నరు అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసి తమ బ్యాచ్ లో ఉద్యోగం సాధించిన డాకూరి రాజు నీ సన్మానించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో ఉపాధ్యాయులు కమలాకర్ సార్ లక్ష్మీనారాయణ, ఆలీ మరియు విద్యార్థులు గార అనిల్, డాకూరి రాజు, సందీప్, అప్రోజు, పాషా, రాజు, వినయ్, స్వరూప, వనజ, సరిత, కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వహణలో మార్పులు

## ప్రజలు గుర్తించేలా చూడాల్సిన బాధ్యత

## అధికారులతో సమీక్షలో మంత్రి సత్యకుమార్

**అమరావతి,అక్టోబర్17(ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వాస్పపత్రుల నిర్వహణ, సేవల నాణ్యతలో వచ్చిన మార్పుల్ని ప్రజలు గమనించినప్పుడే సార్థకత ఉంటుందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో తీసుకొచ్చిన మార్పులను అధికారులు తమ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలపాలని సూచించారు. రెండు నెలల క్రితం 30 అంశాలతో రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అమలుపై వైద్యాధికారులు, సూపరింటెండెంట్లతో సచివాలయంలో మంత్రి గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు సేవలందిం చేందుకు 725 మంది సహాయకులు, రూ.240 కోట్ల మేరకు పరికరాల అవసరాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. శుభ్రత, సైన్ బోర్డులు, ఒపి రిజిస్ట్రేషన్, రిసెప్షెన్, ఫీడ్ బ్యాక్, హాజరు నియంత్రణ, కేంద్రీకృత నమూనాల సేకరణ వంటి అంశాల్లో మార్పులు తెచ్చామని జిజిహెచ్ల సూపరింటెండెంట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన సేవల్ని ఆశించే హక్కు ప్రజలకు ఉందని, వారి అంచనాల మేరకు పనిచేయడం, ప్రభుత్వ వైద్యసిబ్బంది బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్టి కృష్ణబాబు, డిఎంఇ నరసింహం, 16 ప్రభుత్వాస్పత్రులు, విశాఖపట్నంలోని చెస్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ అధికారులు పాల్గన్నారు.

# అసోంలో పట్టాలు తప్పిన లోకమాన్య తిలక్ ఎక్స్ప్రెస్

## ప్రాణాపాయం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు

**గౌహతి,అక్టోబర్17(ది క్రైమ్ న్యూస్):** వరుస రైలు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అస్సాంలోని దిమా హసావో జిల్లాలో రైలు ప్రమాదం చోటుచేసుకుంది. లోకమాన్య తిలక్ ఎక్స్ప్రెస్ పట్టాలు తప్పింది. అగర్తలా నుంచి ముంబయికి బయల్దేరిన ఈ రైలు ఇంజిన్తో పాటు ఎనిమిది బోగీలు పట్టాలు తప్పాయి. అస్సాంలోని దిబలోంగ్ స్టేషన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాలేదని రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ మధ్యాహ్నం 3.55 గంటలకు జరిగిన ఈ రైలు ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదని చెప్పారు. పవర్ కార్, ఇంజిన్తో పాటు ఎనిమిది కోచ్లు పట్టాలు తప్పాయన్నారు. ఈ ఘటన గురించి సమాచారం అందగానే.. సహాయక బృందాలు చేరుకున్నాయని తెలిపారు. ఈ ఘటనతో లుమ్డింగ్-బాదర్పూర్ సింగిల్-లైన్ హిల్ సెక్షన్లో రైళ్ల రాకపోకలు నిలిపివేసినట్లు వెల్లడించారు. ఈ ప్రమాదం గురువారం మధ్యాహ్నం 3.55 గంటలకు జరిగింది. అగర్తల, ముంబైలోని లోకమాన్య తిలక్ టెర్మినస్ మధ్య నడుస్తున్న రైలు డిబాలాంగ్ స్టేషన్ గుండా వెళుతుండగా పట్టాలు తప్పింది. అయితే పట్టాలు తప్పిన నేపథ్యంలో అధికారులు రంగంలోకి దిగి విచారణ చేస్తున్నారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న తరువాత అసోం సీఎం హిమంత విశ్వ శర్మ కూడా సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రయాణికులకు పెద్దగా నష్టం జరగలేదని, ప్రయాణికులంతా క్షేమంగా ఉన్నారని అన్నారు. ఈ క్రమంలో తాను రైల్వే అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదానికి ముందు అగర్తల-లోకమాన్య తిలక్ ఎక్స్ప్రెస్ గురువారం ఉదయం బయలుదేరింది. ఈ ఘటన నేపథ్యంలో రైల్వే అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపడుతున్నారు. దీంతో లుమ్డింగ్ బదర్పూర్ సింగిల్ లైన్ సెక్షన్లో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. ఈ క్రమంలో ప్రజలు సహాయం, అదనపు సమాచారం కోసం హెల్ప్లైన్ నంబర్లు 03674 263120, 03674 263126లకు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు. అయితే అసలు రైలు పట్టాలు తప్పడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

# గనిలో ఫ్రంట్ లైన్ సూపర్ వైజర్ల పాత్ర కీలకం

## అడ్రియాల జి.ఎం.కొప్పుల వెంకటేశ్వర్లు



**రామగిరి, (ది క్రైమ్ న్యూస్):** అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ లో విధులు నిర్వహిస్తున్న ఫ్రంట్ లైన్ సూపర్ వైజర్లకు పన్నెండు రోజులపాటు 15 మందికి స్థానిక ఎం.వి.టి.సి. నందు నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గనిలో ఫ్రంట్ లైన్ సూపర్ వైజర్ల పాత్ర కీలకమని, కావున వారి బాధ్యతలను తెలుసుకొని విధులు నిర్వహించాలన్నారు. గనిలో వివిధ పని ప్రదేశాలను నిర్ణీత సమయాలలో తనిఖీ చేసి ప్రమాద అవకాశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అంతేకాకుండా సహచర ఉద్యోగులకు భద్రత పట్ల సరైన అవగాహన కల్పిస్తూ, భద్రతతో కూడిన విధులు నిర్వహించేలా వారిని ప్రోత్సహించాలన్నారు. సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తూ, ఉత్పత్తి వ్యయం తగ్గించడానికి సూపర్ వైజర్లు కృషి చేయాలని కోరారు. ఈ శిక్షణా తరగతులలో భాగంగా మైన్స్ చట్టాలను అనుసరించి తీసుకోవాల్సిన చర్యలు, గనులలో భద్రతా పరికరాల వినియోగం, భద్రతపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ మల్లన్న, ఎస్.ఇ. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు కళల పై ఆసక్తి పెంచుకోవాలి

## - కళా ఉత్సవ జిల్లా స్థాయి పోటీలను ప్రారంభించిన అదనపు కలెక్టర్ జి వి.శ్యామ్ ప్రసాద్ లాల్







**పెద్దపల్లి, అక్టోబర్-17: ( ది క్రైమ్ న్యూస్ ):** విద్యార్థులు చదువుతోపాటు వివిధ సాహిత్య కళలపై ఆసక్తి పెంచుకోవాలని అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు.గురువారం అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో , ఎంఆర్సి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కళా ఉత్సవ జిల్లా స్థాయి పోటీలను ప్రారంభించారు. కళా ఉత్సవ జిల్లా స్థాయి పోటీలో భాగంగా విద్యార్థులకు సాంప్రదాయ నృత్యం, జానపద నృత్యం ,చిత్రలేఖనం, వాయిద్య పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, కళలు సృజనాత్మకతను పెంచుతాయని మనలో దాగి ఉన్న కళలను బహిర్గతం చేయడానికి ఇలాంటి వేదికలు ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు కళల పై కూడా ఆసక్తి పెంచుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మాధవీమాట్లాడుతూ కళా ఉత్సవ పేరిట సమగ్ర శిక్ష తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ఎంపిక కాబడి ఢిల్లీలో జాతీయ స్థాయిలో పాల్గొనాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏఎంఓ డాక్టర్ పీఎం షేక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో మరణించిన ఉద్యోగి కుటుంబానికి కోటి రూపాయల ప్రమాద భీమా చెక్కు అందజేత

## - ఎస్.బి.ఐ. రీజినల్ మేనేజర్ రవీంద్ర కుమార్ సింగ్
## - రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు




**రామగిరి(ది క్రైమ్ న్యూస్):** సింగరేణి ఉద్యోగులు తమ ఎస్.బి.ఐ. బ్యాంకు అకౌంట్ ను 'కార్పోరేట్ శాలరీ అకౌంట్' గా మార్చుకొవడం ద్వారా కోటి రూపాయల ఉచిత ప్రమాద భీమా పొందవచ్చునని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గోదావరిఖని రీజనల్ మేనేజర్ రవీంద్ర కుమార్ సింగ్ అన్నారు.కొద్ది రోజుల క్రితం ఓ.సి.-టు ఉపరితల గనిలో జరిగిన ప్రమాదంలో మరణించిన ఉప్పుల వెంకటేశ్వర్లు సతీమణి ఉప్పుల సరోజనకు కోటి రూపాయల ఉచిత ప్రమాద భీమా చెక్కును అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్, ఐఆర్ఎస్ ప్రత్యేక చొరవతో సింగరేణి సంస్థ యాజమాన్యం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా సింగరేణి ఉద్యోగులు తమ అకౌంట్ ను 'కార్పోరేట్ శాలరీ అకౌంట్' గా మార్చుకోవడం ద్వారా కోటి రూపాయల ఉచిత ప్రమాద బీమా పొందవచ్చునని అన్నారు. దురదృష్టావశాత్తు ఉద్యోగులు ప్రమాదంలో మరణిస్తే వారి కుటుంబానికి ఆర్థిక చేయూతనివ్వడం కోసం ఉద్యోగుల, వారి కుటుంబ సంక్షేమంలో భాగంగా ఈ ఒప్పందం చేసుకోవడం జరిగిందని అన్నారు. తద్వారా వారి కుటుంబ సభ్యులకు ఆర్థికంగా సహాయపడవచ్చునని అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-గోదావరిఖని రీజనల్ మేనేజర్ రవీంద్ర కుమార్ సింగ్ మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సింగరేణి సంస్థ యాజమాన్యంతో చేసుకున్న ఒప్పందం మేరకు సులభ పద్ధతిలో, 38 రోజుల వ్యవధిలోనే ఈ ప్రమాద భీమాను చెల్లించడం జరిగిందని తెలిపారు. గతంలో ఉన్న 40 లక్షల రూపాయల ప్రమాద భీమా, జూన్ నెలలో కోటి రూపాయలకు పెంచడం జరిగిందని అన్నారు. ఈ డబ్బును దుర్వినియోగం చేయకుండా కుటుంబ సభ్యుల అవసరం నిమిత్తం ఖర్చు చేయాలని కోరారు. కుటుంబ యజమానిగా మరణించిన ఉద్యోగి ఆశయాల మేరకు ఈ డబ్బును ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి.ఐ. బ్రాంచ్ మేనేజర్ కె.రవీంద్ర, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం కార్యదర్శి గ్రంధి శ్రీనివాసరావు, ఇంచార్జ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జే.రాజశేఖర్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డి.పి.ఎం.గుర్రం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ తనిఖీ



**యైటింక్లయిన్ కాలనీ. (క్రైమ్ న్యూస్):** గోదావరిఖని ఏసిపి మడత రమేష్ గురువారం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఏసీపీ ని పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్. ప్రసాద్ రావు పూల మొక్కను అందజేసి ఆహ్వానించారు. ఇక ఆయన పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్టేషన్ ను తనిఖీ చేసి పోలీస్ సిబ్బంది పని తీరును, ప్రజలకు అందిస్తున్న సేవలను, నేరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తధానంతరం ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ గురించి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, పోలీస్ స్టేషన్లో 5ఎస్ ఇంప్లిమెంటేషన్, వర్టికల్స్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఇక బ్లూ కోట్ విధులు, పెట్రో కార్ విధులు, పిటిషన్ మేనేజ్-మెంట్ మరియు పోలీస్ స్టేషన్ యొక్క పనితీరును రిసెప్షన్ సిబ్బందిని ఆయన అడిగి తెలుసుకున్నారు. అలాగే క్రైమ్ వెహికల్స్, అబండెడ్ వెహికల్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులు విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలనీ, పోలీస్ స్టేషన్ కి వచ్చే వారితో మర్యాదగా మెలాగలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గ్రామాల్లో గస్తీ పెంచాలనీ సూచించారు. అదేవిధంగా పాత నెరగాళ్లపై నిఘా ఉంచాలని, 100 డయల్ ఫిర్యాదుల పట్ల వేగవంతమైన స్పందన ఇస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో బిట్లు, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ నేరాలను నియంత్రణ చెయ్యాలని అన్నారు. సైబర్ నేరాలపై రోడ్డు భద్రత నియమలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ తమ తమ విధులు క్రమశిక్షణతో నిర్వహించాలని ఆయన హితువు పలికారు. ఇది ఇలా ఉండగా ఏసీపీ నీ ఆహ్వానించిన వారిలో సీఐ తో పాటు, రెండవ సీఐ లింగమూర్తి ఎస్.ఐ లు వెంకటకృష్ణ, ఫరీద్, సోనియా ఉన్నారు.

# చింత చెట్టుకు పారుతున్న కల్లు

## జగిత్యాల జిల్లాలో వింత... వింతగా చూస్తున్న జనం...





**ఎండపల్లి, అక్టోబర్17(ది క్రైమ్ న్యూస్ ):** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో చింత చెట్టుకు కల్లు వస్తున్నా ఓ వింత సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే రాజారాంపల్లి గ్రామంలో కొన్ని సంవత్సరాల చరిత్ర కలిగినా చింత చెట్టును గత వినాయక చవితి సమయంలో చెట్టు కొమ్మలు కరెంటు తీగలకు తగులుతుందన్న ఉద్దేశంతో 2 కొమ్మలను కత్తిరించారు. కట్ చేసిన కొమ్మ భాగం నుండి గత 5రోజులుగా కల్లులాంటి ద్రవం చెట్టు పైనుండి మొదలు కిందికి రావడాన్ని ప్రజలు గమనించారు. కానీ దానిని పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. ఈరోజు ఉదయం కల్లుగీతా కార్మికులు దానిని తెలుసుకొని చింతచెట్టుకు బాటిల్ ను అమర్చారు.ఈ విషయం ఆనోటా ఈనోటా ఊరంతా వ్యాపించడంతో గ్రామ ప్రజలు చింతచెట్టు దగ్గరకు చేరుకుని వింతగా చూస్తూ పోతులూరి వీరబ్రహ్మం చెప్పినా 'కలియుగంలో చింతచెట్టుకు తాటి కల్లు పారేనయా'అనే మాట నిజం అవుతుంద అంటూ మాట్లాడు కోవడం కోసమేరుపు.

## కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే..



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 17 (ది క్రైమ్ న్యూస్):** కుత్బుల్లాపూర్ జంట సర్కిల్‌ల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీ గురువారం ఎమ్మెల్యే వివేకానంద ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిల్ లో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రేపన్ గిరిబాబు, కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం కేపీ వివేకానంద మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎల్లవేళలా ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు చైర్మన్ ముత్యాలు, సలహాదారులు గణేష్, వేముల నరేష్, విజయసాగర్ రెడ్డి, అధ్యక్షులు రేపల్లె గిరిబాబు, కార్యనిర్వాహక అధ్యక్షులు సాయి బాబా, ఉపాధ్యక్షులు నరేష్ కుమార్, నరసింహ, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ నాయక్, జాయింట్ సెక్రటరీ మల్లేష్, కోశాధికారి వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# షేక్ హసీనాపై అరెస్ట్ వారెంట్

## నవంబర్ 18లోగా హాజరు పర్చాలని కోర్టు ఆదేశం

**ఢాకా,అక్టోబర్17(ది క్రైమ్ న్యూస్):** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పై అరెస్టు వారెంట్ జారీ అయింది. ఆ దేశానికి చెందిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఈ వారెంట్ ఇచ్చింది. నవంబరు 18లోగా ఆమెను అరెస్టు చేసి తమ ఎదుట హాజరు పరచాలని ఐసీటీ చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తజుల్ ఇస్లాం తన ఆదేశాల్లో పేర్కొన్నారు. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో.. ప్రధానిగా ఉన్న షేక్‌హసీనా పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. తర్వాత నుంచి ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. జులై 15 నుంచి ఆగస్టు 5 వరకు జరిగిన మారణహోమం, ఇతర నేరాల ఆరోపణలపై హసీనాకు వ్యతిరేకంగా ఐసీటీకి 60 ఫిర్యాదులు అందాయి. వాటిపై ట్రైబ్యునల్ ఇటీవల దర్యాప్తు ప్రారంభించింది. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆమెను బంగ్లాదేశ్‌కు రప్పిస్తామని, ఆమెపై అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని ఐసీటీ నూతన ప్రాసిక్యూటర్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఆమెను స్వదేశానికి రప్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. హసీనా పాలనపై తీవ్ర నిరసన వ్యక్తంచేసిన విద్యార్థి సంఘాలు ఆమె భారత్‌లో ఉండటాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇదిలాఉంటే.. హసీనాను చట్టబద్ధంగా తమ దేశానికి అప్పగించాలంటూ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) భారత ప్రభుత్వాన్ని డిమాండు చేసిన సంగతి తెలిసిందే. మరోపక్క ఆమె దౌత్య పాస్‌పోర్టు రద్దయిన సంగతి తెలిసిందే. హసీనా హయాంలో ఎంపీలకు జారీ చేసిన దౌత్య పాస్‌పోర్టులను రద్దు చేసినట్లు బంగ్లా హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ పాస్‌పోర్టు ఉన్నవారు కొన్ని నిర్దిష్ట దేశాలు వీసా లేకుండా ప్రయాణించే వీలు ఉంటుంది. ఆగస్టు 5న పదవి నుంచి దిగిపోయి భారత్‌కు చేరుకున్న తర్వాత బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. ఇదిలా ఉంటే.. హసీనాను బంగ్లాకు రప్పించడానికి యూనస్ ప్రభుత్వం అన్ని యత్నాలు చేస్తుందని ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ గతంలో పేర్కొంది. హసీనాను అప్పగించాలా, వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత భారత్‌పైనే ఉందని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాతో పాటు 45 మందిపై బంగ్లాదేశ్ ఇంటర్నేషన్ క్రైమ్ ట్రైబ్యునల్ గురువారం అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. అరెస్టు వారెంట్లు జారీ అయిన వారిలో అవామీ లీగ్‌కు చెందిన పలువురు నాయకులు సైతం ఉన్నారు. విద్యార్థుల ఉద్యమం నేపథ్యంలో జరిగిన మారణహోమం, ఇతర నేరారోపణలపై క్రైమ్ ట్రైబ్యునల్‌లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేయాలని కోరుతూ ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన రెండు పిటిషన్లపై జస్టిస్ మహ్మద్ గోలం ముర్తాజా మజుందార్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని చీఫ్ ప్రాసిక్యూటర్ మహ్మద్ తాజుల్ ఇస్లాం వెల్లడించారు. నవంబర్ 18లోగా షేక్ హసీనా సహా మొత్తం 46 మందిని అరెస్ట్ చేసి హాజరుపరచాలని ధర్మాసనం అధికారులను ఆదేశించింది. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమం హింసాత్మకంగా సాగిన విషయం తెలిసిందే. ఉద్యమాన్ని అణిచివేసేందుకు షేక్ హసీనా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విద్యార్థి నేతలు ఆరోపించారు. హింసాత్మక ఘటనలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. నిరసనలు మరింత ఉధృతం కావడంతో షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్‌కు వచ్చారు. ఆమె ప్రస్తుతం భారత్‌లోనే ఆశ్రయం పొందుతున్నారు. హసీనా రాజీనామా తర్వాత నోబెల్ గ్రహీత, ఆర్థిక వేత్త మొహమ్మద్ యూనస్ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వం విద్యార్థి ఉద్యమంలో హింసకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నది.

# ఎపి సిఎస్‌కు నలుగురు ఐఎఎస్‌ల రిపోర్ట్

## డీవోపీటీ ఆదేశాల మేరకు నిర్ణయం

**అమరావతి,అక్టోబర్17(ది క్రైమ్ న్యూస్):** డీవోపీటీ ఆదేశాల మేరకు నలుగురు ఐఏఎస్ అధికారులు గురువారం ఏపీలో రిపోర్టు చేశారు. తెలంగాణ హైకోర్టు డీవోపీటీ ఆదేశాలపై జోక్యం చేసుకునేందుకు నిరాకరించడంతో తెలంగాణ నుంచి రిలీవ్ అయిన ఆమ్రపాలి కాట, రోనాల్డ్ రోస్, వాణీ ప్రసాద్ , వాకాటి కరుణ ఏపీ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్‌ను కలిసి రిపోర్టు చేశారు. మరోవైపు ఏపీ నుంచి రిలీవ్ అయిన ఐఏఎస్ అధికారులు సృజన, హరికిరణ్, శివశంకర్‌లు బుధవారమే హదరాబాద్‌కు వచ్చి సీఎస్ శాంతికుమారికి రిపోర్టు చేశారు. కేంద్రం ఈనెల 9న ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఆలిండియా సర్వీసు అధికారులు తమకు కేటాయించిన రాష్ట్రాల్లో చేరాల్సిందేనంటూ కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఈ ఉత్తర్వులు ఆపాలని కోరుతూ తెలంగాణలో పనిచేస్తున్న ఐఏఎస్‌లు హైకోర్టుకు వెళ్లారు. క్యాట్ ఇచ్చిన ఉత్వర్వుల్లో జోక్యం చేసుకోబోమని హైకోర్టు తేల్చిచెప్పడంతో ఆమ్రపాలి కాట, రోనాల్డ్ రోస్, వాణీ ప్రసాద్, వాకాటి కరుణ ఏపీకి వెళ్లి సీఎస్‌కు రిపోర్టు చేశారు.

# విమానాలకు వరుస బాంబు బెదిరింపులు

## ఎయిరిండియా విమానానికి మళ్లీ బెదిరింపు


## పరిస్థితిని సమిక్షించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**ముంబై,అక్టోబర్17(ది క్రైమ్ న్యూస్):** వరస బాంబు బెదిరింపుల ఘటనలు భారత విమానయాన రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. వరసగా నాలుగో రోజు కూడా బాంబు బెదిరింపు వచ్చాయి. ముంబై నుంచి లండన్ వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం ల్యాండింగ్‌కి కొన్ని గంటల ముందు ఎమర్జెన్సీ సిగ్నల్స్‌ని పంపించినట్లు ఫ్లైట్ ట్రాకర్ ఫ్లైట్ రాడార్ 24 గురువారం తెలిపింది. విమానం 'స్క్వాకింగ్ 7700' కోడ్‌ని పంపించింది. ఇది సాధారణ అత్యవసర పరిస్థితిని తెలియజేస్తుంది. ముంబై నుంచి ఎయిర్ ఇండియా విబమానం గురువారం ఉదయం 7.05 గంటలకు టేకాఫ్ అయింది. తూర్పు ఇంగ్లండ్ మీద ప్రయాణించే సమయంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. విమానం షెడ్యూల్ ప్రకారం లండన్ హీత్రూ విమానాశ్రయంలో మధ్యాహ్నం 12.05 గంటలకు దిగాల్సి ఉంది. 'స్క్వాకింగ్ 7700' విమాన పరిస్థితిని సమీపంలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌కి తెలియజేస్తుంది. నాలుగు రోజుల్లో కనీసం 20 విమానాలకు నకిలీ బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ రోజు 5 ఎయిర్ ఇండియా, రెండు విస్తారా, రెండు ఇండిగో విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ బాంబు బెదిరింపుల అంశంపై నిన్న పార్లమెంటరరీ స్టాండింగ్ కమిటీ సమావేశమైంది. దీనికి సివిల్ ఏవియేషన్ మినిస్ట్రీ, డీజీసీఏ అధికారులతో ఆ శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు సమావేశమయ్యారు. పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని, ప్రయాణీకులు భద్రతే తమ ప్రాధాన్యమని ఆయన అన్నారు. ఈ ఘటనలపై సమగ్ర నివేదిక పంపాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖను హోం మంత్రిత్వ శాఖ కోరింది.

# తక్కువ క్రెడిట్ స్కోర్‌తో బోలెడు సమస్యలు..

## ఈ టిప్స్ పాటిస్తే సమస్యలు ఫసక్..!

భారతదేశంలో ఇటీవల కాలంలో పెరిగిన టెక్నాలజీ కారణంగా బ్యాంకింగ్ రంగంలో కీలక మార్పులు వచ్చాయి. ముఖ్యంగా లోన్ ఇవ్వడానికి బ్యాంకులు కస్టమర్ చెల్లింపు పరిస్థితిని తెలుసుకోవడానికి వివిధ మార్గాలను ఎంచుకుంటున్నాయి. పెరిగిన ఖర్చులు, అవసరాల నేపథ్యంలో లోన్ తీసుకోవడం అనేది ప్రస్తుత రోజుల్లో సర్వసాధారణమైంది. అయితే లోన్ తీసుకోవడానికి బ్యాంకుకు వెళ్లినప్పుడు లోన్ ఇవ్వడానికి బ్యాంకులు నిరాకరిస్తూ ఉంటాయి. ముఖ్యంగా బ్యాంకులు లోన్ ఇవ్వడానికి కస్టమర్ క్రెడిట్ స్కోర్‌ను పరిగణలోకి తీసుకుంటున్నాయి. అయితే క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉంటే చాలా సింపుల్‌గా రుణాన్ని రిజెక్ట్ చేస్తూ ఉంటాయి. కస్టమర్లు చేసే కొన్ని తప్పల కారణంగా తక్కువ సిబిల్ స్కోర్ ఉంటుందని చాలా మందికి తెలియదు. ఈ నేపథ్యంలో లోన్ రిజెక్ట్ కాకుండా ఉండడానికి మెరుగైన క్రెడిట్ స్కోర్ ఎలా మెయింటెన్ చేయాలో? ఓసారి తెలుసుకుందాం. బిల్లుల చెల్లింపు మంచి క్రెడిట్ స్కోర్ మెయింటేన్ చేయాలంటే మీ




క్రెడిట్ కార్డ్ బిల్లులు, లోన్ ఈఎంఐలు, ఇతర బకాయిలను సకాలంలో చెల్లించాలని నిపుణులు చెబుతున్నారు. చెల్లింపులు ఆలస్యంగా చేయడం వల్ల క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని వివరిస్తున్నారు. క్రెడిట్ కార్డుల వినియోగం కస్టమర్లు వారి వద్ద ఉన్న క్రెడిట్ కార్డుల్లో వినియోగ పరిమితిని 30 శాతం కంటే తక్కువ ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. అధిక క్రెడిట్ వినియోగం ఆర్థిక ఇబ్బందులను సూచిస్తుందని తద్వారా క్రెడిట్ స్కోర్‌ను తగ్గిస్తుందని పేర్కొంటున్నారు. రుణాల మిశ్రమం సాధారణంగా మన అవసరానికి సంబంధించి తీసుకున్న రుణాలు మన క్రెడిట్ స్కోర్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. సెక్యూర్డ్ రుణాలు అంటే గృహ రుణాలు వంటివి, అలాగే అసురక్షిత క్రెడిట్ అంటే క్రెడిట్ కార్డ్‌ల వంటివి ఉపయోగించే సమయంలో జాగ్రత్త వహించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా క్రెడిట్ కార్డుల తీసుకునే సమయంలో మనకు అవసరమైన క్రెడిట్‌ను మాత్రమే తీసుకోవాలని పేర్కొంటున్నారు. లోన్ అప్లికేషన్ల వినియోగం మీరు లోన్ లేదా క్రెడిట్ కార్డ్ కోసం దరఖాస్తు చేసిన ప్రతిసారీ రుణదాత మీ క్రెడిట్ స్కోర్‌ను తనిఖీ చేస్తాడు. ఫలితంగా మీ రుణ అవసరాన్ని బేరీజు వేసుకుని మీ క్రెడిట్ స్కోర్ తగ్గే ప్రమాదం ఉంది. అందువల్ల లోన్ తీసుకోవాలని అనుకున్నప్పుడు 15 రోజుల వ్యవధిలోనే మీకు అవసరమైన బ్యాంకులకు వెళ్లి రుణ వడ్డీ రేట్లను కనుగొనడం ఉత్తమం. ఇలా చేయడం ద్వారా క్రెడిట్ స్కోర్ తగ్గదని నిపుణులు పేర్కొంటున్నారు. క్రెడిట్ నివేదిక లోపాలు లేదా అనధికారిక లావాదేవీలు లేవని నిర్ధారించుకోవడానికి మీ క్రెడిట్ నివేదికను కాలానుగుణంగా సమీక్షించడం ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మీరు ఏవైనా వ్యత్యాసాలను కనుగొంటే వాటిని సరిదిద్దడానికి వెంటనే సంబంధిత ఏజెన్సీకు నివేదించాలని సూచిస్తున్నారు.

# ప్రయాణికులకు శుభవార్త! ఈ అన్ని రైల్వే స్టేషన్లలో టికెట్ల కోసం డిజిటల్ చెల్లింపు సదుపాయం

రైల్వే ప్రయాణికులకు శుభవార్త. ఇప్పుడు రైల్వే స్టేషన్లలో రైలు టిక్కెట్లు కొనుగోలు చేసేటప్పుడు ప్రయాణీకులు కోడ్ ద్వారా డిజిటల్‌గా ఛార్జీలను చెల్లించవచ్చు. పశ్చిమ రైల్వేలు గుజరాత్‌లోని రాజ్‌కోట్, భావ్‌నగర్ డివిజన్‌లలోని అన్ని స్టేషన్లలో కోడ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇక త్వరలో అన్ని స్టేషన్‌లలో ఈ విధానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ కొత్త కార్యక్రమం కింద రాజ్‌కోట్ డివిజన్‌లోని రాజ్‌కోట్, జామ్‌నగర్, సురేంద్రనగర్, ద్వారక సహా అన్ని చిన్న, పెద్ద స్టేషన్‌లలోని అన్ని రిజర్వ్‌డ్, అన్‌రిజర్వ్‌డ్ టికెట్ కౌంటర్లలో క్యూఆర్ కోడ్ ద్వారా రైల్వే టిక్కెట్‌ల చెల్లింపును అంగీకరించే సౌకర్యం కల్పించామని డివిజనల్ రైల్వే ప్రతినిధి తెలిపారు. డివిజనల్ రైల్వే మేనేజర్ అశ్వనీ కుమార్, భావ్‌నగర్ డివిజనల్ రైల్వే మేనేజర్ రవీష్ కుమార్ లు క్యూఆర్ కోడ్‌ని ఉపయోగించి టికెట్ ఛార్జీలను డిజిటల్‌గా చెల్లించాలని ప్రయాణీకులను అభ్యర్థించారు. భావ్‌నగర్ డివిజన్‌లోని భావ్‌నగర్ టెర్మినస్, బోటాడ్, గాంధీగ్రామ్, జునాగఢ్, పోర్ బందర్, వెరావల్‌తో సహా అన్ని చిన్న, పెద్ద స్టేషన్‌లలోని అన్ని రిజర్వ్ చేయబడిన, రిజర్వ్ చేయని టికెట్ కౌంటర్లలో కోడ్ ద్వారా రైల్వే టిక్కెట్‌ల చెల్లింపును అంగీకరించే సౌకర్యం అందించారు. రాజ్‌కోట్, భావ్‌నగర్ డివిజన్




డిజిటల్ చెల్లింపు పద్ధతులను ఉపయోగించి నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడానికి, ప్రయాణీకులకు సాఫీగా, మరింత సమర్థవంతమైన సేవలను అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నాయి. డివిజన్‌లోని రిజర్వేషన్ కార్యాలయం, బుకింగ్ కార్యాలయం అన్ని కౌంటర్లలో కోడ్ పరికరాలు అమర్చారు. రైల్వే ప్రయాణికులు టిక్కెట్ ఛార్జీలు చెల్లించేందుకు క్యూఆర్ కోడ్ డిజిటల్ మాధ్యమం సౌకర్యం కల్పిస్తున్నారు. ౦ల్వే ప్రయాణికులు ఇప్పటికే యూటీఎస్ మొబైల్ యాప్, వంటి వివిధ డిజిటల్ చెల్లింపు ఎంపికలను టిక్కెట్ ఛార్జీని చెల్లించడానికి అందుబాటులో ఉన్నాయి. ఈ రకమైన డిజిటల్ చెల్లింపు వ్యవస్థను మరింత ఉపయోగకరంగా, సాఫీగా మార్చే లక్ష్యంతో, రాజ్‌కోట్ డివిజన్ దీనిని విస్తరించింది. ఈ కొత్త డిజిటల్ చెల్లింపు విధానం ఇప్పుడు క్యూఆర్ కోడ్ ద్వారా టిక్కెట్ ఛార్జీలు చెల్లించడానికి ప్రయాణీకులకు మరింత సౌలభ్యాన్ని అందిస్తుంది. దీని ద్వారా ఏ ప్రయాణీకుడైనా తన టికెట్ ఛార్జీలను సజావుగా, ఎలాంటి ఇబ్బంది లేకుండా చెల్లించవచ్చు.

# అద్దె ఒప్పందం 11 నెలలకే ఎందుకు చేసుకుంటారో తెలుసా.?




ఇంటి కోసం లేదా దుకాణం కోసం అద్దెకు తీసుకోవడం సర్వసాధారణమైన విషయం. దేశంలో చాలా సొంతింటిలో ఉంటున్న వారి కంటే, సొంత దుకాణాల్లో వ్యాపారాలు చేస్తున్న వారి కంటే అద్దె ఇంట్లో ఉంటున్న వారే ఎక్కువని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే అద్దెకు తీసుకునే సమయంలో రెంటల్ అగ్రిమెంట్ చేసుకుంటారని మనకు తెలిసిందే. అద్దెకు ఇచ్చే వారికి, అద్దె తీసుకునే వారి మధ్య ఈ ఒప్పందం జరుగుతుంటుంది. రెంటల్ అగ్రిమెంట్‌లో యజమాని పేరు, చిరునామా, అద్దె మొత్తం ఎంత.? ఎంత వ్యవధి కోసం అద్దె తీసుకుంటున్నారు, ఇంకా ఏమైనా ఇతర నిబంధనలు లేదా షరతులు ఉంటే వాటిని అందులో పేర్కొంటారు. అద్దె ఒప్పందం అనేది ఒక రకమై లీజు ఒప్పందం లాంటిది. వీటిని వైట్ పేపర్స్‌పై లేదా, బాండ్ పేపర్‌పై రాసి సాక్ష్యుల సమక్షంలో ఒప్పందాలు చేసుకుంటారు. అయితే చాలా వరకు రెంటల్ అగ్రిమెంట్స్ 11 నెలల వ్యవధికి మాత్రమే చేసుకుంటారు. అయితే 11 నెలలకే రెంటల్ అగ్రిమెంట్ ఎందుకు చేసుకుంటారన్న దానిపై ఎప్పుడైనా సందేహం వచ్చిందా.? దీని వెనకాల అసలు కారణం ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. 11 నెలలకు రెంటల్ అగ్రిమెంట్ చేసుకోవడానికి కారణాల్లో రిజిస్ట్రేషన్ చట్టం 108 ఒకటి. రిజిస్ట్రేషన్ చట్టం 1908లో సెక్షన్ 17 నిబంధనల ప్రకారం ఏడాది కంటే తక్కువ లీజు ఒప్పందం చేసుకోవడం కుదరదు. ఏడాదికి లీజు ఒప్పందం చేసుకుంటే రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. ఇదంతా కాస్త వ్యయప్రయాసలతో కూడుకున్న అంశం కావడంతో చాలా మంది కేవలం 11 నెలలకే రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. తిరిగి 11వ తనెల పూర్తి కాగానే మళ్లీ, మరో 11 నెలలకు రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. ఇదండీ 11 నెలల రెంటల్ అగ్రిమెంట్ వెనకాల ఉన్న అసలు ఉద్దేశం.

# 21 ఏళ్లలో రూ. 70 లక్షలు.. నెలకు ఎంత సేవ్ చేయాలంటే..



సంపాదించిన దాంట్లో ఎంతో కొంత సేవ్ చేసుకోవాలని ప్రతీ ఒక్కరూ కోరుకుంటారు. అయితే ఇది వారి వారి ఆదాయాలకు అనుగుణంగా మారుతుంటుంది. సంపాదించే ప్రతీ ఒక్కరూ సేవింగ్స్ చేయాలని ఆర్థిక నిపుణులు సైతం చెబుతుంటారు. ఒకప్పుడు కర్చు పెట్టిన తర్వాత మిగిలిన మొత్తాన్ని సేవ్ చేసే వారు. కానీ ప్రస్తుతం పొదుపు చేసిన తర్వాత మిగిలిన మొత్తాన్నే ఖర్చు చేస్తున్నారు. ఇక పెట్టుబడి పెట్టేందుకు ఎన్నో రకాల పథకాలు అందుబాటులో ఉన్నాయి. కష్టపడి సంపాదించిన సొమ్ముకు భద్రతతో పాటు, మంచి రిటర్న్లు రావాలని ప్రతీ ఒక్కరూ ఆశిస్తుంటారు. అలాంటి వారి కోసమే కేంద్ర ప్రభుత్వ సంస్థ పోస్టాఫీస్ పలు రకాల పథకాలను అందిస్తోంది. ఇలాంటి బెస్ట్ స్కీమ్స్‌లో సుకన్య సమృద్ధి యోజన ఒకటి. బాలికల బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో రూ. 250 నుంచి గరిష్టంగా ఏడాదికి రూ. 1.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టొచ్చు. ఈ పథకంలో మొత్తం 15 ఏళ్లు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. 21 ఏళ్ల తర్వాత మెచ్యూరిటీ లభిస్తుంది. మరి ఈ పథకంలో భాగంగా రూ. 70 లక్షలు పొందాలంటే నెలకు ఎంత ఇన్వెస్ట్ చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. మీ కూతురు పుట్టిన రోజు నుంచే సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని ప్రారంభించి ఏటా రూ. 1.5 లక్ష డిపాజిట్ చేశారనుకుందాం. ఈ లెక్కన మీరు ప్రతీ నెల రూ. 12,500 సేవ్ చేయాల్సి ఉంటుంది. ఇలా 15 ఏళ్లు పెట్టుబడి పెడితే మొత్తం రూ. 22,50,000 అవుతుంది. ప్రస్తుతం ఈ పథకానికి 8.2 శాతం వడ్డీ లభిస్తోంది. 21 ఏళ్ల తర్వాత మెచ్యూరిటీ సమయంలో ర. 46,77,578 వడ్డీగా పొందుతారు. దీంతో మీ కూతురు 21 ఏళ్ల నాటికి అసలు, వడ్డీతో కలిపి మొత్తం రూ. 69,27,578 అంటే సుమారు రూ.70 లక్షలు పొందొచ్చు.ఉదాహరణకు మీరు ఒకవేళ 2024 సెప్టెంబర్‌లో ఈ పథకంలో చేరితే మీకు 2045 నాటికి రూ.7 లక్షలు పొందొచన్నమాట.ఇక ఈ పథకంలో పెట్టుబడిఎట్టినవారికి1961లోనిసెక్షన్80%కిందపన్నుఆదాఅవకాశం కూడా లభిస్తుంది.

# వ్యాపారం

## దృష్టి లోపం ఉన్న వారికి కూడా మేలైన బ్యాంకింగ్ సేవలు..

### బ్రెయిలీ డెబిట్ కార్డు లాంచ్ ద్వారా ఆ సమస్యలు దూరం




భారతదేశంలో ఇటీవల కాలంలో బ్యాంకింగ్ సేవలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వివిధ సంక్షేమ పథకాల లబ్ధిని బ్యాంకు ఖాతాల ద్వారానే లబ్ధిదారులకు అందిస్తున్నాయి. ముఖ్యంగా జన్-ధన్-ఖాతాలు భారతదేశంలో బ్యాంకింగ్ విప్లవాన్నే సృష్టించాయని చెప్పాలి. భారతదేశ పౌరులందరికీ జీరో బ్యాలెన్స్ అకౌంట్ల ద్వారా బ్యాంకింగ్ సేవలను అన్ని బ్యాంకులు అందించాయి. ముఖ్యంగా డెబిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు కూడా పెరిగాయి. డబ్బు విత్‌డ్రా చేసుకోవడానికి బ్యాంకులకు వెళ్లే అవసరం లేకుండా డెబిట్ కార్డులను ఉపయోగించి ఏటీఎంల ద్వారా నగదు విత్‌డ్రా చేసుకునే వారు ఇటీవల కాలంలో బాగా పెరిగారు. అయితే దృష్టి లోపం ఉన్న వారు బ్యాంకింగ్ సేవలను పొందడంలో ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా వారికంటూ ప్రత్యేక చర్యలు ఏవీ లేకపోవడంతో వారు ఇంకా నగదు డిపాజిట్, విత్‌డ్రా కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో దృష్టి లోపం ఉన్న వారికి పంజాబ్ నేషనల్ బ్యాంక్ గుడ్‌న్యూస్ చెప్పింది. బ్రెయిలీ డెబిట్ కార్డులను లాంచ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో పీఎన్‌బీ తీసుకున్న చర్యలు గురించి వివరాలను తెలుసుకుందాం. ప్రభుత్వ యాజమాన్యంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ దృష్టి లోపం ఉన్న కస్టమర్ల కోసం పీఎన్‌బీ అంత: దృష్టి పేరులో బ్రెయిలీ డెబిట్ కార్డ్‌ను ప్రారంభించింది.ఈ కాంటాక్ట్‌లెస్ నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ (ఎన్‌సీఎంసీ) డెబిట్ కార్డ్ రూపే నెట్‌వర్క్‌లో అందుబాటులో ఉందని పీఎన్‌బీ ఇటీవల ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త బ్రెయిలీ డెబిట్ కార్డ్‌ను ప్రవేశపెట్టడం అనేది చేరిక, ఆర్థిక సౌలభ్యంపై పీఎన్‌బీ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆ బ్యాంకు ప్రతినిధులు చెబుతున్నారు. ముఖ్యంగా దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించేందుకు పీఎన్‌బీ ఇలాంటి చర్యలను తీసుకుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇతర బ్యాంకులతో పోలిస్తే పీఎన్‌బీ దృష్టి లోపం ఉన్న కస్టమర్ల కోసం ప్రత్యేక చర్యలను తీసుకోవడం అభినందనీయమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దేశంలోని అందరికీ బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ఇలాంటి చర్యలు ఉపయోగపడతాయని వివరిస్తున్నారు.

## యూపీఐ నగదు చెల్లింపుల్లో ఆ తప్పు చేశారా..? ఈ టిప్స్ పాటిస్తే మీ సొమ్ము వాపస్




భారతదేశంలో 2016లో నోట్లను రద్దు చేశాక ఆన్‌లైన్ చెల్లింపులు ఊపందుకున్నాయి. ముఖ్యంగా ఎన్‌పీసీఐ అందుబాటులోకి తీసుకువచ్చిన యూపీఐ పేమెంట్స్ సదుపాయం ద్వారా చాలా మంది నగదును ఈజీగా బదిలీ చేస్తున్నారు. ముఖ్యంగా యూపీఐ చెల్లింపుల వల్ల దేశంలో చిల్లర సమస్యకు చెక్ పడినట్లు అయ్యింది. అలాగే వ్యక్తిగత బ్యాంకు అకౌంట్లకు నగదు బదిలీ కూడా బ్యాంకునకు వెళ్లాల్సిన అవసరం లేకుండా యూపీఐ చెల్లింపులు ద్వారా చేయడం ప్రజలకు అలవాటు అయ్యింది. అయితే యూపీఐ ద్వారా ఒక వ్యక్తికి పంపబోయి వేరే వ్యక్తికి నగదును బదిలీ చేస్తే అవి తిరిగి రావు అని చాలా మంది చెబుతూ ఉంటారు. కానీ, నిర్దిష్ట విధానాన్ని పాటించడం ద్వారా మనం పొరపాటున వేరే వ్యక్తికి బదిలీ చేసిన సొమ్మును వాపస్ పొందవచ్చని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో యూపీఐ ద్వారా వేరే వ్యక్తికి బదిలీ చేసిన సొమ్మును ఎలా వాపసు పొందవచ్చో? ఓసారి తెలుసుకుందాం. యూపీఐ ద్వారా బదిలీ చేసిన నగదు వాపసు పొందడం ఇలా మీరు ముందుగా ఏ యాప్ ద్వారా నగదు బదిలీ చేశారో? ఆ యాప్‌లో లావాదేవీ నెంబర్ ద్వారా టిక్కెట్ రైజ్ చేసి కంప్లైంట్ చేయాలి. అనంతరం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌ను సందర్శించి, 'వివాద పరిష్కార యంత్రాంగం' విభాగాన్ని సెలెక్ట్ చేసి ఆన్‌లైన్ ఫారమ్‌ను పూరించాలి. లావాదేవీ ఐడీ, వర్చువల్ చెల్లింపు చిరునామా, బదిలీ చేసిన మొత్తం, లావాదేవీ తేదీ, ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌తో సహా అవసరమైన వివరాలను అందించాలి. అనంతరం అకౌంట్‌లో సొమ్ము బదిలీ జరిగినట్లు మీ బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను అప్‌లోడ్ చేయాలి. అక్కడ మీ ఫిర్యాదుకు కారణం 'మరో ఖాతాకు తప్పుగా బదిలీ చేయబడింది' ఎంచుకోవాలి. అనంతరం మీ ఫిర్యాదు పరిష్కారమవుతుంది. ఒకవేళ సమస్య పరిష్కరించకపోతే ముందుగా టీపీఏపీ, తర్వాత పీఎస్‌పీ బ్యాంక్ (చెల్లింపు సర్వీస్ ప్రొవైడర్ బ్యాంక్), అనంతరం బ్యాంకును సమస్య పరిష్కారం కోసం సంప్రదించాలి. ఒక నెల తర్వాత కూడా సమస్య పరిష్కారం కాకపోతే లేదా ప్రతిస్పందనతో మీరు అసంతృప్తి చెందితే, డిజిటల్ లావాదేవీల కోసం ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌ని సంప్రదించాలి.

## ప్రత్యేక ఎఫ్‌డీలపై కాలపరిమితి పెంపు.. ఆ బ్యాంకుల్లో ప్రత్యేక ఆఫర్లు

భారతదేశంలో పెట్టుబడిదారులు నమ్మకమైన పెట్టుబడి ఎంపికగా ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఎంచుకుంటూ ఉంటారు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా బ్యాంకింగ్ రంగంలో వచ్చిన మార్పుల వల్ల ఎఫ్‌డీల కంటే మంచి పెట్టుబడి ఎంపికలు ప్రజాదరణ పొందుతున్నాయి. క్రమేపి బ్యాంకుల్లో ఎఫ్‌డీల్లో డిపాజిట్ చేసే వారి సంఖ్య క్రమేపి తగ్గుతుంది. ఈ నేపథ్యంలో కస్టమర్లను ఎఫ్‌డీల్లో పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహించడానికి చాలా బ్యాంకులు ప్రత్యేక ఎఫ్‌డీ స్కీమ్‌లను లాంచ్ చేస్తున్నాయి. సాధారణ ఎఫ్‌డీలతో పోలిస్తే ఈ ప్రత్యేక ఎఫ్‌డీలు అధిక వడ్డీను అందిస్తున్నాయి. తాజాగా ప్రముఖ బ్యాంకులు అన్నీ ప్రత్యేక ఎఫ్‌డీల కాలపరిమితిని పెంచాయి. ఈ నేపథ్యంలో ఏయే బ్యాంకులు ప్రత్యేక ఎఫ్‌డీలపై కాలపరిమితిని పెంచాయో? ఓ సారి తెలుసుకుందాం. పొడగింపులను ప్రకటించిన బ్యాంకులు ఇవే ఇండియన్ బ్యాంక్ తన ప్రత్యేక ఎఫ్‌డీల కోసం పొడిగింపును ప్రకటించింది. ఎఫ్‌డీ పెట్టుబడిదారులు సెప్టెంబర్ 30 వరకు ప్రత్యేక ఎఫ్‌డీ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. ఈ గడవు జూన్ 30తో ముగిసినా మరోసారి పెంచారు. ఐడీబీఐ బ్యాంక్‌కు సంబంధించిన ప్రత్యేక ఉత్సవ్ ఎఫ్‌డీల గడువు కూడా సెప్టెంబర్ 30, 2024 వరకు పొడిగించారు. వాస్తవానికి ఈ పథకం గడువు జూన్ 30, 2024న ముగిసినా వినియోగదారులను ఆకర్షించడానికి బ్యాంకు మరోసారి గడువును పొడగించింది. పంజాబ్ సింధ్ బ్యాంక్ లిమిటెడ్ పిరియడ్ ప్రత్యేక డిపాజిట్ల కాలపరిమితిని పెంచింది. ఈ గడువు సెప్టెంబర్ 30, 2024కి ముగుస్తుంది. ప్రముఖ బ్యాంకు ఎస్‌బీఐ కూడా ప్రత్యేక డిపాజిట్లపై కాలపరిమితిని పెంచింది. అమృత్ కలాష్ స్కీమ్, ఎస్‌బీఐ వీ కేర్ ఎఫ్‌డీల కాలపరిమితిని ఎస్‌బీఐ పెంచింది. ఎస్‌బీఐ కూడా ప్రత్యేక ఎఫ్‌డీలపై కాలపరిమితిని సెప్టెంబరు 30, 2024 వరకు పెంచింది.



# చందన




## డయాబెటిస్ ఉన్న వాళ్లు ఏ పండ్లు తినాలి?

### మధుమేహ నియంత్రణకు ఏ జాగ్రత్తలు తీసుకోవాలి?

ఏ వ్యాధి అయినా వచ్చాక నియంత్రించడం కంటే.. రాకుండా నివారించడమే మంచి మార్గమని అంటున్నారు వైద్యులు. కరోనా నేర్పిన పాఠం వల్ల వైరస్‌ల విషయాల్లో జాగ్రత్త పడినా.. బీపీ, డయాబెటిస్ వంటి విషయాల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంతో అవి ప్రతి ఒక్కరిలోనూ చేరుతున్నాయి. ఫాస్ట్‌ఫుడ్ తింటే డయాబెటిస్ వస్తుందా ? ప్రధానంగా డయాబెటిస్ ఉన్న వారు పాటించాల్సిన నియమాల గురించి తెలుసుకుందాం. మధుమేహం లేదా చక్కెర వ్యాధిని వైద్య పరిభాషలో డయాబెటిస్ మెల్లిటస్ అని వ్యవహరిస్తారు. మధుమేహం అంటే మనిషి రక్తంలో చక్కెరస్థాయి ఎక్కువగా అనియంత్రిత స్థితిలో ఉండడం. ఇది వ్యాధి కాదు. శరీరంలో ఇన్సులిన్ తగ్గడం వల్ల ఏర్పడే అసమానత. సాధారణంగా ఒక లీటరు రక్తంలో గ్లూకోజ్ 100 మిల్లీ గ్రాములు ఉండాలి. దానికంటే ఎక్కువగా ఉంటే మధుమేహం ఉన్నట్లు భావించాలి. సాధారణంగా పరిగడపున రక్త, మూత్ర పరీక్షలు చేసి గ్లూకోజ్ స్థాయి తెలుసుకుంటారు. మధుమేహంలో ప్రధానంగా మూడు రకాలు ఉంటాయి. టైప్-1, టైప్-2, జెస్టేషనల్. టైప్-1 మధుమేహం.. క్లోమ గ్రంథిలో బీటాకణాలు నశించి ఇన్సులిన్ స్రవించకపోవడం వల్ల ఈ రకం మధుమేహం వస్తుంది. సాధారణంగా జన్యు కారణాల వల్ల టైప్ 1 మధుమేహం వస్తుంది. ఆకలి విపరీతంగా వేయడం, ఉన్నట్టుండి బరువు తగ్గిపోవడం, బలహీనత, చిరాకు, వాంతులు, వికారం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. టైప్-2 మధుమేహం.. శరీరం సరైన స్థితిలో ఇన్సులిన్‌ను వినియోగించుకోలేనప్పుడు టైప్-2 మధుమేహం వస్తుంది. ఈ రకం మధుమేహం వయసు పైబడడం, ఊబకాయం, శారీరక శ్రమలేని జీవన విధానం మొదలైన వాటి వల్ల వస్తుంది. చూపు తగ్గిపోవడం, కాళ్ల తిమ్మిర్లు, మొద్దుబారినట్లు అనిపించడం, కాళ్ల మీద గాయం అయినప్పుడు త్వరగా మానకపోవడం, చర్మం మీద దురదలు అనిపించడం వంటి లక్షణాలు ఉంటాయి. జెస్టేషనల్ మధుమేహం..హార్మోన్లలో సంభవించే తేడాల వల్ల గర్భధారణ సమయంలో కొంతమందిలో వస్తుంది. ప్రసవానంతరం తగ్గిపోతుంది. అయితే ఇలా గర్భధారణ సమయంలో మధుమేహం వచ్చిన వారిలో సగానికి సగం మందిలో తరువాత వయస్సులో టైప్-2 మధుమేహం వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి వారు ఆహార, వ్యాయామాల విషయంలో శ్రద్ధ వహించాలి. మధుమేహం లక్షణాలు.. తరచుగా మూత్ర విసర్జన..: శరీంలో చక్కెర మోతాదు పెరిగిపోయినప్పుడు శరీరం కిడ్నీల ద్వారా దానిని బయటకు పంపే ప్రయత్నం చేస్తుంది. దాని వల్ల తరచుగా మూత్ర విసర్జన చేయాల్సి వస్తుంది. చర్మం పొడిబారిపోయి దురదలు పెట్టడం..: ఎక్కువసార్లు మూత్ర విసర్జన చేయాల్సి రావడంతో శరీరం ఎండిపోయి, చర్మం పొడిబారిపోతుంది. స్నిగ్ధత కోల్పోవడం వల్ల దురదలు వస్తాయి. రక్తంలో చక్కెర నిల్వలు ఎక్కువగా ఉండడం వల్ల వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. బ్యాక్టీరియా వంటి సూక్ష్మక్రిములు పెరిగి అంటువ్యాధులకు ఆస్కారం ఏర్పడుతుంది. మధుమేహ నియంత్రణకు సూత్రాలు.. బరువును అదుపులో ఉంచుకోవాలి. ఊబకాయులు అయిన మధుమేహ వ్యాధిగ్రస్తులు బరువును ఎప్పటికప్పుడు చూసుకోవాలి. కఠినమైన ఆహార నియమాలు, క్రమం తప్పని వ్యాయామం, ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చూసుకోవాలి. చురుకుగా ఉంటూ రోజూ అరగంట వ్యాయామం చేస్తే ప్రమాదాలను నియంత్రించుకోవచ్చు. మానసిక ఆందోళనను, ఒత్తిడిని తగ్గించుకోవాలి. ఫాస్ట్ ఫుడ్ పూర్తిగా నియంత్రించాలి. తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు.. మధుమేహులు కాకరకాయలు, నేరేడుపండు, మెంతులు, దంపుడు బియ్యం, ముడి బియ్యం, ఆకుకూరలు, క్యారెట్ వంటి ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి. మామిడి పండు, ద్రాక్ష, సీతాఫలం, సపోటా, అరటిపండు, కిస్మిస్, ఖర్జూరం, ఆలుగడ్డ, పాలిష్ చేసిన బియ్యం వంటి పదార్థాలు తీసుకోవద్దు. పాస్ట్ ఫుడ్ కల్చర్ వల్ల పిల్లలనూ మధుమేహం వెంటాడుతోంది.



# అమ్మ చెప్పిన మాటే.. ఇప్పుడీ స్థాయికి!



ప్రీతిక మెహతాను వరల్డ్ ఎకనామిక్ ఫోరం 'గ్లోబల్ షార్పర్'గా గుర్తించింది. చండీగఢ్‌కు చెందిన ప్రీతిక బహుముఖ ప్రజ్ఞాశాలి. గణిత మేధావి, డేటా సైంటిస్ట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎక్స్‌పర్ట్‌గా పేరు తెచ్చుకున్న ప్రీతిక 'బటర్‌నట్ ఏఐ'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా కూడా రాణిస్తోంది. మరోవైపు మోటివేషనల్ స్పీకర్‌గా ఎంతోమందికి ధైర్యాన్ని ఇస్తోంది. మార్గనిర్దేశం చేస్తోంది. లెక్కలు అంటే చాలామంది పిల్లలకు భయం. అయితే చిన్నప్పటి నుంచి ప్రీతికకు లెక్కలు అంటే చెప్పలేనంత ఇష్టం. బొమ్మలు వేయడం అంటే కూడా ఇష్టం. పద్నాలుగు సంవత్సరాల వయసులో కోడింగ్ నేర్చుకోవడం మొదలుపెట్టింది. ఒక ప్రొడక్ట్ స్టార్టప్‌లో తొలి ఉద్యోగం చేస్తున్నప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై ఆసక్తి పెరిగింది. దాంతో ఉద్యోగాన్ని వదులుకొని న్యూయార్క్‌లోని స్టేట్ యూనివర్శిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో మాస్టర్స్ చేసింది. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు ఖర్చుల కోసం ఒక రెస్టారెంట్‌లో పనిచేసేది. గ్రాడ్యుయేషన్ సెర్మనీకి ప్రీతిక తల్లి అమెరికాకు వచ్చింది. తల్లిని తన ప్రొఫెసర్‌కు పరిచయం చేసింది. 'మీ అమ్మాయి బ్రైట్ స్టూడెంట్. క్లాస్‌రూమ్‌లో లోతైన ప్రశ్నలు అడిగేది. మీ కూతురికి మంచి భవిష్యత్ ఉంది' అంటూ ఆ ప్రొఫెసర్ ప్రీతికపై ప్రశంసల వర్షం కురిపించాడు. ప్రొఫెసర్ మాటలు విన్న తరువాత ప్రీతికకు తన మీద ఉన్న నమ్మకం రెట్టింపు అయింది. 'యస్. నేను సాధించగలను' అనుకుంది. బోస్టన్‌లోని 'బాంక్ ఆఫ్ అమెరికా'లో పనిచేసే అవకాశం ప్రీతికకు వచ్చింది. అయితే సొంతంగా ఏదైనా సాధించాలనే లక్ష్యంతో అధిక వేతనంతో కూడిన ఉద్యోగానికి రాజీనామా చేసింది. ప్రీతిక నిర్ణయం కుటుంబ సభ్యులతో సహా చాలామందికి నచ్చలేదు. 'బ్యాంక్ ఆఫ్ అమెరికాలో ఉద్యోగ జీవితం బాగున్నప్పటికీ నాలో ఉన్న అన్ని టాలెంట్స్‌ను ఉపయోగించుకునే అవకాశం దొరకలేదు' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటుంది ప్రీతిక. అమెరికా నుంచి వచ్చిన తరువాత పిల్లలకు కోడింగ్ నేర్పించడానికి 'కిడ్డీకోడర్స్'ను స్టార్ట్ చేసి పన్నెండు దేశాలకు వెళ్లింది. ఆ తరువాత సాక్‌సోహో.కామ్‌తో మెన్స్ ఫ్యాషన్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది.'మెన్స్ ఫ్యాషన్ ఇండస్ట్రీలో మంచి అవకాశాలు ఉన్నాయని రిసెర్చ్ ద్వారా తెలుసుకున్నాను. ఈ స్పేస్‌లో గ్లోబల్ స్టార్టప్ నిర్మించవచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సాక్‌సోహో మొదలు పెట్టాను' అంటుంది ప్రీతిక.తనకు పట్టు ఉన్న డేటా, ఏఐ సబ్జెక్ట్‌లతో కస్టమర్‌ల వ్యక్తిగత అనుభవాలతో కంపెనీని బిల్డ్ చేసింది. యూఎస్‌లో చదువుకునే రోజుల్లోపార్ట్‌టైమ్ ఉద్యోగిగా ఒక ఇటాలియన్ రెస్టారెంట్‌లో పనిచేసింది. అది కస్టమర్%-%ఫేసింగ్ జాబ్ కావడం వల్ల ఎన్నో విషయాలపై అవగాహన వచ్చింది. ఆ జ్ఞానం 'సాక్‌సోహో'కు ఉపయోగపడింది. డైరెక్ట్%-%టు%-%కన్స్యూమర్ ఫ్యాషన్ బ్రాండ్ 'సాక్‌సోహో' తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయకేతనం ఎగరేసింది ప్రీతిక. 'మనపై మనకు ఉన్న నమ్మకమే శక్తి. దానితో ఎన్ని విజయాలైనా సాధించవచ్చు' అంటుంది ప్రీతిక మెహతా. మార్గనిర్దేశం..'ఉన్నత స్థానానికి చేరుకున్న మహిళలకు తమ స్థాయిని కా?డుకోవడానికి రెట్టింపు కష్టపడాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో లక్ష్యసాధనకు సంబంధించి అమ్మాయిలకు మార్గనిర్దేశం చేయడానికి వారికి సమయం దొరకదు' అంటున్న ప్రీతిక ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎంత బిజీగా ఉన్నప్పటికి లక్ష్యసాధన విషయంలో అమ్మాయిలకు మార్గనిర్దేశం చేయడానికి ఎన్నో సమావేశాల్లోపాల్గొంది. ఎంటర్‌ప్రెన్యూర్‌గానే కాదు మోటివేషనల్ స్పీకర్‌గా కూడా మంచి పేరు తెచ్చుకుంది. 'థింక్. లెర్న్. డిసైడ్ విత్ యువర్ ఓన్ హెడ్ అండ్ హార్ట్' అనేది ఎన్నో సమావేశాలలో ప్రీతిక నుంచి వినిపించే మాట.అమ్మ చెప్పిన మాట..చదువుకునే రోజుల్లో ఎందరో విజేతల కథలు నాకు స్ఫూర్తి ఇచ్చాయి. అదే సమయంలో 'ప్రతి రంగంలో పురుషులతో పోల్చితే మహిళా విజేతలు ఎందుకు తక్కువగా ఉన్నారు?' అని ఆలోచించేదాన్ని. ఈ ఆలోచనలతోనే నా వంతుగా ఏదైనా సాధించాలనే పట్టుదల పెరిగింది. చిన్నప్పుడు స్కూల్ మార్చమని ఇంట్లో గొడవ చేశాను. దీనికి కారణం క్లాసులో 80 మంది స్టూడెంట్స్ ఉండడం. 'ఇంత మంది మధ్య నేను టాపర్‌గా ఎలా ఉండగలను' అన్నాను.'ఇరవైమందిలో ఎలాగైతే టాపర్‌గా నిలిచావో 80 మందిలో కూడా టాపర్‌గా నిలవాలి' అని అమ్మ చెప్పింది. వందమందిలో రాణించగలిగినప్పుడు వెయ్యిమందిలో కూడా రాణించగలం అనే సత్యం బోధపడింది. మనలో సామర్థ్యం ఉన్నప్పుడు సంఖ్య ముఖ్యం కాదు. ఒకవైపు భవిష్యత్ లక్ష్యాలు. మరోవైపు ఇరుగు పొరుగు వారి సూటిపోటి మాటలు. 'ఈ డ్రెస్‌తో బయటికి వెళతావా?' 'అబ్బాయిలా పొడుగ్గా పెరుగుతున్నావేమిటి?'... ఇలాంటి నాన్‌సెన్స్ మైండ్‌సెట్ కామెంట్స్ చిరాకు కలిగించేవి కానీ నా భవిష్యత్ లక్ష్యాలను నీరుగార్చలేకపోయాయి. మన దేశంలోనే కాదు అమెరికాలోనూ వృత్తిజీవితంలో లింగవివక్షతను ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. అయితే అలాంటి వాటికి చిన్నబుచ్చుకోకుండా టాలెంట్‌తోనే సమాధానం చె?్పను.

## రైజింగ్ స్టార్: 16 ఏళ్లకే రూ.100 కోట్ల ఏఐ స్టార్టప్





పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్టు టెక్ పరిశ్రమలోకి తన ఘనతను చాటుకుందో 16 ఏళ్ల బాలిక. డెల్వ్.ఏఐ స్టార్టప్‌తో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. రూ.100 కోట్ల విలువతో సక్సెస్ రూల్స్‌ను తిరగరాసింది ఈ యువ పారిశ్రామిక వేత్త. ఈ సంస్థ పరిశోధన కోసం డేటా వెలికితీతకు సంబందించిన సేవలను అందిస్తుంది. ఇప్పుడు తన సంస్థలో పది మందికి ఉపాధి కల్పిస్తోంది. ప్రాంజలి అవస్థి 2022లోని ప్రారంభించింది. ఈ స్టార్టప్ ఇప్పటికే రూ.100 కోట్ల (12 మిలియన్ల డాలర్లు) విలువను కలిగి ఉంది. డెల్వ్.ఏఐ లింక్డ్‌ఇన్ ప్రొఫైల్ ఇప్పటికే 10 మంది ప్రత్యేక నిపుణుల బృందాన్ని కలిగి ఉండటం విశేషం. పాఠశాలల్లో కంప్యూటర్ సైన్స్ విద్యను ప్రోత్సహించడం ద్వారా ఆమె తండ్రి అవస్థి ఉన్నతికి పునాది వేశారు. ఈ ప్రోత్సాహంతోనే ఆమెను కేవలం ఏడు సంవత్సరాల వయస్సులో కోడింగ్ ప్రారంభించింది. ఆమెకు 11 ఏళు ్లన్నపుడు కుటుంబం భారతదేశం నుంచి ఫ్లోరిడాకు మారింది. 13 ఏళ్ల వయసులో ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్శిటీకి చెందిన రీసెర్చ్ ల్యాబ్స్‌లో ఆమె ఇంటర్న్‌షిప్ ద్వారా వ్యాపార ప్రపంచంలోకి ఆమె ప్రవేశించింది. ఇంటర్న్‌షిప్ సమయంలో, కోవిడ్ మహమ్మారి కారణంగా వర్చువల్ హైస్కూల్‌లో చదువుతున్నప్పుడు ప్రాంజలి మెషిన్ లెర్నింగ్ ప్రాజెక్ట్‌లలోకి ప్రవేశించింది. ఓపెన్ బీటా విడుద లైన క్రమంలోనే ఈ వెంచర్ కూడా మొదలైంది. హైస్కూల్ విద్యార్థిని లూసీ గువో, బ్యాకెండ్ క్యాపిటల్‌కు చెందిన డేవ్ ఫాంటెనోట్ నాయకత్వంలో మియామిలో %ూ×% స్టార్టప్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌లోకి అడుగుపెట్టింది. తరువాత ఆన్ డెక్, విలేజ్ గ్లోబల్ నుంచి పెట్టుబడులను పొందడంలో యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ అవస్థికి సహాయపడింది. ఆ తర్వాత ఆమె వ్యాపార ప్రయాణం ప్రారంభమైంది. ప్రాంజలి అవస్తి తన కంపెనీని జనవరి 2022లో స్థాపించింది. దాదాపు రూ3.7 కోట్లతో ప్రారంభ నిధులను సేకరించింది. కేవలం ఒక ఏడాదిలోనే రూ100 కోట్లకు చేరింది.

## బరువు తగ్గాలని రైస్‌కి దూరంగా ఉంటున్నారా? ఫిట్‌నెస్ కోచ్ ఏమంటున్నారంటే..

బరువు తగ్గేందుకు రకరకాల డైట్‌లు ఫాలో అవుతాం. ముఖ్యంగా రైస్‌ని దూరంగా ఉంచుతారు. ఎక్కువగా పండ్లు, చిరుధాన్యాల మీద ఆధారపడుతుంటారు. ఒక్కోసారి నచ్చిన కూర ఉన్న కూడా బరువు విషయం గుర్తించి భారంగా దూరం పెట్టేస్తాం రైస్‌ని. ఇంతకి రైస్ వల్లే బరువు పెరిగిపోతామా? దీనిపై ఫిట్‌నెస్ కోచ్‌లు ఏమంటున్నారంటే.. చాలామంది బరువు విషయంలో చాలా అపోహలు ఉన్నాయి. అ?న్నంతో బరువు ముడిపడి ఉందని నమ్ముతుంటారు. అందువల్ల అన్నం తినడం తగ్గించేస్తుంటారు. ముఖ్యంగా బరువు తగ్గే యత్నంలో అన్నంకి దూరంగా ఉంటారు. అయితే ఇది ఎంతమాత్ర నిజం కాదని తేల్చి చెబుతున్నారు ఫిట్‌నెస్ కోచ్ సిమ్రాన్. బరువు తగ్గడంలో రైస్‌ని హాయిగా తింటూనే ఎలా నియంత్రించవచ్చో వివరించారు. ఎలాంటి చింత లేకుండా హాయిగా రైస్‌ని ఆస్వాదిస్తూ తినొచ్చని చెబుతున్నారు. అందుకోసం చేయాల్సింది ఏంటో వెల్లడించారు. భోజనం తినడానికి కనీసం 10 నుంచి 12 నిమిషాల ముందు ఒక గ్లాస్ నీటిని హాయిగా తీసుకోండి. తర్వాత మంచి సలాడ్ కొద్దిగా తీసుకోండి. ఆ తర్వాత నచ్చిన భోజనం హాయిగా తినండి. ప్రతి ముద్దను ఆస్వాదిస్తూ తినండి. అలాగే పెరుగు అన్నం కూడా స్కిప్ చెయ్యొద్దు మంచిగా లాగించేయండని చెబుతున్నారు ఫిట్‌నెస్ కోచ్ సిమ్రాన్. అంతేగాదు అన్నం తినడం వల్ల మధుమేహం రాదని, కేవలం అతిగా తినటం వల్ల వస్తుందని చెప్పారు. అలాగే యాక్టివ్‌గా ఉండేందుకు యత్నించండి, సమతుల్య ఆహారం బాగా తినండి, కాస్త కామన్ సెన్స్‌తో వ్యవహరిస్తూ నెట్టింట్‌లో చెప్పే ప్రతి చిట్కాను ఫాలో అవ్వకండి అని చెబుతున్నారు. అన్న తినడం వల్ల బరువు పెరుగుతాం అనే భావనను వదిలించుకోండి. శరీరం హెల్తీగా ఉండాలంటే మనస్ఫూర్తిగా అన్నం తినాలనే విషయాన్ని గ్రహించండి.

# ఆ ఆహార పదార్థాలకు దూరంగా ఉంటే బరువు తగ్గుతారు! పోషకాహార నిపుణులు





బరువు తగ్గే ప్రయాణంలో చాలా మంది పలు రకాల వర్కౌట్‌లు, డైట్‌పై దృష్టిపెడతారు. కానీ ఎలాంటి ఆహారం తీసుకుంటే బరువు తగ్గుతున్నాం అనేదాన్ని గమనించరని పోషకాహార నిపుణురాలు ఖ్యాతి రూపాని అంటున్నారు. మన తీసుకునే ఆహారంలో ఆరోగ్యకరంగా ఉండే ఆహారాలు మన బరువు తగ్గేందుకు ఆటంకం కలిగిస్తాయని చెబుతున్నారు. అలాంటి వాటిని ఎంత మేర వరకు తీసుకుంటే బెటర్ అనేది అంచనా వేసి తీసుకోవాలని తెలిపారు. అలాగే ఎక్కువ కేలరీల ఆహారం తీసుకున్న రోజు కచ్చితంగా బాగా హెల్తీగా ఉండే ఆహారాలను తీసుకోకుండా ఉండటం వంటి జాగ్రత్తలు పాటిస్తే బరువు ఈజీగా తగ్గుతారని చెబుతున్నారు. ఈ సందర్భంగా తన వెయిట్ లాస్ జర్నీలో తాను ఎలాంటి ఆరోగ్యకరమైన ఆహారాలను దూరం పెట్టడం వల్ల ఎంత తొందరగా బరువు తగ్గగలిగానే అనే విషయాలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసుకున్నారు. ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు తీసుకోవడం, బరువు తగ్గడానికి తినడం అనేవి రెండు వేర్వేరు పరిస్థితులని నొక్కి చెప్పారు. వాటితో సరిగా వ్యవహరించాలని, అన్ని ఆరోగ్యకరమైన ఆహారాలు తక్కువ కేలరీలు లేదా కొవ్వు రహిత పదార్థాలుగా భావించడం బరువు తగ్గే ప్రయత్నాలకు ప్రధాన ఆటంకాలని అన్నారు. అంతేగాదు క్యాలరీలు మనల్ని ఎలా తికమకకు గురిచేస్తాయో కూడా వివరించారు. మన ఆహారంలో కొవ్వులు కీలకమైనవే కానీ ఇవి కార్బోహైడ్రేట్లు లేదా ప్రోటీన్‌తో పోలిస్తే గ్రాముకు రెట్టింపు క్యాలరీలను ప్యాక్ చేస్తాయి. ఉదాహరణకు ఒక గ్రాము కొవ్వు 9 కేలరీలను ఇస్తుంది. అయితే ఒక గ్రాము కార్బోహైడ్రేట్లు లేదా ?ప్రోటీన్ 4 కేలరీలను మాత్రమే ఇస్తుంది. ఇలాంటప్పుడు విజయవంతంగా బరువు తగ్గాలనుకుంటే సముతుల్యత పాటిస్తూ..తక్కువ కేలరీలు, ఫైబర్లు?, ప్రోటీన్లు అధికంగా ఉండేలా, కొవ్వు లేకుండా చేసుకోవాలని చెబుతున్నారు. సింపుల్‌గా చెప్పాలంటే ఒక టేబుల్ స్పూన్ వెన్నలో 50 కేలరీల కంటెంట? మొత్తం మీకు ఒక యాపిల్‌తో విభేదిస్తుంది. ఎందుకుంటే..? ఇందులో ఏకంగా 90 కేలరీలు ఉంటాయి, పైగా కొవ్వు ఉండదు, ఫైబర్ పుష్కలంగా ఉండి ఎక్కువ సేపే ఆకలి లేకుండా చేస్తుంది. అందువల్ల వెయిట్ లాస్ జర్నీలో బరువుని ఆటంకపరిచే ఐదు ఆరోగ్యకరమైన ఆహారాల గురించి సవివరంగా వెల్లడించారు పోషకాహార నిపుణులు ఖ్యాతి రూపానీ. అవేంటంటే.. అవోకాడో: ఆరోగ్యకరమైన కొవ్వులు కోసం తరుచుగా సూపర్‌ఫుడ్‌గా పేర్కొన్నప్పటికీ..కేలరీల పంచ్ ప్యాక్‌ని అందిస్తుంది. ఇవి 100 గ్రాముల అవోకాడోకి సుమారు 200 కేలరీలు, 19 గ్రాముల కొవ్వులు ఉంటాయి. అందువల్ల దీన్ని డైట్‌లో చేర్చుకునేటప్పుడూ మితంగా ఉండేలా చూసుకోవటం ముఖ్యం. స్మూతీస్: ఈ స్మూతీస్‌లో మంచి తృణధాన్యాలు, వెన్న, పాలతో లోడ్ చేసే కేలరీల లోడ్. దీన్ని ఆస్వాదించేటప్పుడూ కూడా జాగురుకతతో వ్యవహరించాలి. సమతుల్యంగా తీసుకోవాలి. నట్ బట్టర్: ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు సమృద్ధిగా ఉన్నప్పటికీ నట్ బట్టర్ శరీరానికి అదనపు కేలరీలను అందించేస్తుంది. చెప్పాలంటే వంద గ్రాములకు సుమారు 600 కేలరీలను పొందుతాం కాబట్టి తీసుకునేటప్పుడూ ఆ రోజు వర్కౌట్‌ల రీత్యా ఎంతమేర బెటర్ అనేది అంచనా వేసి మితంగా తీసుకుంటే మంచిది. వేయించిన స్నాక్స్: వేయించిన అ?ల్పాహారం అంటే అరటిపండు చిప్స్ వంటి రకరకాల ఐటెమ్స్ విషయంలో కేలరీల కంటెంట్‌పై దృష్టిపెట్టాలని చెబుతున్నారు. ఇవి బాగా రుచిగా ఉండటంతో ఒకేసారి ఎక్కువ మోతాదులో శరీరం కేలరీను ఈజీగా పొందుతుంది. షుగర్ ఫ్రీ స్వీట్స్: షుగర్-ఫ్రీ స్వీట్స్ కదా పెద్ద క్యాలరీలు ఉండవని చాలామంద పొరపడతారు. ఇవి కొవ్వు రహితం మాత్రం కాదు. వంద గ్రాముల షుగర్ ఫ్రీ స్వీట్స్‌లో దాదాపు 317 కేలరీలు ఉంటాయని చెబుతున్నారు పోషాకాహార నిపుణురాలు ఖ్యాతి రూపానీ. అందువల్ల ఇలాంటి హెల్తీ ఆహారాలను తీసుకునే విషయంలో కాస్త జాగురకతతో వ్యవహరిస్తూ మితంగా తీసుకుంటే తక్కువ సమయంలోనే ఈజీగా బరువు తగ్గుతారని అంటున్నారు.

# స్పెషల్ సీమ చింతకాయలు..

## ఎక్కడైనా కనిపిస్తే అసలు వదలకండి.. తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే..





సీమచింతతో ఆరోగ్య ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునేవారికి మంచి ప్రత్యామ్నాయం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. విటమిన్-సి సమృద్ధిగా ఉన్నందువల్ల సీమ చింతకాయ తింటే శరీరానికి అవసరమైన రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుతుంది. ఇందులో విటమిన్, ఎ, బి, సిలతో పాటు మెగ్నీషియం, ఐరన్ ఇంకా ఇతర పోషకాలు పుష్కలంగా వుంటాయి. సీమ చింతలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. విటమిన్- సి, ఎ, పొటాషియం, ఐరన్ లాంటి అనేకానేక విటమిన్లు, మినరల్స్ ఇందులో ఉన్నాయి. ఇందులోని డైటరీ ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచి, ఏకాగ్రతను కలిగించే గుణం వీటిలో వున్నాయి. చీమ చింతకాయలను మధుమేహులు కూడా తగు మోతాదులో తింటే ఏమి కాదంటున్నారు నిపుణులు. సీమ చింతకాయలలో గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువ. కాబట్టి, రక్తంలో చక్కెర స్థాయిలను త్వరగా పెంచదు. అలా డయాబెటిస్ ఉన్నవారికీ సీమచింత మంచి ఆహారమే. బరువు తగ్గాలనుకునేవారికి చీమచింతకాయలు మంచి ఆహారం అంటున్నారు. చీమచింతలో క్యాల్షియం నిల్వలున్న కారణంగా ఎముక బలానికి ఉపయోగపడతాయి. మానసిక ఒత్తిడితో బాధపడేవారికి చీమ చింతకాయలు ఔషధంలా పనిచేస్తాయి. మోతాదుకి మించి వీటిని తింటే జీర్ణ సమస్యలు తలెత్తవచ్చు. సీమ చింతకాయలో విటమిన్-ఎ ఉంటుంది. దీంతో కంటిచూపు మెరుగ్గా ఉండేలా చూస్తుంది. కేలరీలు తక్కువ, ఫైబర్ ఎక్కువ. అలా బరువు తగ్గాలనుకునేవారికి సీమచింత మంచి ప్రత్యామ్నాయం. గర్భిణీలు, బాలింతలు వీటిని తినకుండా వుండటమే మంచిదని చెబుతున్నారు. వగరుగా వుండే చీమచింతకాయలు తింటే గొంతు పట్టుకుంటుంది కనుక వాటిని తినకూడదని చెబుతున్నారు.

## బాదం పప్పు నానబెట్టి తింటే మంచిదా? లేదంటే పచ్చిగా తింటే మంచిదా?



చాలా మందికి రోజూ ఉదయాన్నే నానబెట్టిన బాదంపప్పు తినడం అలవాటు. అయితే బాదంపప్పు నానబెట్టి తింటే మంచిదా.. లేదంటే అలాగే పచ్చిగా తింటే మంచిదా అనే సందేహం కూడా చాలా మందిలో ఉంటుంది. బాదంపప్పు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. కానీ మీరు సరైన పద్ధతిలో తింటేనే ప్రయోజనాలు పొందవచ్చు. కాబట్టి బాదంపప్పును పచ్చిగా తినాలా? నానబెట్టి ఎలా తినాలా అనే విషయం ఇప్పుడు తెలుసుకుందాం.. బాదంలో విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. అంతేకాకుండా బాదంలో కాల్షియం, ఫాస్పరస్ కూడా ఉన్నాయి. ఇవి శరీరానికి పోషకాలను అందిస్తాయి. బాదం పప్పును ఉదయాన్నే పరగడుపున తీసుకుంటే ప్రయోజనాలు పొందవచ్చు. ఇందుకోసంరాత్రి పడుకునే ముందు కొన్ని బాదంపప్పులను నీళ్లతో వేసి నానబెట్టాలి. తర్వాతవాటిని తొక్క తీసి ఉదయం పూటా ఖాళీ కడుపుతో తినాలి. అలాగే బాదంపప్పును స్నాక్‌గా కూడా తినవచ్చు. పచ్చి వాటి కంటే నానబెట్టిన బాదం శరీరానికి ఎక్కువ మేలు చేస్తుంది. అలాగే బాదం షేక్ చేసి కూడా తాగొచ్చు. కానీ బాదంలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల బరువు పెరగడానికి దారితీయవచ్చు. అందుకే వీటిని పరిమితంగా మాత్రమే తీసుకోవాలి.నట్ఎలర్జీ ఉన్నవారు వాటిని తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మర్చిపోకూడదు. ఎలర్జీ ఉన్న వారు వీటికి దూరంగా ఉండటం బెటర్.



## కొబ్బరి నీళ్లు ఏ టైమ్‌లో తాగాలి..?

## డాక్టర్లు ఏం చెబుతున్నారంటే





సమ్మర్ సీజన్‌లో ఇష్టమైన పండ్లు తింటే ఆ మజాయే వేరు. మామిడి పండ్లు, ముంజలను తినడానికి చాలామంది ఇష్టం చూపుతారు. అయితే వేసవిలో శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవడం చాలా ముఖ్యం కూడా. అందుకే బాడీని కూల్ చేసే వాటిని తీసుకోవాలి. అందులో మొదటిది కొబ్బరినీళ్లు. ఒక కొబ్బరి బోండం నీళ్లు తాగితే రోజంతా హుషారుగా ఉండవచ్చు. అదే సమయంలో బాడీని కూల్ చేస్తుంది కూడా. కొబ్బరి నీళ్లలో కాల్షియం, మాంగనీస్ లాంటివి ఉంటాయి. సమ్మర్‌లో కొబ్బరి నీళ్లు తాగడం వల్ల అనేక రకాల బెనిఫిట్స్ ఉన్నాయి. అయితే చాలామంది సమయ పాలన లేకుండా కొబ్బరి నీళ్లు తాగుతుంటాయి. అయితే సమయంలో తాగడం అనేది కూడా తెలుసుకోవాలి. కొబ్బరినీళ్లు ఏ సమయంలో తాగాలి అనే ప్రశ్న చాలమంది ఉంది. కొంతమంది ఖాళీ కడుపుతో తీసుకుంటే.. మరికొందరు మధ్యాహ్నం తాగడం మంచిదని భావిస్తుంటారు. ఈ విషయమై జైపూర్‌కు చెందిన డైటీషియన్ మాట్లాడుతూ భోజనంతో లేదా తర్వాత అసలు తాగకూడు. గుండెల్లో మంట సమస్య ఉన్నవారు ఖాళీ కడుపుతో కొబ్బరి నీటిని తాగాలి. అయితే, ఖాళీ కడుపుతో ఈ హెల్తీ డ్రింక్ తాగడం వల్ల అనేక ఇతర ప్రయోజనాలు ఉన్నాయి. ఉదయాన్నే తాగడం వల్ల జీవక్రియ పెరుగుతుంది. అంతేకాదు బరువును తగ్గిస్తుంది కూడా. కడుపు ఆరోగ్యంగా ఉంటే శరీరం అనేక వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యల నుండి రక్షించబడుతుంది. అయితే సమస్యలతో భాధపడేవారు నిపుణుల సలహా మేరకు మధ్యాహ్నం కూడా తాగవచ్చు. సమ్మర్ సీజన్ కాబట్టి కొబ్బరి నీరు తీసుకోవడం ముఖ్యం. కానీ కిడ్నీ సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు కొబ్బరినీళ్లు తాగకూడదు. ఇది అధిక మొత్తంలో పొటాషియం ఉంటుంది కాబట్టి మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం పెరుగుతుంది. అలాంటివారు డాక్టర్ల సలహా తీసుకోవాల్సి ఉంటుంది.

## ఆరోగ్యానికి మేలు చేసే సోంపు షర్బత్..

### శరీర ఉష్ణోగ్రతను ఐసులా కరిగించే సూపర్ డ్రింక్ మీ కోసం..



ఎండ వేడిమి రోజురోజుకూ పెరుగుతోంది. ఏసీలు, కూలర్లు, శీతల పానీయాల వినియోగం పెరిగింది. ఐస్‌క్రీమ్‌ల నుండి స్మూతీస్ వరకు, లస్సీ నుండి ఇంట్లో తయారుచేసిన నిమ్మరసం, మజ్జిగ వరకు అందరూ ఆరోగ్యకరమైన, శరీరానికి చలువ చేసే ఆహారాన్ని కోరుకుంటున్నారు.. బాటిల్, రిఫ్రిజిరేటెడ్ పానీయాలు కెమికల్ ఆధారంగా తయారు చేస్తారు. కాబట్టి అవి వాటి ప్రత్యేక రుచిని కలిగి ఉంటాయి. కానీ, ఇంట్లో తయారుచేసిన జ్యూస్‌లు మరింత రుచిని కలిగి ఉంటాయి. అలాంటిదే వేసవిలో మనకు చలువు చేసే ఒక పానీయం ఉంది. ఇంట్లోనే ఈజీగా తయారు చేసుకోగల ఈ షర్బత్ ఎండవేడిమి, మంటను తగ్గించి మిమ్మల్నీ కూల్‌గా ఉంచుతుంది. అదేంటో ఇక్కడ తెలుసుకుందాం. సాధారణంగా మనమందరం సోంపును మౌత్ ఫ్రెషనర్‌గా ఉపయోగిస్తాము. చాలా మంది దీనిని వివిధ డెజర్ట్‌లకు కూడా కలుపుతారు. సోంపు షర్బత్ అనేది ప్రజలందరికీ ఎంతగానో నచ్చే చల్లని జ్యూస్. ఇది సాధారణంగా పసుపు రంగులో ఉంటుంది. దాని ప్రత్యేకమైన రుచి, వాసనకు పేరుగాంచింది. ఇది వేసవిలో చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దీన్ని తయారు చేయడానికి ఎక్కువ శ్రమపడాల్సిన అవసరం కూడా ఉండదు. ఇది శరీరంలోని వేడి నుండి ఉపశమనాన్ని అందజేయడమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. సోంపు షర్బత్‌ను తయారు చేయడానికి ప్రధాన పదార్థాలు సోంపు గింజలు, నిమ్మకాయ రసం, చక్కెర, నీరు. ఇకపోతే, ముందుగా ఈ సోంపు ఆరోగ్య ప్రయోజనాలను పరిశీలించినట్టయితే.. 1. జీర్ణక్రియలో.. ఇది జీర్ణక్రియను ప్రోత్సహించడానికి వేసవి కాలంలో శరీరాన్ని చల్లబరచడానికి సహాయపడుతుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్ణం వంటి జీర్ణ సమస్యలను తగ్గించడంలో సహాయపడే లక్షణాలను కలిగి ఉన్నాయి. ఇవి జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. ఇవి మంచి జీర్ణక్రియకు సహాయపడతాయి. అందుకే మనం ఎప్పుడు హోటల్ కి డిన్నర్ కి వెళితే భోజనం అయ్యాక సోంపు అందిస్తారు. 2 . ఫ్రెషెన్స్ బ్రీత్ .. యాంటీమైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉన్నాయి. దీని కారణంగా సోంపు నమలడం వల్ల శ్వాసను తాజాగా ఉంచుతుంది. ఇది లాలాజల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. ఇది నోటిలోని బ్యాక్టీరియాను తొలగించేందుకు సహాయపడుతుంది. 3. మలబద్ధకం కోసం ప్రయోజనకరమైన.. సోంపు తేలికపాటి భేదిమందు లక్షణాలను కలిగి ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఇది ప్రేగు కదలికను ప్రేరేపిస్తుంది. ఇది మలబద్ధకం నుండి ఉపశమనాన్ని అందించడంలో సహాయ పడుతుంది. 4. కడుపులో మంటను తగ్గిస్తుంది.. కడుపులో గ్యాస్‌ను తొలగించడంలో సహాయపడే కార్మినేటివ్ లక్షణాలను కలిగి ఉంటుంది. జీర్ణాశయంలోని కండరాలను సడలించడం, గ్యాస్ ఉత్పత్తిని తగ్గించడం ద్వారా ఉబ్బరం, కడుపులో అసౌకర్యాన్ని తగ్గించడంలో సోంపు బాగా సహాయపడుతుంది. 5. యాంటీ ఆక్సిడెంట్ గుణాలు.. సోంపు శరీరంలోని హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను తటస్తం చేయడంలో సహాయపడే ఫ్లేవనాయిడ్లు, ఫినోలిక్స్ వంటి యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇది మంటను తగ్గిస్తుంది. గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. మీరు క్రమం తప్పకుండా సోంపును తీసుకుంటే అది మీ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. సోంపుతో షర్బత్ తయారీకి కావాల్సిన పదార్థాలు, ఎలా తయారు చేయాలో ఇక్కడ తెలుసుకుందాం.. 2 టేబుల్ స్పూన్లు సోంపు 1/2 కప్పు చక్కెర మీరు కావాలంటే చక్కెరకు బదులుగా తేనెను కూడా ఉపయోగించవచ్చు. 1 నిమ్మకాయ రసం 1 లీటరు నీరు తాజా పుదీనా ఆకులు మరింత రుచి కోసం, రోజ్ వాటర్ ను కొద్దిగా కలుపుకోవచ్చు. సోంపు షర్బత్ ఆరోగ్య ప్రయోజనాలు: సోంపు షర్బత్ జీవక్రియను పెంచి, కొవ్వు కరుగుటకు సహాయపడుతుంది. శరీర ఉష్ణోగ్రతను చల్లబరుస్తుంది. వేసవిలో శరీర ఉష్ణోగ్రత పెరిగి, డీహైడ్రేషన్‌కు దారితీస్తుంది. సోంపు షర్బత్ చల్లగా ఉండటం వల్ల శరీరాన్ని చల్లబరుస్తుంది. డీహైడ్రేషన్‌ను నివారిస్తుంది. తిన్న తర్వాత తీసుకుంటే, నోటి దుర్వాసనను తొలగిస్తుంది. సోంపు గింజల్లో యాంటి బాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. ఇవి నోటిలోని బ్యాక్టీరియా పెరుగుదలను నిరోధించి, నోటి దుర్వాసనను తొలగిస్తాయి. సోంపు షర్బత్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల కడుపు నొప్పి, విరేచనాలు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ఏదైనా సరే మోతాదుకు మించి తీసుకోవటం మంచిది కాదు.

## ఈ ఐదుగురు మెంతులకు దూరంగా ఉండాలి.. లేకుంటే ప్రమాదమే..!



అనేక ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి, అద్భుతమైన ప్రయోజనాలను పొందడానికి మెంతి గింజలను తీసుకుంటారు. మెంతి గింజల వల్ల కలిగే ప్రయోజనాల గురించి చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. అయితే ఆహారం రుచిని పెంచేందుకు ఈ గింజలను రకరకాలుగా ఉపయోగిస్తాం. మెంతి గింజలను సాధారణంగా ఔషధంగా లేదా ఆహారంతో తీసుకుంటారు. ఇవి చాలా ఆరోగ్యకరమైనవి. కానీ కొంతమంది మెంతి గింజలను తీసుకోవడం ద్వారా సమస్యలను ఎదుర్కోవచ్చు. మీ శరీరంలో కింద పేర్కొన్న కొన్ని సమస్యలు ఉంటే, మీరు మెంతులు తినకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మెంతులను ఎవరు తీసుకోకూడదు డయాబెటిస్: మెంతి గింజలు చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి. అయితే కొన్ని సందర్భాల్లో దీని వినియోగం మధుమేహాన్ని మరింత పెంచే అవకాశం ఉంది. మధుమేహ రోగులు మెంతి గింజలను తీసుకునే ముందు వారి వైద్యుడిని సంప్రదించాలి. అలర్జీ: కొందరికి మెంతి గింజల వల్ల అలర్జీ రావచ్చు. అందువల్ల మీరు మెంతులు వైద్యపరమైన ప్రతిచర్య ఏదైనా సూచనను కలిగి ఉంటే, మీరు దానిని నివారించాలి. అల్సర్: మెంతుల వినియోగం అల్సర్ రోగులకు హానికరం. ఈ రోగులు మెంతి గింజలను తీసుకోవడం ద్వారా సమస్యలను ఎదుర్కొంటారు. హార్మోన్ల అసమతుల్యత: కొన్ని సందర్భాల్లో మెంతి గింజల అధిక వినియోగం హార్మోన్ల స్థాయిలను భంగం చేస్తుంది. అందుకే హార్మోన్ల అసమతుల్యత లక్షణాలు ఉన్న వ్యక్తులు మెంతి గింజలను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి. శరీర ఉష్ణోగ్రత అసమతుల్యత: కొంతమందికి మెంతులను తీసుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రతలో అసమతుల్యత ఏర్పడవచ్చు. ఇది శారీరక సమస్యలను కలిగిస్తుంది. ఈ సమస్యలన్నీ ప్రతి వ్యక్తికి రావని గమనించండి. అయితే మీకు ఈ సమస్యలు ఏవైనా ఉంటే మీరు మెంతి గింజలను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి.



# సంక్రాంతికి మారిన గేమ్‌ఛేంజర్

## డిసెంబర్‌పై కన్నేసిన పలు సినిమాలు

సినిమాల విడుదలకు పండుగలే మెయిన్ టాగ్గంట్. సంవత్సరం సెకెండాఫ్‌లో దసరా, దీపావళి ముఖ్య పండుగలు. వాటిని టార్గెట్ చేసుకుని మేకర్స్ సినిమాల విడుదల ప్లాన్ చేసుకుంటారు. ఈ రెండు పండుగల తర్వాత ఓ మాదిరి చిత్రాలు విడుదలవుతాయి కానీ పెద్ద చిత్రాలను విడుదల చేయడానికి అంతగా ఆసక్తి చూపించరు. ఇకపోతే జనవరి ప్రారంభం, సంక్రాంతికి సినిమాలను భారీగా ప్లాన్ చేస్తారు. అందుకు భిన్నంగా ఇప్పుడు పరిస్థితి ఉంది. డిసెంబరులోనూ పెద్ద సినిమాలు క్యూ కడుతున్నాయి. ఈ ఏడాది డిసెంబర్‌లో క్రేజీ సినిమాలు రాబోతున్నాయి. ముఖ్యంగా డిసెంబరుపై చాలా సినిమాల గురి ఉంది. డిసెంబరు 6న 'పుష్ప 2' విడుదలకు సిద్ధమైంది. 20న 'గేమ్ ఛేంజర్' విడుదల అనుకున్నారు. కానీ వాయిదా పడింది. ఆ చిత్రం సంక్రాంతి బరిలో ఉంది. అలా గేమ్ ఛేంజర్ వాయిదా పడిందో, ఆ డేట్ పై మిగిలిన నిర్మాతలు కన్నేశారు. నాగచైతన్య 'తండేల్'ని డిసెంబరు 20న విడుదల చేయాలన్నది ఓ ప్లాన్. అయితే దీనిపై అల్లు అరవింద్ ఇంకా సరైన నిర్ణయం తీసుకోలేదు. డిసెంబరు 20న నితిన్ 'రాబిన్ హుడ్' విడుదల చేసే ఆలోచనలో ఉంది చిత్రబృందం. ఇంద్రగంటి మోహనకృష్ణ, పియదర్శి కాంబినేషన్‌లో 'సారంగపాణి' అనే ఓ సినిమా రెడీ అవుతోంది. ఈ సినిమాను డిసెంబరు 20న విడుదల చేయాలని చూస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కూడా ఇదే డేట్‌ని ఫిక్స్ చేసింది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో 'మ్యాజిక్' అనే సినిమా రూపుదిద్దుకొంది. డిసెంబరు 21న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నామని చిత్రబృందం ప్రకటించేసింది. అంతే కాదు మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'ను డిసెంబరు 20 లేదా 21న విడుదల చేసే సన్నాహాల్లో ఉన్నారు. ఆగష్టు 15, వినాయక చవితి, దసరాకి చాల సినిమాలే విడుదలయ్యాయి. అయితే ఏదీ ఆశించిన రీతిలో వసూళ్లు తీసుకురాలేకపోయాయి. మళ్లీ దీపావళికి సినిమాలు వరుస కట్టాయి. డిసెంబర్‌లో క్రిస్మస్‌కు ముందు కూడా ఇలాంటి వాతావరణమే కనిపించబోతోంది. సోలోగా రావడం కంటే ఇలా పోటీ మధ్యలో వస్తేనే కిక్ ఉంటుందని నిర్మాతలు భావిస్తున్నట్లు పరిస్థితి కనిపిస్తోంది.

# డియర్ స్టూడెంట్స్'తో వస్తున్న నయనతార

లేడీ సూపర్‌స్టార్ నయనతార వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. 'టెస్ట్ , 'మన్నాన్‌గట్టి 1960' చిత్రాలు పూర్తి చేసిన ఆమె ప్రస్తుతం 'డియర్ స్టూడెంట్స్'తో సినిమాతో బిజీ కానుంది. ఇటీవల చిత్ర బృందం ఆమెను సెట్‌లోకి ఆహ్వా నించారు. ఈ విషయాన్ని తెలుపుతూ నయన్ ఓ ఫొటో షేర్ చేశారు. కాలేజీ స్టూడెంట్స్ చుట్టూ తిరిగే ఈ వినోదాత్మక చిత్రాన్ని సందీప్ కుమార్, జార్జ్ ఫిలిప్ సంయుక్తంగా తెరకెక్కి స్తున్నారు. నివిన్ పౌలీ కీలక పాత్ర పోషిస్తున్నారు. 'లవ్ యాక్షన్ డ్రామా' చిత్రం తర్వాత నివిన్, నయన జంటగా నటిస్తున్న చిత్రమిది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇందులో నయన విద్యా రుద్రన్ అనే టీచర్‌గా కనిపించనున్నటు సమాచారం. ప్రస్తుతం నయన జాబితాలో 'అమ్మోరు 2', 'తని ఒరువన్ 2' చిత్రాలున్నాయి. గతేడాది జవాన్, ఇరైవన్, అన్నపూర్ణ చిత్రాలతో అలరించారు నయన్.






# త్వరలోనే పట్టాలకెక్కనున్న ఓజి

అగ్ర కథానాయకుడు పవన్‌కల్యాణ్ సినిమాలు ఒకదానివెంట మరొకటి వరుసగా పునః ప్రారంభం అవుతున్నాయి. 'హరి హర వీరమల్లు' చిత్రీకరణ ఇప్పటికే ఊపందుకుంది. విజయవాడలో కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. త్వరలోనే 'ఓజీ' సెట్‌లోకీ అడుగు పెట్టనున్నారు పవన్‌కల్యాణ్. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న 'ఓజీ' చిత్రీకరణని పునః ప్రారంభించినట్టు నిర్మాణ సంస్థ ప్రకటించింది. రామోజీ ఫిల్మ్‌సిటీలో కథానాయకుడు లేని కొన్ని కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. 'హరిహర వీర మల్లు' పూర్తయిన తర్వాత, పవన్‌కల్యాణ్ 'ఓజీ' సెట్లోకి అడుగు పెట్టనున్నారు. ఈ రెండు సినిమాలు వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఎన్నికల కారణంగా గతేడాది వీటి చిత్రీకరణ నిలిచిపోయిన విషయం తెలిసిందే. వీటితోపాటు 'ఉస్తాద్ భగత్‌సింగ్' కూడా పూర్తి చేయాల్సి ఉంది పవన్. ఆయన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే, మధ్యలో సినిమాలకి సమయం కేటాయిస్తున్నారు.



# చిత్రసీమ అండతోనే ధైర్యంగా నిలబడ్డా

కొండా సురేఖ వ్యాఖ్యలపై మరోమారు స్పందించిన సమంత మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై సమంత మరోసారి స్పందించారు. తన వెబ్ సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ' ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో దీని గురించి మాట్లాడారు. ఇటీవల చర్చనీయాం శమైన కొండా సురేఖ వ్యాఖ్యల గురించి ప్రస్తావించగా.... సమంత ఈవిధంగా స్పందించారు. 'ఈరోజు ఇక్కడ కూర్చోవడానికి ఎంతోమంది మద్దతు కారణం. చిత్రసీమకు చెందిన ప్రముఖుల ప్రేమ, నాపై వారికి ఉన్న నమ్మకమే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టింది. వారు నాలో ధైర్యం నింపారు. కష్టాలను ఎదుర్కోవడంలో వారి మద్దతు నాకెంతో సాయపడింది. వారు నా పక్షాన నిలవకపోతే కొన్ని పరిస్థితులను అధిగమించేందుకు చాలా సమయం పట్టేది. నా చుట్టూ ఉన్నవారి నమ్మకం వల్లే సమస్యలను ఎదుర్కోగలిగాను' అని అన్నారు. ఆన్‌లైన్ ట్రోలింగ్‌లపై సమంత స్పందిస్తూ.. అలాంటి వాటి గురించి ఎక్కువ ఆలోచించను అని అన్నారు. 'ద్వేషపూరిత సందేశాలను స్వీకరించినప్పుడు వాటి ప్రభావం నాపై పడకుండా చూసుకుంటాను. దాన్ని పంపిన వారు కూడా అలాంటి బాధనే అనుభవించారేమో అని ఆలోచిస్తాను' అని తెలిపారు. ఇక తన అనారోగ్య కారణం వల్ల 'సిటాడెల్: హనీ బన్నీ'ను తిరస్కరించాలని భావించినట్లు సమంత చెప్పారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్‌లో ఆమె స్పై ఏజెంట్‌గా నటించారు. దీని గురించి మాట్లాడుతూ.. దర్శకులు నన్ను ఈ సిరీస్ కోసం సంప్రదించగానే నేను చేయలేనని చెప్పాను. ఈ పాత్రను చేయగలనని నిజంగా అనుకోలేదు. దానికి సరిపోయే నలుగురు హీరోయిన్ల పేర్లను కూడా రాజ్ అండ్ డీకే కు సిఫార్సు చేశాను. వాళ్లు అయితే ఈ పాత్రకు కచ్చితంగా న్యాయం చేయగలరని చెప్పాను. నేను చేయలేనని వేడుకున్నా. అయినా వాళ్లు పట్టుబట్టి నాకోసం వేచిచూశారు. మరొకరిని తీసుకోకుండా నాతో చేయడం నా అదృష్టంగా భావించానని చెప్పారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో తెరకెక్కిన 'సిటాడెల్: హనీ బన్నీ'లో సమంత, వరుణ్ ధావన్‌లు ప్రధానపాత్రల్లో నటించారు. నవంబర్ 7 నుంచి అమెజాన్ ప్రైమ్ వేదికగా ఈ సిరీస్ అందుబాటులో ఉండనుంది.



# ప్రదీప్ తాజా చిత్రం

## అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి

యాంకర్‌గా కెరీర్ మొదలుపెట్టి.. క్యారెక్టర్ ఆర్టిస్టుగా పలు చిత్రాల్లో నటించి.. హీరోగా మారిన వారి జాబితాలో ముందు వరుసలో ఉంటాడు ప్రదీప్ మాచిరాజు. 30 రోజుల్లో ప్రేమించటం ఎలా? సినిమాతో హీరోగా గ్రాండ్ ఎంట్రీ ఇచ్చాడు ప్రదీప్. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మ్యూజికల్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ప్రదీప్‌కు హీరోగా మంచి మార్కులే పడ్డాయి. చాలా రోజుల తర్వాత రెండో సినిమాను ప్రకటించేశాడు ఈ స్టార్ యాంకర్. ప్రదీప్ ఈ సారి పవన్ కల్యాణ్ సినిమా టైటిల్‌పైనే కన్నేశాడు. ప్రదీప్ నటిస్తోన్న తాజా చిత్రం అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి. ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. హీరోయిన్లు ఒకరినొకరు చూసుకుంటూ చిరునవ్వులు చిందిస్తున్న స్టిల్ నెట్టింటిని షేక్ చేస్తోంది. ఓ వైపు అందమైన ఊరు, మరోవైపు ఆయుధాలు చేత బట్టిన గ్రామస్థులు, క్లాస్ రూంలో ప్రదీప్, ఇంట్లో హీరోయిన్ కనిపిస్తున్న విజువల్స్‌తో కట్ చేసిన మోషన్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రం ప్రేమ కథ నేపథ్యంలో ఉండబోతుందని హింట్ ఇచ్చేసినట్టు మోషన్ పోస్టర్ చెబుతుండగా.. మేకర్స్ ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. మోంక్స్ అండ్ మంకీస్ పిక్చర్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రానిక ఇవ రాధన్ సంగీతం అందిస్తున్నాడు.



# బాహుబలి -3 ఉంటుంది

## తమిళనిర్మాత కె.ఈ జ్ఞానవేల్ ఆసక్తికర వ్యాఖ్యలు

బాహుబలి -3' గురించి తమిళనిర్మాత కె.ఈ జ్ఞానవేల్ రాజా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు సినిమా సత్తాచాటిన ఈ చిత్రం తమిళ వెర్షన్‌కు ఆయన నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమా రెండు భాగాలు సక్సెస్ సాధించి భారీ వసూళ్లు రాబట్టడంతో అభిమానులు పార్ట్ 3 కోసం ఎదురు చూస్తున్నారు. తాజాగా కేఈ జ్ఞానవేల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ దీనిపై ఆసక్తికర కామెంట్ చేశారు. 'కంగువా' సీక్వెన్స్‌ల మధ్య గ్యాప్‌ను సమర్థిస్తూ 'బాహుబలి 3' ప్రస్తావనను తీసుకొచ్చారు. 'కంగువా' ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. 'గత వారం బాహుబలి మేకర్స్‌తో చర్చించాను. పార్ట్ 3 ప్లాన్ చేసే పనిలో ఉన్నారు. దానికంటే ముందు రెండు సినిమాలు ఉన్నాయి. వాటి తర్వాతే 'కల్కి 2', 'సలార్ 2' రిలీజ్ అవుతాయి' అని అన్నారు. దీంతో ఈ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. 'బాహుబలి-3' కోసం వెయిటింగ్ అంటూ ప్రభాస్ ఫ్యాన్ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. గతంలో కూడా రాజమౌళి ఒక సందర్భం లో బాహుబలి-3' గురించి మాట్లాడారు. దీని మూడో భాగం ఉంటుంది. 'బాహుబలి' చుట్టూ జరిగే ఎన్నో సంఘటనలు ఈసారి మీకు చూపించనున్నాం. దీనికి సంబంధించిన వర్క్ చేస్తున్నాం. మా నిర్మాత శోభు యార్లగడ్డ కూడా ఆసక్తిగా ఉన్నారు. అయితే ఈ సినిమా రావడానికి కాస్త సమయం పట్టొచ్చు. కానీ 'బాహుబలి' రాజ్యం నుంచి ఆసక్తికర వార్త అయితే కచ్చితంగా ఉంటుందని అన్నారు. ప్రస్తుతం రాజమౌళి..మహేశ్ సినిమాతో 'ఎస్ఎస్ఎంబీ29' చిత్రం చేయబోతున్నారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించి ప్రీ ప్రొడక్షన్ పనులు, ఫొటో షూట్‌లు జరుగుతున్నాయి. అమెజాన్ అడవుల నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రంలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు విదేశీ భాషల్లోనూ ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com